పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



గ్రీస్ మాజీ ప్రధాని, సోషలిస్టు నేత సిమిటిస్ కన్నుమూత

యూన్ అరెస్టు కోరుతూ భారీ ర్యాలీ

జాతీయ రాజకీయాల్లో సన్నగిల్లిన తెలుగువారి పాత్ర

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 39 | సోమవారం | 06-01-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## కుల వ్యవస్థను అంతం చేస్తేనే
# అన్నింటా అభివృద్ధి

ప్రధాని మోదీ కులవ్యవస్థ నిర్మూలనపై మాట్లాడకపోవడం దురదృష్టకరం

బిజెపి, ఆర్‌ఎస్ఎస్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాలి

లాల్, నీల్ జెండాలు ఏకం కావాలి

'ఎఐడిఆర్ఎం' బహిరంగ సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

భారతదేశంలో సామాజిక అభివృద్ధి, సంస్కరణలు, అభివృద్ధికి వేలాది ఏళ్లుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ రక్కసిగా మారిందని, కుల వ్యవస్థ రక్కసిని అంతం చేస్తేనే దేశంలో అన్ని రంగాలు అభివృద్ధి సాధించేందుకు మార్గం మరింత సుగమం అవుతుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్ అంటూ గొప్ప గొప్ప మాటలు చెబుతున్న ప్రధాని మోదీ సామాజిక రుగ్మతలను రూపుమాపే కుల వ్యవస్థ నిర్మూలన గురించి మాత్రం మాట్లాడకపోవడం దురదృష్టకరమని రాజా పేర్కొన్నారు. కారల్ మార్క్స్‌దైనా, అంబేద్కర్‌దైనా భారత్‌లో కులరహిత, వర్గరహిత సమాజం నిర్మాణమే లక్ష్యమని, ఇందు కోసం లాల్, నీల్ జండాలు ఏకమై, బిజెపి, ఆర్‌ఎస్ఎస్ శక్తుల నుంచి ఈ దేశాన్ని రక్షించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాలని రాజా పిలుపునిచ్చారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్ఎం) 2వ మహాసభల ప్రారంభం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభ జరిగింది. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభకు డి.రాజా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్,

తరువాయి 12లో



సమసమాజస్థాపనతోనే..
### అసమానతల నిర్మూలన సాధ్యం
కూనంనేని సాంబశివరావు

సమాజంలో అసమానతలు, అంతరాల నిర్మూలన సమసమాజం స్థాపన ద్వారానే సాధ్యమని కూనంనేని సాంబశివరావు అన్నారు. అయితే ఇది సాధించాలంటే ఈ పాలకులను ఓడించి మన రాజ్యం మనం తెచ్చుకో వాలని, ఇది సాధ్యం కావాలంటే కష్టజీవుల కోసం నిరంతరం పోరాడే ఎర్ర జెండాలు రెపరెపలాడాలని, ఇందుకు అన్ని ఎర్రజెండాలతో పాటు నీల్ జెండా ఏకం కావాలని కోరారు. ప్రపంచంలో మనిషి

తరువాయి 2లో


## గ్రూప్-1 ఉద్యోగ నియామకాలు
# మార్చి 31లోగా పూర్తి

యువతీయువకులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో జాబ్ క్యాలెండర్

దాని ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు

రాజీవ్‌గాంధీ అభయహస్తం చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ అభ్యర్థులకు రూ.లక్ష చెక్కుల పంపిణీ





ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో యువతీయువకులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన రాజీవ్‌గాంధీ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద సింగరేణి సౌజన్యంతో ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. సివిల్స్‌లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయలు ఆర్థిక సహాయం కాదని, ప్రోత్సాహకంగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని, ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే స్వతంత్ర భారత చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా 55,143 ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని, ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వివరించారు. ఉమ్మడి ఎపి సహా తెలంగాణ ఏర్పడిన 14 ఏళ్లుగా గ్రూప్ 1 నిర్వహించలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే అందుకు ఉన్న అడ్డంకులు, కుట్రలను అధిగమించి 563 గ్రూప్ 1 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించామని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోగా గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాలను పూర్తి చేయబోతున్నామని సిఎం చెప్పారు. సాధించాలన్న పట్టుదల ఉంటేనే

తరువాయి 2లో



## ఫార్ములా ఈ-రేస్ కేసులో
# నేడు ఎసిబి ముందుకు కెటిఆర్

దర్యాప్తు సంస్థ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ-కారు రేస్ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మున్సిపల్ మంత్రి,బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ సోమవారం ఎసిబి విచారణకు హాజరుకానున్నారు. కెటిఆర్‌ను విచారించేందుకు ఎసిబి జాయింట్ డైరెక్టర్ (ఎస్‌పి) మహిళా ఐపిఎస్ అధికారి రితిరాజ్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌విఎన్ శివరామ్ (ఎఎస్‌పి)లు ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయం వద్ద ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఫార్ములా ఈ-కార్ రేస్ (10వ)కోసం నిబంధనలకు విరుద్ధంగా హెచ్ఎండి రూ.55 కోట్ల నిధులను దారి మళ్లించిందని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర గవర్నర్ అనుమతితో ఎసిబి గత నెల 19న ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసింది. కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2గా అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఎ3గా హెచ్ఎండిఎ

తరువాయి 2లో

# సంక్షేమ పథకాలు ఆపం




బిఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా బరాబర్ అమలు చేస్తాం

వరంగల్ జిల్లా గీసుకొండ బహిరంగ సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపు

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి

బిఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా సంక్షేమ పథకాలు బరాబర్ అమలు చేస్తాం... ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం కట్టుబడి ఉంది పాలకుల కోసం కాదుఅని వరంగల్ జిల్లా గీసుకొండ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామంలో 8 కోట్ల 40 లక్షలతో నిర్మించే మూడు 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌లకు ఉప ముఖ్య మంత్రి శంఖు స్థాపన చేశారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్వర్యంలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వదు, ఐదు ఎకరాల కే పరిమితం చేస్తుందని, బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది ప్రచారం చేశారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి మీడియా సంస్థల్లో, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. గతంలో 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ నేతలు ఒక్క హామీ పూర్తి చేయలేదని,తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 50,000 ఉద్యోగాలు భర్తీ చేశాం అని,

తరువాయి 2లో

# కాల్పులతో దద్దరిల్లిన బస్తర్

ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు హతం

ఓ హెడ్‌కానిస్టేబుల్ వీరమరణం

**దంతేవాడ :** ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం కాల్పులతో మరోసారి దద్దరిల్లింది. భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు హతమైనట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ కూడా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నారాయణపూర్, దంతేవాడ్ జిల్లాల సరిహద్దు వెంట ఉన్న దక్షిణ అబూజ్‌మాద్‌లోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం డిఆర్‌జి,

తరువాయి 2లో





# హైదరాబాద్ ఆధునిక టెక్నాలజీ హబ్

మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

కృత్రిమ మేధ (ఎఐ), ఆధునిక సాకేతికలో గ్లోబల్ హబ్ గా హైదరాబాద్ విస్తరిస్తోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిభావంతులైన మానవ వనరులు, అద్భుతమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నందున కొత్త సంస్థలు హైదరాబాద్ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయని అన్నారు. ఆదివారం కృత్రిమ మేధ ఆధారిత సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా డెలివరీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన 'డేటా ఎకానమీ' నూతన వర్క్ స్టేషన్ ను ఆయన హైటెక్ సిటీలో ప్రారంభించారు. క్వాంటమ్ కంప్యూటింగ్, డిజిటల్ ట్విన్స్, డేటా బదిలీ రంగాల్లో ఈ సంస్థ గణనీయ పురోగతిని సాధించడం సంతోషంగా ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ పరంగా సంస్థ విస్తరణకు తమ వంతు సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నైపుణ్యం ఉన్న మానవ వనరులను పరిశ్రమకు అందిస్తుందని ఆయన వెల్లడించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు సాఫ్ట్ వేర్ సంస్థలు విస్తరించాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. స్టార్ట్ అప్ కంపెనీలు, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రాలు, డేటా సెంటర్లు పెద్ద ఎత్తున

తరువాయి 2లో

## డిండి ఎత్తిపోతలకు క్యాబినేట్
# ఆమోదం హర్షణీయం





ఫ్లోరైడ్ భూతం అంతం

మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు మేలు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

డిండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పట్ల సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని ఆమోదించడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, జిల్లాకు చెందిన మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు పల్లా వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకానికి రూ.1,788.89 కోట్లతో ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించే అలైన్‌మెంట్‌ను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంతో నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత, వెనుకబడిన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని, ఆ నియోజకవర్గాలకు సాగు, తాగు నీటి వసతి ఏర్పడుతుందని పల్లా వెంకట రెడ్డి వివరించారు. ఈ పథకం కోసం సిపిఐ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా పోరాటాలు, పాదయాత్రలు చేశామని పల్లా వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

**ఏదుల నుంచి డిండికి నీరు**

డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో

తరువాయి 2లో

## మోదీ సర్కార్ మతోన్మాదంతో
# దేశప్రజలు విచ్ఛిన్నం



- బిఆర్ఎస్ భూ దోపిడీపై 'సిట్'తో ప్రత్యేక విచారణ జరిపించాలి
- కొండలు,గుట్టలకు పట్టాలిచ్చిన ఘనత కెసిఆర్‌కే దక్కింది
- ప్రాజెక్టులకు భూములిచ్చిన భూనిర్వాసితులకు న్యాయం చేయాలి
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

రాజ్యాంగాన్ని అమలు చేయాలని సిపిఐ కోరుతుందని.. కానీ నేటి పాలకులు అమలు చేయటం లేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మోదీ సర్కార్ మతోన్మాదంతో దేశ ప్రజలను విచ్ఛిన్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్రం సర్కార్ కార్పొరేట్ శక్తుల కనుసైగల్లో పనిచేస్తుందన్నారు. మోదీ జమిలి ఎన్నికల ఎజెండాతో మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని ఆరోపించారు. కార్మికుల నెత్తుటితో పుట్టుకొచ్చింది ఎర్రజెండా అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా

తరువాయి 12లో



# పోర్‌బందర్‌లో కూలిన హెలికాప్టర్

ముగ్గురు సిబ్బంది మృతి

**పోర్‌బందర్ :** గుజరాత్‌లో విమాన ప్రమాదం జరిగింది. పోర్‌బందర్ నగర శివారులోని ఓ విమానాశ్రయంలో ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసిజి)కు చెందిన హెలికాప్టర్ కూలిపోయింది.ఆ వెంటనే మంటలు చెలరేగి హెలికాప్టర్ దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రోజువారీ శిక్షణలో భాగంగా ఐసిజికి చెందిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ (ఎఎల్‌హెచ్)

తరువాయి 12లో

ప్రపంచం

## గ్రీస్ మాజీ ప్రధాని,సోషలిస్టు నేత
# సిమిటిస్ కన్నుమూత



**ఏథెన్స్:** గ్రీస్ మాజీ ప్రధాని, ప్రముఖ సోషలిస్టు నేత కొన్స్టాస్ సిమిటిస్ (88) ఇక్కడి ఒక ఆసుపత్రిలో, ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. స్పృహ కోల్పోయిన సిమిటిస్‌ను ఆయన కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. మరణానికి గల కారణాలు కనుగొనడానికి అటాప్సీ నిర్వహిస్తామని తెలిపారు. సోషలిస్ట్ పిఎఎస్‌ఒకె పార్టీ సహవ్యవస్థాపకుడైన సిమిటిస్ గ్రీస్‌ను అభివృద్ధి పథంలో నడిపించారు. సోషలిస్టు పార్టీ మొదట అధికారంలో ఉన్న నాలుగు సంవత్సరాల్లో (1981–1985) గ్రీస్‌లో పలు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రత్యేకించి ఆర్థిక రంగంలో పలు సంస్కరణలు అమలయ్యాయి. 1974లో సోషలిస్ట్ పిఎఎస్‌ఒకె పార్టీ మరో సహవ్యవస్థాపకుడు ఆండ్రియాస్ పపంద్రియా సహకారంతో సిమిటిస్ పలు కీలక నిర్ణయాలను అమలు పరిచారు. అయితే, తదుపరి కాలంలో పపంద్రియా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉదారవాద వేత విధానాన్ని అమలు చేశాడు. దీనిని వ్యతిరేకించిన సిమిటిస్ 1987లో తన ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా చేశాడు. 1993లో సోషలిస్టు పార్టీ మరోసారి ఎన్నికల్లో గెలిచినప్పుడు కూడా పపంద్రియా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. కానీ, తీవ్ర అనారోగ్యం కారణంగా ఆయన 1996లో రాజీనామా చేయకతప్పలేదు. ఆ వెంటనే గ్రీస్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సిమిటిస 2004 వరకూ ఆ పదవిలో ఉన్నారు. సిమిటిస్ హఠాన్మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నివాళులర్పించారు.

# యూన్ అరెస్టు కోరుతూ భారీ ర్యాలీ



**సియోల్:** అభిశంసన తీర్మానంతో పదవీచ్యుతుడైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను వెంటనే పదవి నుంచి తప్పించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ, గడ్డకట్టే చలిలో కూడా వారు ర్యాలీగా యూన్ అధికారిక నివాసమైన అధ్యక్ష భవనం వద్దకు చేరారు. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. యూన్ అరెస్టుకు సియోల్ కోర్టు గత మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అతను నివాసం ఉంటున్న అధ్యక్ష భవనంలో సోదాలకు అనుమతించింది. దేశంలో యూన్ మార్షల్ లా విధించడంతో తలెత్తిన నిరసన, చివరికి అతనిపై అభిశంసన తీర్మానానికి కారణమైన విషయం తెలిసిందే. మార్షలాను కొన్ని గంటల్లోనే ఎత్తివేసిన యూన్, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పారు. భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగవని హామీ ఇచ్చారు. అయితే, ప్రతిపక్ష పార్టీలు అతనిపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మొదటిసారి అధికార పక్ష సభ్యులంతా ఓటింగ్‌కు హాజరుకాకపోవడంతో, తగినంత కోరం లేక తీర్మానం చెల్లలేదు. అయితే, రెండోసారి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పుడు, దానిని సభ్యులు ఆమోదించారు. పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యూన్‌ను అధికార నివాసం నుంచి ఖాళీ చేయించడానికి, తనిఖీలు నిర్వహించడానికి అధికారులు ప్రయత్నిస్తునే ఉన్నారు. కానీ, యూన్ మొండికేసి కూర్చోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవినీతి నిరోధక శాఖ అధికారులను, సిబ్బందిని అధ్యక్ష భవనం వద్ద ఉన్న భద్రతా దళాలు లోనికి వెళ్లనియ్యడం లేదు. యూన్ అధికార పీఠం నుంచి వైదొలగడానికి కోర్టు ఇచ్చిన సమయం సోమవారంతో ముగుస్తుంది. కానీ, ఆదివారం కడపటి వార్తలు అందేసమయానికి యూన్ నుంచి ఎలాంటి స్పందన లేదు. అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి అధ్యక్ష భవనానికి వెళతారా? లేదా? అన్నది ఇంకా తెలియరాలేదు. యూన్ ఇదే రీతిలో మొండి వైఖరిని కొనసాగిస్తే, సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద భద్రతా సిబ్బందికి, అధికారులకు మధ్య సంకుల సమరం తప్పకపోవచ్చు.

# ఆస్ట్రియా పీపుల్స్ పార్టీ తాత్కాలిక నేతగా స్టాకర్



**వియన్నా:** ఆస్ట్రియా పీపుల్స్ పార్టీ (ఎపిపి) తాత్కాలిక నేతగా క్రిస్టియన్ స్టాకర్ ఎన్నికయ్యారు. ఆస్ట్రియా చాన్సలర్ పదవికి కార్ల్ నెహెమ్మర్ రాజీనామా చేయడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి స్టాకర్‌ను ఎన్నుకున్నారు. ఆయన 2022 నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. సంకీర్ణ కూటమి నుంచి లిబరల్ పార్టీ 'ఎన్ఇఒఎస్' వైదొలగడంతో, ప్రస్తుతం పీపుల్స్ పార్టీ, లెఫ్ట్ సోషల్ డెమోక్రాట్స్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, దేశ ఆర్థిక వ్యవస్థను ఏ విధంగా సరిదిద్దాలనే విషయంపై ఒక అవగాహనకు రాలేకపోయాయి. ఈ సమావేశం అనంతరం తాను రాజీనామా చేస్తున్నట్టు నెహెమ్మర్ ఇది వరకే ప్రకటించారు. అనుకున్న విధంగానే ఆయన రాజీనామా పత్రాన్ని సమర్పించడంతో, కొత్త నేతగా స్టాకర్ ఎన్నికయ్యారు.

# మా వైమానిక దళాన్ని బలోపేతం చేయండి

### మిత్ర దేశాలకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వినతి

### 540 మంది సైనికులను హతమార్చినట్టు రష్యా ప్రకటన



**కీవ్ (ఉక్రేన్):** ఇతోధిక సాయంతో, తమ దేశ వైమానిక దళాన్ని మరింత బలోపేతం చేయాల్సిందిగా మిత్రదేశాలకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. జర్మనీలోని రామ్‌స్టైన్ ఎయిర్ బేస్లో జరగబోయే మిత్రదేశాల సమావేశంలో కొన్ని ప్రతిపాదనలు చేయనున్నట్టు చెప్పారు. టీవీ మాధ్యమంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, రష్యా బెటాలియన్‌ను తుదముట్టించామని ప్రకటించారు. అందులోని ఉత్తర కొరియా సైనికులు కూడా హతమైనట్టు జెలెన్స్కీ తెలిపారు. రష్యా భూభాగమైన కర్స్క్ ప్రాంతంలో తీవ్రమైన పోరు జరిగినట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం పొక్రోస్క్ రీజియన్‌లో ముమ్మర యుద్ధం కొనసాగుతున్నదని జెలెన్స్కీ తెలిపారు. రష్యా యుద్ధ నియమాలను పాటించడం లేదని, ఖార్కీవ్, సుమీ ప్రాంతాల్లోని గ్రామాలపై దాడులు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. ఇలా వుంటే, కర్స్క్ రీజియన్‌లో, గత 24 గంటల్లో 540 మంది కీవ్ సైనికులను హతమార్చినట్టు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఉక్రేన్ ప్రయోగించిన 8 అమెరికా క్షిపణులు, 72 డ్రోన్లను గగనతలంలోనే కూల్చివేసినట్టు తెలిపింది. ఉక్రేన్ సైనిక విమానాశ్రయాలు, డ్రోన్ తయారీ కేంద్రాలు, ఆయుధ గిడ్డంగులను తీవ్రంగా నష్టపరిచామని కూడా రష్యా రక్షణ శాఖ వివరించింది. రష్యా నుంచి 1358 మంది ఉక్రేన్ సైనికులు, పౌరులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చామని జెలెన్స్కీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. అయితే, రష్యా ఈ వార్తపై స్పందించలేదు.

# 72 గంటల్లో 184 మంది మృతి

### గాజాలో మరింత ఉధృతంగా ఇజ్రాయెల్ దాడులు

### ఇది కిరాతకం: హమాస్



**జెరూసలేం:** గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ భీకరంగా దాడులు సాగిస్తోంది. శనివారం ఒక్క రోజులోనే 94 వైమానిక దాడులు, ఫిరంగుల దాడులు చేసింది. ఈ క్రమంలో గత 72 గంటల్లో 184 మంది చనిపోయారని హమాస్ మీడియా పేర్కొంది. అమాయకులను, నిరాయుధులైన పౌరులే లక్ష్యంగా నిర్వాసిత ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపిస్తుండటం కర్కశత్వమని, ప్రధానంగా గాజా సిటీలో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని హమాస్ నడిపే గాజా మీడియా కార్యాలయం వెల్లడించింది. శిథిలాల కింద ఎంత మంది చిక్కుకొని ఉన్నారో తెలియని పరిస్థితి ఉన్నట్లు పేర్కొంది. గత మూడు రోజులుగా ఇజ్రాయెల్ వైమానిక దాడుల తీవ్రత పెరిగినట్లు గాజాలోని పలస్తీనా పౌర రక్షణ అధికారులు ధ్రువీకరించారు. వర్ణనాతీతమైన క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ భయానక నేరాలకు ఇజ్రాయెల్ సైన్యానిదే పూర్తి బాధ్యత అని ప్రకటన పేర్కొంది. ఇజ్రాయెల్‌కు రాజకీయ, ఆయుధ సాయాన్ని, మద్దతును అందిస్తున్నందుకుగాను అమెరికానూ దుయ్యబట్టింది. ఇజ్రాయెల్ హేయమైన నేరాలపై స్వతంత్ర దర్యాప్తు బృందాలతో విచారణ జరిపించేలా చట్టబద్ధంగా, నైతికంగా ఉన్న అవకాశాలను సద్వినియోగించాలని ఐరాస భద్రతా మండలి, అంతర్జాతీయ సమాజానికి ఈ ప్రకటన ద్వారా హమాస్ పిలుపునిచ్చింది.

**గాజా జానాభాలో క్షీణత**

పలస్తీనా భూభాగంపై ఇజ్రాయెల్ ఉధృతంగా దాడులు చేస్తున్న క్రమంలో గాజా జనాభాలో ఆరు శాతం మేర క్షీణత నమోదైనట్లు పలస్తీనా సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీసీబీఎస్) వెల్లడించింది. అరబ్‌లకు, యూదులకు ఇప్పటివరకు జరిగిన యుద్ధాల్లో ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించలేదని, ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 47వేల మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, వీరిలో చిన్నారులు, మహిళలే అధికమని పేర్కొంది. గాజా జనాభా 21 లక్షలు కాగా గతేడాదితో పోల్చితే ప్రస్తుతం ఆరు శాతం తగ్గింది. వైద్యారోగ్య మౌలిక వసతులను ఇజ్రాయెల్ ధ్వంసం చేయడంతో 60వేల మంది గర్భిణులకు ముప్పు ఏర్పడినట్లు పీసీబీఎస్ తేల్చింది. లక్షా 55వేల మంది గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణ సవాళ్ల భరితంగా మారినట్లు తమ సర్వేలో తేలినట్లు వెల్లడించింది.

**ఖతార్‌లో శాంతి చర్చలు: ఇజ్రాయెల్**

గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించిన ఒప్పందంపై ఖతార్‌లో చర్చలు ప్రారంభమైనట్లు ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. 2023 అక్టోబరు దాడుల్లో స్వాధీనం చేసుకున్న బందీల విడుదల కోసం హమాస్‌తో చర్చలను పునరుద్ధరించినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. ఖతార్‌లో జరిగే చర్చల్లో బందీల విడుదలపై ఏకాభిప్రాయానికి కసరత్తు జరుగుతుందన్నారు. ఇదిలావుంటే ఖైదీల బదిలీ ఒప్పందం కోసం ఒత్తిడి తెచ్చే విధంగా గాజా స్ట్రిప్‌లో ఒక ఇజ్రాయిలీ మహిళను బంధించిన వీడియోను హమాస్ సాయుధ విభాగం అల్ ఖసమ్ బ్రిగేడ్స్ విడుదల చేసింది. 'మా ప్రభుత్వానికి, మా దేశ సైన్యానికి మా గురించి ఏమీ పట్టడం లేదు. మేము 450 రోజులుగా నిర్బంధంలో ఉన్నాం. నా వయస్సు 19ఏళ్లు. మమ్మల్ని ఈ ప్రపంచం మర్చిపోతోంది' అని ఆ వీడియోలో లిరి అల్‌బాగ్ అనే యువతి హిబ్రూ భాషలో మాట్లాడారు.

## పాలెపల్లి సెజ్‌లో
## రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్ : ఇ.వి.నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ''సైన్స్'','బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని' రెండు ఎగ్జిబిషన్లను నిర్వహించనున్నట్టు విద్యాశాఖ సంచాలకులు ఇ.వి.నర్సింహారెడ్డి తెలిపారు. జడ్చర్ల పొలెపల్లి సెజ్‌లో, ఎన్ఎంఐఎంఎస్ క్యాంపస్‌లోని ఎస్‌వికెఎం స్కూల్‌లో నిర్వహించనున్నట్టు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్లలో 830 మంది విద్యార్థులు ,మరో 830 గైడ్ టీచర్లు హాజరుకానున్నారు. కాగా ఈ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని, ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ 2025లో అవకాశం దక్కనుంది. ఇందులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి అవార్డ్‌ను ఇవ్వనున్నారు.

## నిర్మూలన సాధ్యం (మొదటి పేజీ తరువాయి)

ఎక్కడ పుట్టినా అందరి రక్తం ఒక్కటేనని, అందరిలోనూ అవే బ్లడ్ గ్రూప్‌లు ఉంటాయని, ఇది కమ్యూనిస్టులు చెబుతుంది కాదని, సైన్స్ చెబుతున్న నిజమన్నారు. ఎలా పుట్టిందో కానీ ప్రపంచంలో ఆ దేశంలో లేని కులం కేవలం భారతదేశంలోనే పుట్టిందని, ఈ కులం నేటి ఈ సమాజాన్ని పట్టి పీడిస్తోందని తెలిపారు. కుల భూతాన్ని అంతం చేయడంలో దారులు వేరైనా అంబేడ్కర్, కమ్యూనిస్టుల భావజాలం ఒక్కటేనని అన్నారు. ఈ దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి కావచ్చినా నేటి శ్రమజీవులకు బతుకు లేదని, ఎంత కష్టపడినా కడుపు నిండే పరిస్థితి లేదన్నారు. ఈ దేశంలో 90 శాతం ప్రజల వద్ద ఉన్న సంపదకు మించి కేవలం 10 శాతం మంది వ్యక్తుల వద్ద కేంద్రీకృతమై ఉందన్నారు.

## టెక్నాలజీ హబ్ (మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటవుతున్నందున యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేసారు. తాము నెలకొల్పే ఏఐ సిటీ అభివృద్ధిలో 'డేటా ఎకానమీ' భాగస్వామి కావాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది చివరి నాటికి హైదరాబాద్ కేంద్రంలో మరో 500 మంది కొత్త ఉద్యోగులను నియమిస్తామని 'డేటా ఎకానమీ' ప్రతినిధులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవి కోపురి, జవహర్, రోషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన బస్తర్ (మొదటి పేజీ తరువాయి)

స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) బృందాలు సంయుక్తంగా నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. రాత్రి వరకు ఎదురుకాల్పులు కొనసాగాయి. అనంతరం ఘటనాస్థలిలో పరిశీలించగా నలుగురి నక్సల్స్ మృతదేహాలు, ఎకె–47 రైఫిల్, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్) సహా ఆటోమెటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఎదురుకాల్పుల్లో డిఆర్‌జి హెడ్‌కానిస్టేబుల్ సన్నుకరం కూడా ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఆ ప్రాంతంలో గాలింపులు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. కాగా, నారాయణపూర్, దంతేవాడ, కొండగాన్, బస్తర్ జిల్లాలకు చెందిన డిఆర్‌జితో కూడిన బృందాలు శుక్రవారం నాడు నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఆదివారం మాట్లాడుతూ నక్సల్స్‌ను అంతమొందించే వరకు పోరాటం కొనసాగుతోందన్నారు. దక్షిణ అబూజ్‌మాద్‌లో భద్రతా బలగాలు, నక్సల్స్‌కు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు నలుగురు మావోయిస్టులు హతమైనట్లు ధ్రువీకరణ అయిందన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ వీరమరణం పొందడం బాధాకరమన్నారు. ఆయన మరణం వృథా కాబోదని చెప్పారు. నక్సలిజానికి వ్యతిరేకంగా భద్రతా బలగాలు పటిష్టంగా పోరాడుతున్నాయని, నక్సలిజాన్ని అంతం చేసే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. కాగా, ఈనెల 3వ తేదీన కూడా గరియాబంద్‌లో జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ నక్సలైట్ హతమయ్యాడు. గత ఏడాది 219 మంది నక్సలైట్లను వేర్వేరు ఘటనల్లో అంతమొందించినట్లు పోలీసులు వెల్లడించారు.

## హర్షణీయం (మొదటి పేజీ తరువాయి)

భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవడానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ పనికి రూ.1,788.89 కోట్ల వ్యయం కానుంది. శ్రీశైలం నుంచి రోజూ 0.5 టిఎంసి చొప్పున 60 రోజుల్లో 30 టిఎంసి నీటిని మళ్లించి నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లోని 3.41 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని 2015లో నాటి ప్రభుత్వం నిర్ణయించింది. 2015 జూన్‌లో రూ.6,150 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొని ప్రస్తుతం ఉన్న డిండి రిజర్వాయర్‌కు మళ్లించి అక్కడి నుంచి ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టుకు నీరందించడం ఈ పథకం ఉద్దేశం. దీంతోపాటు రోజుకు ఒకటిన్నర టిఎంసిల నీటితో 60 రోజుల్లో 90 టిఎంసిలను వినియోగించుకొనేలా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే ఏ రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతలకు నీటిని మళ్లించాలన్న అంశం కొన్ని సంవత్సరాలుగా చర్చల్లోనే ఉండగా, ప్రస్తుత మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకొంది. డిండి ఎత్తిపోతల హెడ్‌వర్క్స్ ఎక్కడ అనేది తేలకపోయినా.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉల్పర నుంచి శివన్నగూడెం రిజర్వాయర్ వరకు 66.3 కి.మీ. దూరం ప్రధాన కాలువకు 2017 ఆగస్టులో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఆమోదం తెలిపింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి డిండి రిజర్వాయర్‌కు; నార్లాపూర్ నుంచి ఉల్పర వద్ద బ్యారేజీ నిర్మించి మళ్లించడం; ఏదుల నుంచి ఉల్పర వద్ద బ్యారేజీ నిర్మించి మళ్లించడం.. ఇలా పలు ప్రత్యామ్నాయాలు ముందుకు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్ద జరిగిన సమావేశాల్లో మూడు ప్రత్యామ్నాయాల గురించి చర్చించగా, ఏదుల నుంచి తీసుకోవడమే మేలని నిర్ణయించి మంత్రివర్గం ముందు పెట్టగా ఆమోదం తెలిపింది. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతలకు రోజూ 0.5 టిఎంసి నీటిని మళ్లించడానికి మంత్రివర్గం ఆమోదం తెలపగా, ఒకరిద్దరు మంత్రులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు దీనివల్ల ఎలాంటి నష్టం జరగకుండా చూడాలనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**నీటి మళ్లింపు ఇలా...**

వనపర్తి జిల్లాలోని ఏదుల వద్ద ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్ వెనకభాగంలో హెడ్ రెగ్యులేటర్ నిర్మిస్తారు. ఇందులో భాగంగా అప్రోచ్ ఛానల్ తర్వాత 2.525 కి.మీ. ఓపెన్ కెనాల్, 16 కి.మీ. సొరంగ మార్గం, మళ్లీ 3.25 కి.మీ. ఓపెన్ కెనాల్ తవ్వాల్సి ఉంటుంది. తర్వాత 5.4 కి.మీ. డిండి వాగు ద్వారా ఉల్పర సమీపంలో పోతిరెడ్డిపల్లి వద్ద నిర్మించే బ్యారేజీకి మళ్లించి డిండి ఎత్తిపోతల పథకానికి నీరందిస్తారు. పనులతోపాటు జిఎస్‌టి ఇతర పన్నులు కలిపి రూ.1,788.89 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.

**పెరిగిన అంచనాకు లభించని ఆమోదం**

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన నార్లాపూర్ –ఏదుల మధ్య కాలువ పనికి పెరిగిన అంచనాను మంత్రివర్గం తిరస్కరించింది. 8.35 కి.మీ. కాలువ తవ్వే పనిని రూ.394 కోట్లకు గుత్తేదారుతో ఒప్పందం జరిగింది. 1.28 కోట్ల క్యూబిక్ మీటర్ల పనికి గాను 1.8 కోట్ల క్యూబిక్ మీటర్లు చేయాల్సి వచ్చిందని, కంట్రోల్ బ్లాస్టింగ్‌తో సహా అదనపు పనులు చేయాల్సి వచ్చినందున అంచనా పెరిగిందంటూ 2022లో రూ.684 కోట్లకు సవరించిన అంచనాను ప్రభుత్వానికి పంపినా పెండింగ్‌లో ఉండిపోయింది. తాజాగా రూ.784 కోట్లకు ప్రతిపాదించగా, మంత్రివర్గం తిరస్కరించి అదనపు సమాచారం కోరింది. ఇదే ప్రాజెక్టులో నార్లాపూర్‌కు సవరించిన అంచనాకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. రూ.1,448.64 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పని విలువ మరో రూ.89 కోట్లు పెరగ్గా, జిఎస్‌టి ఇతర పన్నులు కలిపి రూ.1,784 కోట్లకు చేరింది. దీనికి ఆమోదం లభించింది.

**కృష్ణా బేసిన్‌పై అధ్యయనం**

కృష్ణా బేసిన్‌పై సమగ్రంగా అధ్యయనం చేయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం సలహాదారు ఆదిత్యాదాస్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకొంది. నీటి లభ్యత, అవసరాలు, అదనంగా వినియోగించుకోవడానికి అవకాశాలు ఇలా అన్ని అంశాల్లో 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించినట్లు తెలిసింది. డిండి ఎత్తిపోతలకు నీటి మళ్లింపు నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను సమగ్రంగా అధ్యయనం చేయాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అదనంగా నీటిని ఉపయోగించుకునేలా కొత్త ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి. ఇంకా ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడంపై దృష్టి సారించి నివేదిక ఇవ్వాలి అని పేర్కొన్నట్లు సమాచారం.

## పథకాలు ఆపం (మొదటి పేజీ తరువాయి)

గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించామని, రాష్ట్రంలో మహిళలు ఏ మూల నుంచి ఏ మూలకైనా ప్రయాణం చేసేందుకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, రూ. 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు వినియోగించే పేదలకు ఉచితంగా విద్యుత్తు, పంటల బీమా, రైతు బీమా అమలు చేస్తున్నామని, సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తూ.. చివరి గింజ వరకు కొనుగోలు చేశాం అని, పాత పథకాలకు కోత విధించకుండా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం అని, రేషన్ కార్డులు, రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించామని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చుకుంటూ పోతున్నామని, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సగర్వంగా తలెత్తుకొని గ్రామాల్లో ప్రచారం చేయాలని, ఇందిరమ్మ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సంక్రాంతి సంబరాలతో పాటు విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లండని పిలుపునిచ్చారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ నేతలు మిగులు బడ్జెట్ లో కూడా రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేకపోయారని, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 2 లక్షల లోపు రుణమాఫీ చేశాం అని, దాదాపు 22 వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని, ఆధార్ కార్డులో, బ్యాంకు పుస్తకంలో తప్పులు దొర్లి రుణమాఫీ కాకపోతే ఇంటింటికి సర్వే చేసి వారికి కూడా 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, బి ఆర్ ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా, ఇబ్బందులు సృష్టించిన ఇందిరమ్మ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందన్నారు.

సంక్రాంతికి రైతు భరోసా ఇవ్వబోతున్నామని, ఏడాదికి 12,000 రైతుల ఖాతాలో జమ చేస్తామని, బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 నుంచి రైతు భరోసా నిధులు రైతులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం అన్నారు. భూమి లేని నిరుపేద కూలీలు కూడా తమ బిడ్డలేనని.. వారి బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి 12,000 జమ చేస్తాం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం అని, బంగారు తెలంగాణ చేస్తామని 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ నేతలు ఇల్లు కూడా ఇవ్వలేదని తన పాదయాత్ర సమయంలో మీరంతా ఆవేదన వ్యక్తం చేశారని, మీ ఆవేదనను అర్థం చేసుకొని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు నిర్మించబోతుందని, ఇంటికి ఐదు లక్షల రూపాయల పెట్టుబడింది ప్రభుత్వం అందిస్తుందని,

ఈ ఏడాది 5వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం అని, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్నాం అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ప్రతి పని ప్రజల కోసం చేస్తుందని, పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాలు చేసుకోండని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి విస్తృతంగా ప్రచారం చేయండని పిలుపునిచ్చారు. ఈ సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా, వరంగల్ కలెక్టర్ సత్య శారధా, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ తానాజి వాకడే,ఎన్‌పిడిసిఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 31 లోగా పూర్తి (మొదటి పేజీ తరువాయి)

విజయం వరిస్తుందని, ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతి ఒక్కరూ సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని సిఎం ఆకాంక్షించారు. రేపటి భవిష్యత్తులో యువత భాగస్వామ్యం కావాలని, అత్యధికంగా సివిల్ సర్వీసెస్ సాధించి తెలంగాణ ముందు భాగంలో నిలపాలని సిఎం అన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని, సివిల్స్ సర్వీసెస్‌లో దేశంలోనే అత్యధికంగా ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి తెలంగాణ చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**అభ్యర్థులకు ఢిల్లీలో వసతి కల్పిస్తాం**

సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి ఆర్థిక సాయం అందించడం గర్వకారణమని, ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ సమయంలో ఢిల్లీలో వసతి కల్పిస్తామని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. గత పాలకులు సింగరేణిని వ్యక్తిగత,రాజకీయ అవసరాలకు వాడుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని ప్రపంచంలోనే నేటి సంస్థగా నిలబెట్టాలనుకుంటున్నదన్నారు. కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబానికి కోటి రూపాయలకుపైగా ఉచిత ప్రమాద బీమా అందిస్తున్నామన్నారు. సింగరేణి పరిధిలో నిరుపయోగంగా, గనులు తవ్వి వదిలివేసిన ప్రాంతాలు, ఖాళీగా ఉన్న స్థలాల్లో ఉన్న ప్రాంతాల్లో సోలార్, పంపు స్టోరేజ్ ద్వారా గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తామని భట్టివిక్రమార్క చెప్పారు. సింగరేణి పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 కోట్లకు తగ్గకుండా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామన్నారు. ఇదే వేదికగా సింగరేణి సిబ్బందికి ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రతి కార్మికుడికి రూ.1.25 కోట్ల ప్రమాద బీమా భద్రత కల్పించడానికి సంబంధించి సింగరేణి సంస్థకు బ్యాంక్ ఆఫ్ బరోడాకు మధ్య ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి సమక్షంలో సింగరేణి చైర్మన్, సిఎండి బలరాం నాయక్, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు గారితో పాటు కోల్ బెల్ట్ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎసిబి ముందుకు కెటిఆర్ (మొదటి పేజీ తరువాయి)

చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్) బిఎల్ఎన్ రెడ్డిల పేర్లను చేర్చింది. ఇదే పద్ధతిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు కూడా కేసు నమోదు చేశారు.ఫార్ములా ఇకారు రేసుపై అటు ఎసిబి, ఇటు ఇడి కేసులు నమోదు చేసి నిందితులను విచారించేందుకు పై ముగ్గురు నిందితులకు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎసిబి విచారణకు కెటిఆర్ సోమవారం హాజరుకావాల్సి ఉంది. కెటిఆర్‌పై ప్రశ్నలను సందించేందుకు ఎసిబి అధికారులు ప్రశ్నలను సిద్ధం చేశారు.

కారు రేస్ కోసం హెచ్‌ఎండిఏ నిధులనే ఎందుకు ఎంచుకున్నారు?

కారు రేసు నిర్వాహకులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద పత్రాలలో నిధులు హెచ్‌ఎండిఏ సమకూరుస్తున్నట్లు ఉందా?

9వ ఇకార్ రేస్ నిర్వహించినప్పుడు నిర్వాహకులకు ప్రభుత్వం నిధులు ఇచ్చిందా..ఇస్తే ఏ ప్రభుత్వ సంస్థ ద్వారా నిధులు విడుదల చేశారు?

9వ కార్ రేస్‌కు చేసుకున్న ఒప్పందమే 10వ కార్ రేస్‌కు ఎందుకు వర్తించదు?

10వ కార్ రేస్ కోసం ప్రత్యేకంగా నిర్వాహకులతో మరో ఒప్పందం చేసుకున్నారా?

హెచ్‌ఎండిఏ సంస్థ నుంచి నిర్వాహకులకు నిధులు మళ్లించమని ఎవరు ఆదేశించారు?

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిధుల విడుదలకు ఎన్నికల కమిషన్ నుంచి హెచ్‌ఎండిఏ గాని ప్రభుత్వంగాని అనుమతి తీసుకున్నారా?

ఫార్ములా ఈకార్ రేస్ నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు చెల్లింపులు జరిగాయా లేదా ?

నిర్వాహకులకు డాలర్ల రూపంలోనే నిధులు ఎందుకు చెల్లించాల్సి వచ్చింది?

9వ కార్ రేస్‌లో కూడా నిర్వాహకులకు డాలర్ల రూపంలోనే ప్రభుత్వ నిధులు చెల్లించిందా?

హెచ్‌ఎండిఏ రూల్స్ ప్రకారం రూ. 10 కోట్ల కంటే ఎక్కువ చెల్లింపులు చేయాలంటే ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. కానీ.. నాడు ఈ నిబంధనలేవీ ఎందుకు పట్టించుకోలేదు?

ఇకార్ రేస్ నిర్వాహకులైన విదేశీ సంస్థకు హెచ్‌ఎండిఏ రూ.45.71 కోట్లను మంజూరు చేయడంలో ఆర్‌బిఐ నుంచి ప్రభుత్వం తీసుకుందా?


ఇలా నిధులు బదిలీ చేయడం ద్వారా ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ రూ.8,6,75,404 ఫైన్ వేసింది దీనిపై మీ స్పందన?

దీంతో పాటు వివిధ ఫీజుల రూపంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్, ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు మరో రూ.1,10,51,014 ఎందుకు చెల్లించాల్సి వచ్చింది?

కెటిఆర్ ఆదేశాల మేరకే నిధులు నిర్వాహకులకు బదిలీ చేశామని ఎ2గా ఉన్న ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. దీనిపై మీ స్పందన?

ఫార్ములా ఇ ఆపరేషన్స్, ఎక్స్ నెకట్స్ జెన్ సహా ఎంఎయుడి ఒప్పందాలు, డబ్బులు ట్రాన్స్ఫర్ చేసిన వివరాలను అడగనున్నారు?





కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా, పాల్వంచను కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను హైదరాబాద్‌లోని వారి నివాసంలో కూనంనేని సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా పాల్వంచ మున్సిపాలిటీని, ఇప్పటికే ఉన్న కొత్తగూడెం మున్సిపాలిటీని సుజాతనగర్ మండలంలోని 7 పంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు కోసం జిల్లా మంత్రులుగా ముగ్గురు ఎంతో కృషి చేశారని కూనంనేని సాంబశివరావు ప్రశంసించారు.

## సంక్రాంతికి ఊరెళ్లేవారికి శుభవార్త



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే వారికి సౌత్ సెంట్రల్ రైల్వే శుభ వార్త చెప్పింది. చర్లపల్లి –తిరుపతి, వికారాబాద్–కాకినాడ, కాచిగూడ– తిరుపతి, కాచిగూడ–శ్రీకాకుళం, చర్లపల్లి–శ్రీకాకుళం, నాందేడ్–కాకినాడ, చర్లపల్లి –కాకినాడ, చర్లపల్లి– నర్సాపూర్ ప్రాంతాలకు 52 ప్రత్యేక రైళ్లను ఈ నెల 6వ తేదీ నుంచి 18 వరకు నడపనుందని ఒక ప్రకటనలో పేర్కొంది. నేటి నుంచి ఈ రైళ్ల బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి.

## మాట తప్పినందుకు నేడు రాష్ట్ర వ్యాప్త నిరసన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ 15 వేలు ఇస్తామని ప్రకటించి, కేవలం రూ 12 వేలు ఇస్తామనడం రైతులను నిలువునా వంచించడమేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన మాటను తప్పినందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో సోమవారం బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలను చేపడుతుందని, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రైతులకు మొత్తంగా రూ.17,500లు ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టబోమని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని రైతులను కోరారు. రెండు పంటలకు రూ.15వేలు ఇవ్వకపోతే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎలా తిరుగుతారో తాము చూస్తామని, గన్‌పార్క్ నుంచి గల్లీ వరకు కాంగ్రెస్ వెంట పడుతామని హెచ్చరించారు. ఈ నెల 26 నుంచి రైతుభరోసా ఇస్తామని ప్రకటించారని, అమలు విషయంలో ఎటువంటి నిబంధనలు పెడుతారు?, పత్తి, ఉద్యానపంట రైతులకు ఇస్తారా? లేదా మోసం చేస్తారా? మేము గమనిస్తామని, ప్రభుత్వం దిగొచ్చే వరకు మా నిరసనల పర్వం కొనసాగుతోందని కెటిఆర్ అన్నారు. రైతుభరోసాను ప్రకటించినందుకు సంబురాలు చేయాలని కాంగ్రెస్ చెబుతుందని, రూ.12 వేలకు కుదించినందుకు సంబరాలు చేయాలా? అని ప్రశ్నించారు. రైతు భరోసాను రైతు నిరాశగా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అబద్ధాలకు డిక్షనరీలో కొత్త పదాలను కనిపెట్టాలని, రైతు రుణమాఫీ, రైతుబంధుకు లక్ష కోట్ల రూపాయలను నాడు కెసిఆర్ ఖర్చు పెట్టారని, కెసిఆర్ రైతుబంధుగా నిలిస్తే, రేవంత్ రెడ్డి రాబందుగా మిగులుతారని కెటిఆర్ చెప్పారు. రైతులకు హామీనిచ్చిన రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని?, తెలంగాణకు వచ్చే దమ్ము ఆయనకు ఉన్నదా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడమే ఇందిరమ్మ రాజ్యమా? సమాధానం చెప్పాలని ఆయన రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. రైతాంగానికి సిఎం రేవంత్ రెడ్డి తీరని ద్రోహం చేసినందుకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో ముక్కు నేలకు రాయాలని, నమ్మించి నయవంచన చేసినందుకు రైతులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఆర్థిక ఇంజన్‌గా ఉన్న హైదరాబాద్‌లో హైడ్రా, మూసీతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా, నయవంచన అని మరోసారి రుజువైందని కెటిఆర్ అన్నారు.

## పాతబస్తీ మెట్రోరైల్ నిర్మాణానికి భూములిచ్చిన వారికి నేడు చెక్కులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు త్వరితగతిన మెట్రో పనులు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెట్రోరైల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. మెట్రోరైల్ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఆస్తుల యజమానులకు నష్టపరిహారం చెల్లించనున్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడానికి ముహూర్తం ఖరారు చేసింది. మెట్రో ప్రాజెక్ట్‌తో ప్రభావిత ఆస్తుల యజమానులకు సోమవారం చెక్కులను పంపిణీ చేయనున్నట్లు హెచ్ఎంఎల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. భూసేకరణతో ఓల్డ్ సిటీలో రెండో దశ మెట్రో పనులను ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతోంది. కారిడార్ 6లో ఎంజిబిఎస్ చంద్రాయణగుట్ట మార్గంలో 1100 ప్రభావిత ఆస్తులు ఉండగా, పెద్ద ఎత్తున వాటి యజమానులు స్వచ్ఛందంగా తమ స్థలాలను మెట్రో రైలు నిర్మాణం కోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ఇంతవరకు 169 మంది వారి యొక్క అనుమతి పత్రాలను ఇచ్చారని ఆయన తెలిపారు. వాటిలో 40కి పైగా ఆస్తుల యాజమాన్యానికి సంబంధించిన ధ్రువీకరణ పూర్తయిందన్నారు. తొలి దశలో ఈ 40కి పైగా ఆస్తుల యజమానులకు ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చెక్కుల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. వారికి నష్టపరిహారాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎం.పి. అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల రూపంలో అందజేయనున్నారు. ప్రభావిత ఆస్తులకు చదరపు గజానికి రూ. 81,000 ఇవ్వడానికి ఇప్పటికే జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్ణయించారని, దీనితో పాటు రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ చట్టం ప్రకారం, పునరావాస పరిహారం, తొలగించే నిర్మాణాలకు కూడా నష్టపరిహారాన్ని అర్హులైన ఆస్తుల యజమానికి ఇవ్వడం జరుగుతుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. భూసేకరణ చట్టానికి లోబడి నష్టపరిహారాన్ని జిల్లా కలెక్టర్ నిర్ణయం ప్రకారం చెల్లిస్తున్నామన్నారు. లక్డీకాపుల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## అల్లు అర్జున్‌కు రాంగోపాల్‌పేట పోలీసుల నోటీసు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పుష్ప–2 ప్రీమియం షో సందర్భంగా సంధ్య టాకీస్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు సినీ హీరో అల్లు అర్జున్ వస్తున్నాడని తెలియగానే రాంగోపాల్‌పేట పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి నోటీసులు అందించారు. ఆసుపత్రికి అల్లు అర్జున్ రావడం వల్ల మళ్లీ తీవ్ర ఉద్రిక్తత నెలకొనే అవకాశాలు ఉన్నందున తన పర్యటనను నిలుపుకోవాలని, లేనిపక్షంలో జరిగే పరిణామాలకు అతనే బాధ్యత వహించాల్సి వస్తుందని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కాసేపట్లో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు అల్లు అర్జున్ వెళ్లాల్సి ఉండగా.. రాంగోపాల్ పేట పోలీసులు అల్లు అర్జున్ ఇంటి వద్ద ప్రత్యక్షం కావడం హాట్‌టాపిక్‌గా మారింది. ఆదివారం ఉదయం అల్లు అర్జున్ మేనేజర్ మూర్తికి రాంగోపాల్ పేట ఎస్ఐ నోటీసులు జారీ చేశారు.

**స్టేషన్‌లో సంతకం పెట్టి వెళ్లిన అల్లు అర్జున్..**

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రెగ్యులర్ బెయిల్ పొందిన సినీ హీరో అల్లు అర్జున్ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టి వెళ్లారు. బెయిల్ నిబంధనల్లో వారంలో ఒకరోజు పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టాలని హైకోర్టు బెయిల్ నిబంధన పెట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు బెయిల్ నిబంధన ఉల్లంఘించరాదనే ఉద్దేశ్యంతో అల్లు అర్జున్ స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు స్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బిడ్డల భవిష్యత్తే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్

### పెంచిన డైట్ ఛార్జీల మేరకు మెనూ పెడుతున్నారా? లేదా? పరిశీలించేందుకే పర్యటన

### యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/యాదాద్రి :** బిడ్డల భవిష్యత్తు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే మన బిడ్డలు బాగుండాలి.. వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన హైదరాబాద్ నుంచి వరంగల్ వెళుతూ మార్గమధ్యంలో బీబీనగర్‌లోని ఎస్సీ, బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా పర్యటించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ, కాస్మోటిక్ ఛార్జీల వివరాలను విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. డైట్ చార్జీలు పెంచక ముందు, పెంచిన తర్వాత మెనూలో వచ్చిన మార్పులు.. నాణ్యత పాటిస్తున్నారా లేదా, శుభ్రత ఎలా ఉంది అన్ని విశేషాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్టోర్ రూమ్‌ను , తరగతి గదులను స్వయంగా తిరిగి పరిశీలించారు. విద్యార్థినీలకు అందుతున్న వైద్య సహాయం.. వారి ఆరోగ్య వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ప్రజా ప్రభుత్వం తెలిపారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందితేనే వారు శారీరకంగా మానసికంగా బలంగా ఎదుగుతారని.. ఎదిగే సమయంలో కావలసిన పోషకాలు అందిస్తేనే మెదడు చురుకుగా పని చేసి టీచర్లు బోధించే పాఠాలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుంటారని వివరించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచినట్టు తెలిపారు. పెంచిన చార్జీల మేరకు హాస్టల్లో మెనూ అందిస్తున్నారా లేదా అనే విషయాలను నెలలో ఒకసారి హాస్టల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ నిర్ణయించింది అందులో భాగంగా తాను ఆదివారం బీబీనగర్ హాస్టల్‌ను సందర్శించినట్లు తెలిపారు. క్యాబినెట్ సహచరులు మొదలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తరచూ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అందుతున్న సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి వెంట భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టోల్ల శ్యామ్ గౌడ్, గోలి నరేందర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పంజాల శ్రీనివాస్ గౌడ్, పంజాల పెంటయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దం వాసుదేవ రెడ్డి, సోమ శివకుమార్, ఉప్పలంచి శ్రీకాంత్, కాసుల సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీ సమస్యలపై అధ్యయనం

### తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి



**ప్రజాపక్షం/నందికొండ :** గిరిజనులు, తండా వాసులను కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తే మొత్తం దేశాభివృద్ధికి అర్థం లేదని అధికారంలో ఉండి కూడా అటవీ, గిరిజన ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. నందికొండ మునిసిపాలిటీ పరిధిలోనే స్థానిక హిల్ కాలనీలో ఉన్న విజయ్ విహార్ అతిథి గృహంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 11 వరకు జరిగే గిరిజన, ఆదివాసీ సాధికారిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఎంపీ రఘువీర్‌లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షి మాట్లాడుతూ దేశంలో ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని వెల్లడించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సమయంలో ఆదివాసీ సమస్యలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసారని అన్నారు. దేశ ప్రజలు అనగానే కేవలం పట్టణ, పల్లె ప్రజలే కాదని ఆదివాసీలు గిరిజనులు, గిరిజన ప్రాంతాలూ లెక్కలోకి వస్తారన్నది పాలకులు గమనించాలని అన్నారు. ఎస్‌టిలకు కాంగ్రెస్ చేసిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె పార్టీ శ్రేణులను కోరారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన అభివృద్ధి కోసం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని కేంద్రం నుంచి నిధులు వచ్చినా కానీ అవి ఏమాత్రం గిరిజన అభివృద్ధికి ఉపయోగించలేదని అన్నారు. ఆ తరువాత తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశం నలుమూలలా కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఉందని కానీ బిజెపి ప్రభుత్వం దేశాన్ని గొప్పగా పాలించామని గొప్పలు చెప్పుకోవడం తప్ప నిజానికి అసలు అభివృద్ధి చెందాల్సిన అటవీప్రాంతాలు, గిరిజన తండా వాసుల జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి సామెతలానే వున్నదని, బిజెపి వారి వైభవం గురించి ప్రచారం చేసుకోవడమే తప్ప వాస్తవానికి గిరిజనులకు, అటవీ ప్రాంతాల వాసులకు ప్రత్యేకించి చేసిందేమీ లేదన్నారు. వారు అధికార కాంక్షతో ఎన్నికలు గెలవడం తప్ప ప్రజలకు మంచి నాణ్యమైన జీవితాన్ని ఎన్నడూ ఇవ్వలేదని గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లింగారెడ్డి పాల్గొన్నారు.

## డ్రగ్స్ నివారణ కోసం.. ఎక్సైజ్‌శాఖలో కొత్తగా 'నార్కోటిక్ టీం'

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత పాలిట శాపంగా మారుతున్న డ్రగ్స్‌ను తుద ముట్టించడానికి ఎక్సైజ్ శాఖలో కొత్తగా నార్కోటిక్ ఎన్‌డిపిఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్) కంట్రోల్‌కు ప్రత్యేక టీం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కొత్త టీమ్ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నార్కోటిక్ టీంలో పోలీసులు, న్యాబ్, ఎస్ఓటి టీమ్ రీతిలో పని చేసే సిబ్బందిని ఎంపిక చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖలో ఎన్ ఫోర్స్, డిటిఎఫ్, ఎస్‌టిఎఫ్ టీంలో చురుకుగా పని చేస్తున్న వారిలో మంచి నైపుణ్యం కనబరుస్తున్న వారితో పాటు ఈ విభాగంలో పని చేయడానికి ఉత్సాహం చూపించే వారిని తీసుకోవాలని అధికారులను కోరారు. నార్కోటిక్ టీంకు డిఎస్‌పి స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. టీంలో సిఐ, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిసి మొత్తంగా 15 నుంచి 20 మంది సిబ్బంది ఉంటారన్నారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని ఆదేశించడంతో విబి కమలాసన్‌రెడ్డి పర్యవేక్షణలో ఎక్సైజ్ శాఖలో నాలుగు స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీంలు కొనసాగుతున్నాయి. నార్కోటిక్ టీం ప్రధానంగా హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో డ్రగ్స్ వినియోగం పెరుగడమే. నాలుగు ఎస్‌జి ఎఫ్ టీమ్‌లు డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ , ఐఎంఎల్లో ఎంఆర్పీ వాయిలేషన్, ఇలా అనేక రకాలు కేసులపై పని చేస్తు ఉంటారు. ఒక్కొక్క టీంకు15 నుంచి 20 మంది సిబ్బంది ఉంటారు. మరో పక్క ఆపరేషన్ ధూల్‌పేట్, నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణ ఇలా అనేక రకాలు క్రైమ్ పర్యవేక్షిస్తుంటారు. అన్ని రకాల క్రైమ్‌ల పర్యవేక్షణ కాకుండా డ్రగ్స్‌పైనే నిఘా పెట్టడం కోసం కొత్తగా నార్కోటిక్ టీం ఏర్పాటుకు కారణభూతంగా మారింది. ఈ మేరకు త్వరలో ఈ టీం రంగంలోకి దిగనుందని ఆయన వెల్లడించారు.

## మరో కానిస్టేబుల్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంబర్‌పేటలోని మల్లిఖార్జుననగర్‌కు చెందిన శంకర్ వికారాబాద్ జిల్లా పరిగి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నరు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో తన గదిలో శంకర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శంకర్ ఐదేళ్ల నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడని అధికారులు అంటున్నారు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడని ఈ క్రమంలోనే అతను ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అంటున్నారు.

## నేడు చర్లపల్లి నూతన టెర్మినల్ స్టేషన్ ప్రారంభం

### ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని చర్లపల్లిలో రూ.413 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించిన రైల్వే టెర్మినల్‌ను మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, వి.సోమన్న, రవణీత్ సింగ్, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపి ఈటల రాజేందర్, ఎంఎల్‌సిలు పట్నం మహేందర్‌రెడ్డి, సుంకరి రాజు, నవీన్‌కుమార్, ఎస్.వాణి, ఎవిఎన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు సెకండ్ ఎంట్రీ సదుపాయంతో పాటు కొత్త కోచింగ్ టెర్మినల్గా అభివృద్ధి చేశారు. రైలు ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పించారు. అలాగే సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ వంటి నగరాల్లో ప్రస్తుతం ఉన్న కోచింగ్ టెర్మినల్స్‌లో రైళ్ల రాకపోకల రద్దీని తగ్గిస్తాయి.

## అటవీ అధికారులపై గ్రామస్తుల ఎదురుదాడి



**ప్రజాపక్షం/ఇచ్చోడ :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని కేశపట్నం గ్రామంలో ఆదివారం ఉదయం అటవీ శాఖ అధికారులపై గ్రామస్తులు కొంతమంది దాడికి దిగారు. ఈ సంఘటనలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు. అనంతరం పోలీసుల సహకారంతో స్మగ్లర్ల ఇండ్లలో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 3 లక్షల 50 వేల విలువ గల కలప స్వాధీన పరుచుకున్నారు. ఆదిలాబాద్ డిఎఫ్ఓ ప్రశాంత్ పాటిల్ ఇచ్చోడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కలప స్మగ్లింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఫ్డిఓ రేవంత్, చంద్రారెడ్డి స్థానిక ఎఫ్ఆర్ఓ పుండలిక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదేండ్లలో 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు

### గ్రీన్ ఎనర్జీకి భారీగా రాయితీలు.. ప్రోత్సాహకాలు

### భవిష్యత్ విద్యుత్తు అవసరాలను తీర్చే 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025'కు మంత్రివర్గం ఆమోదముద్ర

### రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడులు.. 1.14 లక్షల కొత్త ఉద్యోగాలు

### పర్యావరణ హితం.. సమ్మిళిత అభివృద్ధి సంకల్పం


**ప్రజాపక్షం / హైదరాబాద్:** గ్రీన్ ఎనర్జీ ఉత్పాదకతను పెంచి భవిష్యత్తు అవసరాలకు సరిపడే విద్యుత్తును సమకూర్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 'క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ2025'ని రూపొందించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ఈ కొత్త పాలసీని ఆమోదించింది. 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యం అదనంగా సమకూర్చుకోవాలనేది కొత్త పాలసీ లక్ష్యం. రాష్ట్ర సమ్మిళిత అభివృద్ధికి కొత్త విధానం సరికొత్త బాటలు వేస్తుంది. కొత్త గ్రీన్ అండ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో రాబోయే పదేండ్లలో 1.98 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు 1.14 లక్షల ఉద్యోగ అవకాశాల సమకూరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. రాష్ట్రంలో ఇప్పుడున్న కాలుష్య కారక తీవ్రత పదేండ్లలో 33 శాతం తగ్గుతుందని అంచనా. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, పారిశ్రామిక కారిడార్ తదితర అభివృద్ధి పనులతో భవిష్యత్తులో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరగనుంది. 2024–25లో రాష్ట్రంలో 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఉండగా, 2034–35 నాటికి 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సౌరవిద్యుత్‌తో పాటు ఫ్లోటింగ్ సోలార్, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఈ విధానం రూపొందించింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులతో పాటు సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలను ఈ పాలసీలో పొందుపరిచింది. మన రాష్ట్రంలో ఉన్న వాతావరణం ఏడాదిలో 300 రోజులు సౌరవిద్యుత్తు ఉత్పత్తికి అనుకూలిస్తుంది. దేశంలోనే బలమైన గాలులు వీచే 8 రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో పవన విద్యుత్తు ఉత్పత్తికి మెండుగా అవకాశాలున్నాయి. కొత్త విధానం ప్రకారం సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు, పవన విద్యుత్ కేంద్రాలను స్థాపించేందుకు ముందుకు వచ్చే డెవలపర్లను ప్రోత్సహిస్తారు. ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో కొత్త ప్లాంట్లకు అనుమతులిస్తారు. వీటికి ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకు ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న వారు డిస్కంలకు లేదా ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా అమ్ముకునే అవకాశాన్ని కల్పించారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటును సైతం ఈ పాలసీ కింద ప్రభుత్వం ప్రోత్సహించనుంది. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు జలాశయాలను నామినేషన్ విధానంలో కేటాయించనున్నారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు సౌరవిద్యుత్ ప్లాంట్లు నెలకొల్పేందుకు ప్రోత్సహిస్తుంది. 500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తుంది. డిస్కంలు ఈ విద్యుత్‌ను కొనుగోలు చేస్తాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై రూఫ్ టాప్ సౌరవిద్యుత్ ప్లాంట్లను ప్రోత్సహిస్తారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ, ఇతర పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించే స్థలాలను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తారు. సీలింగ్ పరిమితి ఉండదు. భూ వినియోగ మార్పిడి అనుమతులు అవసరం ఉండదు. టిజిఐపాస్ ద్వారా అని రకాల అనుమతులను వేగంగా జారీ చేస్తారు. ప్లాంట్ల స్థాపనకు కొనుగోలు చేసిన భూములకు 100 శాతం స్టాంప్ డ్యూటీని రీయింబర్స్ చేస్తారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు, ఎన్ఓసిలను మినహాయించారు. సోలార్ ప్లాంట్లకు నీటి ఛార్జీలను రియింబర్స్ చేస్తారు. సోలార్, పవన విద్యుత్తును వినియోగించే ఎంఎస్ఎంఈ సంస్థలకు 8 ఏండ్ల పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ మాఫీ వర్తిస్తుంది. మూలధన పెట్టుబడిలోనూ రాష్ట్ర జిఎస్‌టి వాటాను తిరిగి చెల్లిస్తారు. పునరుత్పాదక విద్యుత్తులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, వినూత్న ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో లేదా డిస్కంల ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తుంది.



# సాహితీ విహారి

# వితండవాదం.. శతాబ్దాల మోసం!

ఛాందసవాదులది వాస్తవికతకు విరుద్ధమైన వితండ వాదం. లేనిది ఉన్నట్టు కల్పించి, కొన్ని శతాబ్దాలు కొనసాగించిన విచిత్ర మోసం. వారికి తర్కం నచ్చదు. హేతువాదమంటే అసలే పడదు. అన్నీ వేదాల్లోనే ఉన్నాయని బలంగా వాదిస్తారు. నిజంగానే వేదాలను విజ్ఞాన ఖనిగా భావిస్తే, వాటి ఫలాలు యావత్ మానవాళికి చెందాలికదా? కానీ, అవి కొందరికే పరిమితం. ఇతరులెవరూ వేదాలను చదవకూడదు... వీరు వివరించి చెప్పరు. 'వేదాల్లోనే అన్నీ ఉన్నాయష' అని కన్యాశుల్కంలో కరటక శాస్త్రి పాత్రతో అనిపిస్తారు గుజరాడ అప్పారావు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలను వేదాలకు వర్తింప చేయడం, అవి భారత దేశంలో కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఉన్నాయని వాదించడం ఒక అలవాటుగా మారింది. అందుకే, వారికి జర్మనీకి చెందిన ప్రముఖ భాషావేత్త మాక్స్ ముల్లర్ వంటి వారు నచ్చరు. వేదాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసి, వాటిని విశ్లేషించిన ముల్లర్‌ను దోషిగా చిత్రీకరిస్తారు. వేదాలను వక్రీకరించాడని, భారత సనాతన ధర్మాన్ని హేళన చేశాడని విమర్శిస్తారు. 'సనాతన ధర్మం' అనేది అప్పటికీ, ఇప్పటికీ ఒక బ్రహ్మపదార్థంగానే ఉంది. ఎప్పటికీ అదే పరిస్థితి కొనసాగడం తథ్యం. ఎందుకంటే, సనాతన ధర్మం అంటే ఇదిమిత్తంగా ఫలానాది అని ఎవరూ చెప్పడం లేదు. మతవాదుల నుంచి కొంత మంది రాజకీయ నాయకుల వరకూ ఈ పదాన్ని వాడడం ఒక ఫ్యాషన్‌గా మిరంది. రుగ్వేదాన్ని లోతుగా అధ్యయనం చేసిన ముల్లర్ ఎన్నో అంశాలను తలనాత్మకంగా విశ్లేషించాడు. మధ్య ఆసియా ప్రాంతపు అవెస్తా భాషకు, సంస్కృత భాషకు మధ్య పోలికను గుర్తించాడు. అందుకే, ఆర్యులు మధ్య ఆసియా నుంచి క్రీస్తుపూర్వం సుమారు 1500 ప్రాంతంలో భారత ఉపఖండంలోకి ప్రవేశించారని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతంపై వేరువేరు అభిప్రాయాలు ఉన్నాయి. ఆర్యులు ఎక్కడి నుంచో వచ్చిన జాతి కాదన్న వాదన కూడా ఉంది. అయితే, ఆర్యుల రాక, జీవన విధానాలపై ఉన్న వివాదం లోతులకు వెళ్లడం అప్రస్తుతం. ఇక్కడ వేదాలు... అందులోని అంశాలే కీలకం. సూక్ష్మ జీవుల నుంచి అనంత విశ్వ రహస్యాల వరకూ ప్రతిదీ వేదాల్లో ఉందనే వాదన సత్యదూరమని ముల్లర్ తన అధ్యయనం ద్వారా నిరూపించాడు. వేదాలు క్రీస్తుపూర్వం 1500 నుంచి 1200 మధ్యకాలంలో లిఖించబడి ఉంటాయన్నది ముల్లర్ అభిప్రాయం. వేదాల్లో దండయాత్రల గురించి ఉంచి, సంగీతం గురించి ఉంది. అంతేగానీ మానవ పరిణామక్రమం గురించిగానీ, ఖగోళ రహస్యాల గురించిగానీ లేదు. ఈ విషయాన్ని ముల్లర్ స్పష్టం చేయడం ఛాందసవాదులకు, ప్రత్యేకించి వైదాలను సొంత ఆస్తిగా పరిగణించిన బ్రాహ్మణులకు కొరుకుడుపడలేదు. అందుకే, వేదాలను వక్రీకరించిన వ్యక్తిగా ముల్లర్‌పై ముద్రవేశారు. హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించారు. రుగ్వేదంతోపాటు, ఉపనిషత్తులు, హితోపదేశ సంకలనాపై ముల్లర్ జరిపిన అధ్యయనానికి, ఆయన చేసిన అనువాదానికి ఎలాంటి విలువ లేదని వాదించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ముల్లర్‌ను దేశ ద్రోహిగా, హిందూ మత విశ్వాసాలను దెబ్బతీసిన వ్యక్తిగా అభివర్ణించారు. ఇప్పటికీ అదే వాదాన్ని తెరపైకి తెస్తునే ఉన్నారు. అయితే, వీరి వాదనలు, ఆరోపణలు, విమర్శల్లో నిజం లేదు. ముల్లర్ రుగ్వేద అనువాద సమయంలో ఏఏ అంశాలను తప్పుగా చూపాడో ఇప్పటికీ చెప్పడం లేదు. ముల్లర్ ఏఏ సందర్భాల్లో పొరపాట్లు చేశాడు? వాస్తవంగా వేదాల్లో ఉన్నది ఏమిటి? అనే వివరణ ఎవరైనా ఇచ్చి ఉంటే బాగుండేది. వాదన సహేతుకంగా ఉండేది. అర్థవంతమైన వాదనకు అవకాశం లభించేది. కానీ, ఏకపక్ష విమర్శలు, అపోహలతో వాదనల వల్ల లాభం ఏమిటి? ముల్లర్ తన భార్యకు రాసిన లేఖగా పేర్కొంటూ, అందులో భారత సంస్కృతిని నాశనం చేయడం ద్వారా, దేశంపై పూర్తి ఆధిపత్యాన్ని సంపాదించవచ్చని, తాను ఆ పనిమీదే ఉన్నానని పేర్కొన్నట్టు ఆరోపిస్తున్నారు. ఇది కూడా సత్యదూరమే. ఒక భాషలోని పదాలకు అనేక అర్థాలు ఉండవచ్చు. తర్జుమా చేస్తున్నప్పుడు కొన్ని సందర్భాల్లో తప్పుగా అర్థం చేసుకొని, ఆ కోణంలోనే వివరణ ఇచ్చి ఉండవచ్చు. అయితే, ముల్లర్ అలాంటి పొరపాటు చేసినట్టు ఈ ఛాందసవాదులు ఎందుకు నిరూపించలేకపోతున్నారన్నది ప్రశ్న. అదే జరిగితే, వేదాల్లో ఉన్న వాస్తవం ఏమిటో వెల్లడించవచ్చు కదా అనే అనుమానం ఎవరికైనా వస్తుంది. వీరంతా వేదాలను మత కోణంలో వీక్షించి, వాటిలోని అంశాలను మతానికి ఆపాదించారన్నది నిజం. అయితే, ముల్లర్ అదే మార్గాన్ని అనుసరించలేదు. రుగ్వేదంలో ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. ఊహాజనిత వ్యాఖ్యలు, వివరణలు లేకుండా వాస్తవ కోణంలో వేదాలను అధ్యయనం చేశాడు. తాను కనుగొన్న అంశాలను తన రచనల్లో వివరించాడు. వేదాలను భౌతిక దృష్టితో చూసి, శాస్త్రీయ విధానంలో అధ్యయనం చేశాడు. అప్పట్లో జన్యుశాస్త్రం అభివృద్ధి చెందలేదు. తవ్వకాల్లో లభించిన ఆధారాలను బట్టి, అవి ఏ కాలానికి చెందినవో నిర్ధారించే అధునాతన విధానాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ వేదాల కాలాన్ని కొంత అటుఇటుగా గుర్తించగలిగాడు. వేదాలను భౌతిక కోణంలో అధ్యయనం చేసి, సమకాలీన అంశాలతో సరిపోల్చడం వల్లే ఇది సాధ్యమైంది. కానీ,






ముల్లర్‌ను విమర్శిస్తున్న ఛాందసవాదులకు వేద కాలంపైనా అభ్యంతరాలు ఉన్నాయి. వేదాలు కనీసం 5000 సంవత్సరాల క్రితం నాటివని తరతరాలుగా తాము జనాలను నమ్మిస్తూ వస్తున్న విషయాల్లో నిజం లేదని ముల్లర్ చెప్పడం వారికి నచ్చలేదు. తమ భావజాల వ్యాప్తిని అడ్డుకునే విధంగా ముల్లర్ అనువాద రచన కొనసాగిందని గుర్తించి, అతనిపై కక్ష పెంచుకున్నారు. నిజాలు చెప్పాడు కాబట్టే ముల్లర్ అంటే వారికి భయం. వేదాల నిగ్గు తేల్చాడు కాబట్టే ముల్లర్‌పై వారికి ద్వేషం. ఈ వ్యతిరేకత అతి కొద్ది మందికి సంబంధించింది మాత్రమే. భారతీయులందరికీ వర్తించదు. ఎందుకంటే, వేదాలు అందరికీ అందుబాటులో లేవు. వేదాలను చదడం మాట పక్కకు ఉంచి, ఆ పేరు ఉచ్ఛరించడానికి కూడా తగదు. అంత పదిలంగా వాటిని తమ గుప్పిట్లో పెట్టుకొని చక్రం తప్పిన వారికి ముల్లర్ దేశద్రోహిగానే కనిపిస్తాడు. ఇప్పటి వరకూ ఏ ఒక్క శాస్త్రీయమైన సిద్ధాంత కూడా సృష్టి... మానవ పరిణామక్రమం ఒక్కసారిగా వచ్చిపడిందని చెప్పలేదు. అలా వాదించడానికి సాక్ష్యాలు కూడా లేదు. తొలి మానవులు ప్రస్తుత ఆఫ్రికా ఖండం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్టు ఇటీవలి అధ్యయనాలు పేర్కొంటున్నాయి. వేదాలకు పూర్వం కూడా భారత దేశం ఉంది. జన సంచారం ఉంది. తర్వాత కూడా కొనసాగుతునే ఉంది. వేదాల్లోనే సర్వస్వం నిక్షిప్తమై ఉంటే, ఇన్ని అధ్యయనాలు ఎందుకు? పరిశోధనలు ఎందుకు? ఆవిష్కరణలు ఎందుకు? వేల సంవత్సరాల క్రితమే ఇప్పటి కంటే ఎన్నో రెట్లు అభివృద్ధి చెంది ఉండాలి కదా? ఎందుకు కాలేదు? ఇలాంటి వందలాది ప్రశ్నలకు సమాధానాలు ఉండవు. వేదాలు ఆర్యులవని ముల్లర్ అన్నాడు. ఆర్యులు భారత్‌పై దండయాత్ర చేసిన మధ్య ఆసియావాసులని సూత్రీకరించాడు. భారత దేశానికి పర్యాయపదం తామేనంటూ వందలాది సంవత్సరాలుగా చెప్పుకుంటూ వస్తున్న వారి గొంతులో పచ్చివెలక్కాయి పడినట్టు అయింది. ఆర్యులు ఇక్కడి వారు కాదంటే, వారి వేదాలు కూడా ఇక్కడివి కాదని అర్థం. ఆర్యులు భారతీయులే అని నిరూపించడానికి తగిన ఆధారాలు లేవు. సింధూ నాగరికత ఆనవాళ్లు, హరప్పాలో లభించిన మట్టిఫలు, రాళ్లపై చెక్కిన అక్షరాలు... బొమ్మలను ఇప్పటి వరకూ డీకోడ్ చేయలేకపోతున్నాం. ఆది నుంచి ఆర్యులే ఇక్కడ ఉండివుంటే, సంస్కృతం ఒక్కటే ఏకైక భాషగా చెలామణి అయితే, హరప్పా లిపి ఎక్కడి నుంచి వచ్చింది? హరప్పా లిపిలోనూ సంస్కృత ఛాయలు ఉన్నాయన్న కొత్త వాదన హాస్యాస్పదం. వాస్తవానికి వేదాలు రాసిన అత్యంత ప్రాచీనమైన తాళపత్ర రూపం 11 వ శతాబ్దానికి చెందినది. యురోపియన్ లైబ్రేరీలలో భద్రపరచిన ఋగ్వేద సంహిత అనే రాతప్రతి, 14 వ శతాబ్దపు సాయనాచార్యుడు ఋగ్వేదానికి చేసిన వ్యాఖ్యానాన్ని ప్రాతిపదికగా చేసుకొని ముల్లర్ తన అనువాదం సాగించాడు. తన జీవితకాలంలో సుమారు 45 సంవత్సరాలు వేదాల అధ్యయనం, అనువాదానికే వెచ్చించాడు. అతను పడిన కష్టాన్ని కనీసం గుర్తించకపోగా, భారత దేశాన్ని నాశనం చేయడానికి బ్రిటిషర్లు నియమించిన సాహితీ విధ్వంసకారుడిగా ఆయనను చిత్రీకరించడం దుర్మార్గం. ముల్లర్ అనువాదాన్ని, ఆయన వాదనను కాదంటున్న ఛాందసవాదులు ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించాలి లేదా అతను చేసిన పొరపాట్లు ఏమిటో, వేదాలను ఏ విధంగా వక్రీకరించాడో వివరించాలి. వేదాలు.. అందులోని అంశాలు సామాన్యులకు సైతం తెలిసేలా, అన్ని వివరాలు అందుబాటులో ఉంచాలి. ముల్లర్ అభిప్రాయం తప్పని నిరూపించారు. సమస్త విజ్ఞాలకు మూలం వేదాలేనని తిరుగులేని సాక్ష్యాధారాలతో రూఢీచేయాలి. అలాంటి ప్రయత్నాలేవీ చేయకుండా, తమ వాదనే అందరూ వినాలనుకోవడం, తాము చూపిన మార్గంలోనే అంతా నడవాలనుకోవడం అత్యాశే. వారి విమర్శలకు అర్థం ఉండదు.

– బిట్రగుంట




## ముగ్గురూ ముగ్గురే..!

సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్ మారిస్ లిన్ఫోర్డ్ గ్వైర్‌లతో 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్. ఆయన రచనల్లో గీతాంజలి చాల గొప్పది. రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించి గీతాంజలి అని పేరు పెట్టాడు. అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువాదమైంది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. గీతాంజలి 1913వ సంవత్సరంలో రవీంద్రుడికి సాహిత్యంలో నోబెల్ బహుమతి తెచ్చిపెట్టింది. ఆసియా ఖండంలో నోబెల్ పొందిన తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించాడు. ప్రపంచ వ్యాప్తంగా ఆయన రచనలకు ఎంతో ఆదరణ ఉంది. భారత దేశంతోపాటు, బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా రవీంద్రుడే రాయడం గమనార్హం. ఇక సర్వేపల్లి (1888 సెప్టెంబరు 5–1975 ఏప్రిల్ 17) గురించి తెలియని వారు అరుదు. రాజనీతిజ్ఞుడుగా, ఉపాధ్యాయుడిగా, తత్వవేత్తగా, అసాధారణ రచయితగా, పండితుడిగా ఆయన సంపాదించాడు. 962 నుండి 1967 వరకు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా సేవలు అందించాడు. అంతకంటే ముందు రెండు పర్యాయాలు దేశ ఉపరాష్ట్రపతిగా ఉన్నారు. 1939 నుండి 1948 వరకు బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి నాలుగో వైస్‌చాన్స్‌లర్‌గా, 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్‌ఛాన్స్‌లర్‌గా కూడా ఉన్నాడు. కలకత్తా విశ్వవిద్యాలయంలో కింగ్ జార్జ్ వి చైర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్ 1921 నుండి 1932 వరకు, ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని స్పాల్డింగ్ చైర్ ఆఫ్ ఈస్టర్న్ రెలిజియన్ అండ్ ఎథిక్స్ కు 1936 నుండి 1952 వరకు పనిచేశాడు. తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా వెలిగారు. సర్ మారిస్ లిన్ఫోర్డ్ గ్వైర్ (25 ఏప్రిల్ 1878–12 అక్టోబర్ 1952) బ్రిటిష్ న్యాయవాది, న్యాయమూర్తి, విద్యా నిర్వాహకుడు. 1938 నుండి 1950 వరకు ఢిల్లీ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్స్‌లర్‌గా వ్యవహరించాడు. 1937 నుండి 1943 వరకు భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశాడు. ఢిల్లీలో 1948లో మిరాండా హౌస్‌ను నెలకొల్పిన ఘనత ఆయనదే. విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం నిర్మించిన భవనానికి ఆయన పేరు మీదే 'గ్వైర్ హాల్' అని నామకరణం చేశారు. రవీంద్రుడు, సర్వేపల్లి, గ్వైర్ ఒకే చోట కలవడం అరుదైన దృశ్యం.

## తమిళ భాష విశిష్టత




పద్యాల యొక్క శాశ్వతమైన తక్షణం తమిళ భాష యొక్క స్వభావం కారణంగా ఉండవచ్చు, ఎందుకంటే ఇది ప్రాచీనమైనది మరియు ఆధునికమైనది. ఇతర భారతీయ భాషల వలె కాకుండా, తమిళం సాంప్రదాయ భాష మరియు ఆధునిక మాట్లాడే భాష. ఎకె. రామానుజన్ గమనించినట్లుగా, ఇది 'సమకాలీన భారతదేశం యొక్క ఏకైక భాష, ఇది సాంప్రదాయ గతంతో గుర్తించదగినది.' ఈ రోజు మనం సాంస్కృతిక మేల్కొలుపు మరియు ఒకరి వారసత్వం పట్ల గర్వించే మరొక క్షణంలో ఉన్నాము. తమిళం, సంస్కృతం మరియు వివిధ ప్రాకృతాల్లోని భారతీయ క్లాసిక్లకు తిరిగి వచ్చే అవకాశం ఇది. మనల్ని, మన చరిత్రను మరియు మన పొరుగువారిని బాగా తెలుసుకోవటానికి ఇది ఒక అవకాశం. నా తరగతులన్నింటిలో మొదటి రోజున, విద్యార్థులను గది చుట్టూ తిరిగి క్లుప్తంగా తమను తాము పరిచయం చేసుకున్నాను. సాధారణ ప్రతిస్పందనలు, నేనే స్వాతి. ప్రాథమికంగా మేము గుజరాతీలమే కానీ నేను హైదరాబాద్లో పెరిగాను, లేదా నేనే మను. ప్రాథమికంగా... ఇది కష్టం, తల్లి పంజాబీ, తండ్రి తమిళియన్, తిరిగారు కానీ దుబాయ్లో స్థిరపడ్డారు. కాబట్టి ఇది కొనసాగుతుంది, ప్రతిఒక్కరూ ఒక ప్రత్యేకమైన కథతో, మరియు కేవలం ఒక గుర్తింపుతో ఎప్పుడూ ఆత్మ కాదు. అందరూ ఉపయోగించే కీలక పదం ప్రాథమికంగా& ఇది ఇది నిజంగా సంక్లిష్టమైనది, కానీ నేను దానిని సరళీకృతం చేయని వ్వండి అని చెప్పినట్లు ఉంది. భారతదేశం తరగతిలో విద్యార్థి అయితే, ఆమె నేనే భరత్. ప్రాథమికంగా...తల్లి తమిళం, తండ్రి సంస్కృతం. నా కుటుంబం ఎల్లప్పుడూ కదులుతుంది, నేను ప్రతిచోటా నివసించాను.ఎకె రామానుజన్ సూచించినట్లుగా, సంస్కృతం భారతదేశం యొక్క మాతృభాష, ఆమె ప్రజా భాష, తమిళం ఆమె మాతృభాష, ఇంటి భాష. భారతదేశం యొక్క నిజమైన జన్యు సంకేతం తమిళ తల్లి, సంస్కృత తండ్రి. మరియు మనలో ప్రతి ఒక్కరూ మనలో అనేక గుర్తింపులను కలిగి ఉన్నట్లే, భారతదేశం కూడా తనలో ఉన్న అనేక ప్రపంచాలను కలిగి ఉంటుంది. భారతదేశం యొక్క గొప్ప సాహిత్యం యొక్క నిజమైన పాఠం ఏమిటంటే, ఒకే భాష, మతం లేదా మతం ఆశ్రయించకుండా ప్రజలు ఐక్యంగా ఉండగలరు.



ఇప్పటి వరకూ లభించిన అత్యంత పురాతనమైన రాతి ఫలకాల్లో ఇదీ ఒకటి. ఢిల్లీ మ్యూజియంలో ఉన్న ఈ ఫలకంపై ఒకటి నుంచి ఆరు పదాలతో మొత్తం 11 లైన్లను నాగరి లిపిలో చెక్కారు. ఫలకం చుట్టూ పటిష్టమైన గ్రిడ్ ఉంది. ఈ స్లాబ్ లేదా రాతి ఫలకం కన్నింహామ్ నుంచి వచ్చిందని అంటున్నారు. ఓర్ఫియస్ వేణువు వాయిస్తున్న దృశ్యం అస్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఫలకాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేయగలిగితే, చారిత్రక సమాచారం లభించే అవకాశాలు ఉన్నాయి.

## ఆ గ్రంథాలయంలో 10 కోట్ల పుస్తకాలు!





పది కోట్ల పుస్తకాల గ్రంథాలయం 211 ఏళ్ల చరిత్ర...10 కోట్ల పుస్తకాలు... 3 వేల మంది కి పైగా సిబ్బంది... అన్నీ కలిస్తే... ప్రపంచంలోనే అతి పెద్ద గ్రంథాలయం! మీరు అప్పుడప్పుడు గ్రం థాలయానికెళ్లి పుస్తకాలు చదువుకుంటారుగా? మరైతే ప్రపంచంలోనే అతి పెద్ద లైబ్రరీ ఎక్కడుందో తెలుసా? అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో. అమెరికా ప్రభుత్వం దీన్ని కేవలం 5000 డాలర్ల తో 1800లో ప్రారంభించింది. అంటే దీనికి ఏకం గా 211 ఏళ్ల చరిత్ర ఉందన్నమాట. లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్‌గా పిలిచే దీంట్లో మొత్తం 14 కోట్ల వస్తువులు ఉన్నాయి. అంటే పుస్తకాలతో పాటు సీడీలు, పురాతన పత్రాలు, మ్యాపులూ, వీడియోలు ఇలాంటివన్న మాట. కేవలం పుస్తకాల సంఖ్యే 10,90,29,769. ఈ పుస్తకాలన్నీ ఎంత స్థలాన్ని ఆక్రమిస్తాయో తెలుసా? వీటిని పేర్చిన అరలన్నీ కలిపితే 1046 కిలోమీటర్ల పొడవుంటాయి. గ్రం థాలయం నిర్వహణకు 3,597 మంది సిబ్బంది పనిచేస్తారు. అతి పెద్ద లైబ్రరీగా గిన్నిస్ రికార్డు కూడా పొందిన దీనికి www.loc.gov అనే వెబ్సై ట్ ఉంది. దీన్ని ప్రారంభించిన సుమారు పన్నెండు సంవత్సరాల్లో, అమెరికాపై యుద్ధానికి దిగిన బ్రిటిష్ సేనలు దీంట్లోని విలువైన పుస్తకాలను ఎత్తుకెళ్లి గ్రంథాలయానికి నిప్పుబెట్టారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు థామస్ జెఫర్సన్ తాను సేకరించిన 6000 పుస్తకాలతో మళ్లీ దీన్ని ప్రారంభించారు. తర్వాత క్రమంగా పుస్తకాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇప్పుడిది అత్యాధునిక సౌకర్యాలతో, కంప్యూటర్ పరిజ్ఞానంతో మూడు విశాలమైన భవనాల్లో కొలువుదీరింది. అన్ని రంగాల సమాచారాలతో సిద్ధంగా ఉండే ఇది అమెరికా ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. అమెరికా కాపీరైట్ సంస్థగా కూడా పనిచేస్తుంది. ఎలాంటి సమచారం కావాలన్నా క్షణాల్లో దొరుకుతుంది. విభిన్న రంగాల పరిశోధనలకు కావాల్సిన విలువైన సమాచారం లభిస్తుంది. ప్రభుత్వానికి సమాచారం అందించే సంస్థగా కూడా పనిచేస్తుంది.

### మీకు తెలుసా?

- 470 భాషల పుస్తకాలు ఈ లైబ్రరీలో ఉన్నాయి.
- 526,378 కాపీరైట్లు నమోదయ్యాయి.
- పాఠకుల కోసం 20 విశాలమైన గదులున్నాయి.
- సదస్సుల నిర్వహణకు అయిదు వేదికలు ఉన్నాయి.
- సినిమా ప్రదర్శనల కోసం ఒక థియేటర్ ఉంది.

## శతవత్సర సంబురాలు




శతవత్సర సంబురాలు
ఘనంగా జరుపుదాం
ఐక్య ఉద్యమాలు చేయ
జట్టు గట్టి కదులుదాం
వామపక్ష యోధులారా
ఇకనైనా మారుదాం
ఎర్రజెండా త్యాగాలను
ప్రజల చెంత చేర్చుదాం...

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం

తొడ చరిచి బరి మీద
గిరిగిసి నిలబడదాం
అవినీతి అంతానికి
చరమ గీతీ పాడుదాం
కమ్యూనిస్టు పార్టీ చరిత
నలుదిక్కులా చాటుదాం
నూరు వసంతాల
పార్టీ వేడుకలను జరుపుదాం

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం
పందొమ్మిది వందల
ఇరువై ఐదు డిసెంబర్
ఇరువై ఆరు తారిఖున
పుట్టిన కమ్యూనిస్టు పార్టీ
ప్రజల కూడగట్టింది
పోరుబాటలేసింది
ప్రపంచన ఎర్రజెండా
గెలవాలని తెలిపింది

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం

తెల్ల దొరల తోళ్లు దీసి
స్వరాజ్యాన్ని తెచ్చింది
నిజామొనీ మెడలు వంచి
గద్దె దింపి పంపింది
దొరల గడీలను కూల్చి
భూ పంపిణీ చేసింది
సాయుధ పోరాటాన్ని
సమగ్రంగా నడిపింది

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం
కూడు గుడ్డ నీడ కొరకు
అనుక్షణం పోరాడే
కమ్యూనిస్టు పార్టీ
ఇది ప్రజల జీవగడ్డ ఇది
పోరాడే తత్వాన్ని
బోధించిన తల్లి ఇది
సమ సమాజ స్థాపనకై
తపిస్తున్న వళ్ళి ఇది

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం


అడుగడుగునా అడ్డంకుల
ఎదిరించి సాగుతోంది
అలుపెరగని పోరాటం
తుదకంటూ నడుపుతోంది
కదలిరండి కలిసి రండి
కమ్యూనిస్టు యోధులారా
కదం కదం కలుపుకుంటూ
ప్రజల పాట పాడుకుంటూ

జిందాబాద్ జిందాబాద్
సిపిఐ జిందాబాద్
లాల్ సలాం లాల్ సలాం
లాల్ బౌవుట లాల్ సలాం

కె.లక్ష్మీ నారాయణ

## ఈ వారం కవితలు

### పరిస్థితులు



ఈ ఉండీ లేని పరిస్థితులు
ఈ ఉరుకుల పరుగుల
జీవితాలు,
ఆత్మీయతను అనురాగాన్ని
అణగ ద్రోక్కుతున్నవి.

మానవులను యంత్రాలుగా
మారుస్తున్నవి!
పునాదులు లేని
తల్లి దండ్రులు
ఆనాథలుగా
మారుతున్న పిల్లలు

ఈ ఎగుడు దిగుడు జీవితాలలో
ఏనాడూ దొరకదు శాంతి
ఏరోజు కలుగదు సంతృప్తి!
ఆలు మగల ప్రతిపాదనలు
అరకొర సంపాదనలు

ఎంత పరితపించినా
ఫలితం లభించడం లేదు
ప్రశాంతి కనిపించడం లేదు!
కుబేరులకైనా ఆశలు తీరవు
కుచేలులకైనా ఆస్తులుచేరవు
సరైన మార్గం దొరకదాయే.!
సంతృప్తి లేని బ్రతుకులాయే!!

– ఎన్.రాజేష్
9849335757

### సమాధి

మానవత్వం
మంట కలిసిపోనుంది
అమానుషత్వం
మింటికెగిసినది

అనురాగం ఆప్యాయతలు
అడుగంటినవి
ఆస్తులు అంతస్తులు
రాజ్యమేలుతున్నవి

కుట్రలు కుతంత్రాలు
పడగలు విప్పుతున్నవి
సఖ్యత సంస్కారాలు
నోరెళ్ళ బెట్టినవి

దేశాలు విద్వేషాలతో
తన్నుకు చస్తున్నవి
మానవ జాతి కక్షలతో
అవనిని మసక బారుస్తున్నవి

ప్రకృతి తన ఆకృతిని
కోల్పో నున్నదా?
భూగోళ ఖగోళాలు
భూకంపాల నిలయమైనదా?

విజ్ఞానం అజ్ఞానాన్ని
ఆహ్వానిస్తున్నది
పరిజ్ఞానం వికాసాన్ని
సమాది చేస్తున్నది

ఎన్.నాగేశ్వర్ రావు
8688553470

### ఊహల ఇల

ఊహ ఊహలతేరు
ఊహ లేక
ఊహలో తేలలేరు
ఊహల్లో జగము వేరు
ఊహ నిజమైతే నీకుసరిలేరు!

ఊహ మనసు తరంగం
ఊహ మనిషి అంతరంగం
ఊహ ఊహాలోక విహంగం
ఊహలో ఇంతంత అంతరం !

ఊహలు ఊరే ఉర్వి
ఊహ ఉపాయాల కారి
ఊహ అపాయాల కారి
ఉచ్చుల ఇరుకుల మారి!
ఊహ ఓ స్వప్న లోకం
ముందుకు నడిపే కేతనం
జయాప జయాలకు ఊతం
ఇంగితం లేకుంటే అంతే!

ఊహ అటు ఇటు
ఊగే ఊయల !
ఊగే ఈజాల లాలసల
ఊగిసల గుంజులాటల ఇల !

ఊహ కన్న
ఊహ కన్న కలలు మిన్న
ఊహ లేక మహిపాలన
ఊహించగలమా బక్కన్న!

– పి.బక్కారెడ్డి,705315250

# ఢిల్లీలో బిజెపి అధికారంలోకి వస్తే ఏ సంక్షేమ పథకాలూ ఆగవు



రోహిణి ప్రాంతంలో ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మోదీ అభయం

అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' విపత్తు నుంచి విముక్తి కలిగించాలని ప్రజలకు పిలుపు

**న్యూఢిల్లీ :** త్వరలోనే జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ఆద్మీ పార్టీ, బిజెపి అధికారం చేజిక్కించుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. రెండు ప్రధాన పార్టీలు విమర్శల స్వరాన్ని పెంచాయి. దేశ రాజధానిని భవిష్యత్ నగరంగా మార్చేందుకు బిజెపికి అవకాశం ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం కేంద్రంతో పోరాడుతూ దశాబ్దకాలాన్ని వ్యర్థం చేసిందని ఆరోపించారు. ఆదివారం ఇక్కడి రోహిణి ప్రాంతంలో జరిగిన ఒక ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ 'ఆప్' ప్రభుత్వం ఢిల్లీని తాకిన 'విపత్తు' (ఆప్దా) అని నొక్కిచెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి మార్పుకు నాంది పలుకబోతుందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పథకాలు నిలిపివేయబడవని ఆప్ ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. అయితే బిజెపి అధికారంలోకి వస్తే ప్రభుత్వం వాటి సంక్షేమ పథకాల అమలులో అవినీతిని కూకటివేళ్లతో పెకిలిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. ఢిల్లీలో ఈ ఆప్దా తొలగిపోయినప్పుడే అభివృద్ధిలో డబుల్ ఇంజన్ పుంజుకుంటుందని మోదీ అన్నారు.కేంద్రం దేశరాజధాని ఢిల్లీలో హైవేలను అభివృద్ధి చేస్తోందని, మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరిస్తోందని, నమో రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను ప్రారంభించిందని, పెద్ద ఆసుపత్రులను నడుపుతోందని ప్రధాని చెప్పారు. 'అయితే, మీరు మెట్రో నుండి బయటకు వచ్చిన క్షణం గుంతల రోడ్లు, పొంగిపొర్లుతున్న మురికికాలువలు చూస్తారు. కొన్ని ప్రాంతాలలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు దీర్ఘకాల ట్రాఫిక్ జాముల కారణంగా వాటిని నడపడానికి నిరాకరిస్తారు' అని మోదీ చెప్పారు. గత 10సంవత్సరాలలో ఢిల్లీ 'ఆప్దా' (విపత్తు)కంటే తక్కువ లేని ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని చూసింది. ఈ ఒక్క స్వరం ఢిల్లీలో ప్రతిధ్వనిస్తుందని ప్రజలు గ్రహించారు. 'ఆప్దా నహీ సాహేంగే, బాదల్ కర్ రహేంగే' (విపత్తును తట్టుకోలేరు..మార్పును తీసుకువస్తుంది) అని మోదీ చెప్పారు. ఢిల్లీ ప్రజలు కోవిడ్19తో పోరాడుతున్నప్పుడు, ఆక్సిజన్, మెడిసిన్ కోసం కష్టపడుతున్నప్పుడు 'ఆప్దా ప్రజల' మొత్తం దృష్టి వారి శీష్‌మహల్ నిర్మాణంపైనే ఉందని ప్రధాని పేర్కొన్నారు. 'శీష్‌మహల్ కోసం పెద్ద బడ్జెట్. ఇది వారి నిజం. వారు ఢిల్లీ ప్రజలను ఏమాత్రం లెక్కచేయరు. అందుకే ఈరోజు ఢిల్లీ వాసులు చెబుతున్నారు. ఆప్షన్లు మేం సహించం. మేం మార్చబోతున్నాం' అని ఆయన చెప్పారు. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం వస్తే అనేక సంక్షేమ పథకాలు అమలు నిలిపివేయబడతాయని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఆరోపిస్తుందని నరేంద్రమోదీ విమర్శించారు. కొత్త బిజెపి ప్రభుత్వం కేంద్ర పథకాలనూ అమలు చేస్తుందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఢిల్లీలో ప్రజలు ఇటీవల లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని ఆశీర్వదించారని, అసెంబ్లీ ఎన్నికలలోనూ బిజెపిని ఢిల్లీ ప్రజలు ఆశీర్వదించబోతున్నారని, ఢిల్లీ హృదయాన్ని గెలుచుకోవడానికి, దానిని 'ఆప్దా' (విపత్తు) నుండి విముక్తి చేయడానికి అసెంబ్లీ ఎన్నికలే ప్రజలకు ఒక సువర్ణ అవకాశం అని మోదీ చెప్పారు.


**ఢిల్లీ మెట్రో ఫేజ్-4 మొదటి సెక్షన్‌ను ప్రారంభించిన ప్రధాని**

ప్రధానమంత్రి మోదీ ఢిల్లీ మెట్రో ఫేజ్4లో జనక్‌పురి వెస్ట్, కృష్ణా పార్క్ ఎక్స్‌టెన్షన్ సెక్షన్‌ను ఆదివారం ప్రారంభించారు. రిథాలానరేలాకుండ్లీ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు. జనక్‌పురి వెస్ట్‌కృష్ణా పార్క్ ఎక్స్‌టెన్షన్ విభాగం ఢిల్లీ మెట్రో ఫేజ్4 ప్రారంభోత్సవం మొదటి భాగం. కృష్ణా పార్క్ ఎక్స్‌టెన్షన్ స్టేషన్‌తో పాటు ఢిల్లీ మెట్రో నెట్‌వర్క్ ఇప్పుడు 398.448కి.మీల విస్తీర్ణంలో 289స్టేషన్లను కలిగి ఉంది. ఈ కొత్త విభాగం మెజెంటా లైన్‌లో ఇప్పటికే పనిచేస్తున్న బొటానికల్ గార్డెన్ జనక్‌పురి వెస్ట్ పొడిగింపు. ఈ విభాగం జోడింపుతో మెజెంటా లైన్ ఇప్పుడు సుమారు 40కి.మీల దూరాన్ని కవర్ చేస్తుంది. మెజెంటా లైన్ 2026నాటికి కృష్ణ పార్క్ ఎక్స్‌టెన్షన్ నుండి ఆర్‌కె ఆశ్రమ్ మార్గ్ నుంచి దశలవారీగా విస్తరించబడుతుంది. స్టేజ్4 విస్తరణలో భాగంగా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డిఎంఆర్‌సి) దేశ రాజధానిలో ఐదు వేర్వేరు కారిడార్లలో 86కి.మీ.ల కొత్త లైన్లను నిర్మిస్తోందని ఒక అధికారి తెలిపారు.

**కేంద్రం, ఢిల్లీ సర్కార్ మధ్య సహకార ఫలితమే ప్రధాని మోదీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు : కేజ్రీవాల్**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన రెండు ప్రాజెక్టులను 'ఢిల్లీ మౌలిక సదుపాయాలకు మైలు రాళ్లు' అని ఆదివారం నాడు ఇక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. అవి కేంద్ర, నగర ప్రభుత్వాల భాగస్వామ్యసంస్థలని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని సాహెబాబాద్ నుండి న్యూ అశోక్‌నగర్ వరకు ఢిల్లీ మీరట్ రీజియనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టిఎస్) కారిడార్‌లోని 13కిలోమీటర్ల విస్తీర్ణాన్ని, ఢిల్లీ మెట్రో ఫేజ్4లోని జనక్‌పురి వెస్ట్‌కృష్ణా పార్క్ ఎక్స్‌టెన్షన్ సెక్షన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. విలేకరుల సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలను అభినందించారు. తన విమర్శకులపై విరుచుకుపడ్డ కేజ్రీవాల్ ఆప్ పోరాటాలలో మాత్రమే పాల్గొంటుందనే వారికి ఈ ప్రారంభోత్సవాలే సమాధానం అని అన్నారు. తన పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించిన అరవింద్ కేజ్రీవాల్ ఆప్ నాయకులను జైలులో పెట్టారని, తీవ్రంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇక పాలనపై దృష్టిని కొనసాగించారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారాయన. బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను నెరవేర్చాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి మోడీని కోరారు.

## పూరీ జగన్నాథ ఆలయంపై... 'డ్రోన్' కలకలం!



**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది. భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

## నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల పాలిట శాపం




ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య విమర్శ

**చండీగఢ్:** ఇటీవల ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల పాలిట అత్యంత ప్రమాదకారిగా మారిందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు దర్శన పాల్‌సింగ్, సత్యవాన్, కృష్ణ ప్రసాద్ ధ్వజమెత్తారు. హర్యానాలోని టోకోనాలో శనివారం రైతుల మహా పంచాయతీ జరిగింది. రాష్ట్రంలో వివిధ గ్రామాల నుంచి 20వేల మందికి పైగా రైతులు హాజరయ్యారు. హర్యానా రాష్ట్రానికి చెందిన వివిధ రైతు సంఘాల నాయకులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సభలో రైతులను ఉద్దేశించి రావుల మాట్లాడుతూ... మార్కెటింగ్ సొసైటీని రద్దుచేసి కార్పోరేట్ శక్తులను కట్టబెట్టాలని కేంద్రం చూస్తుందని మండిపడ్డారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా, కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవాలని చూస్తుందన్నారు. అదే జరిగితే మన ఫెడరల్ వ్యవస్థకి భంగం వాటిల్లుతుందన్నారు. ఈ చట్టం గతంలో తెచ్చిన మూడు నల్ల చట్టాల కన్నా దారుణమైనదని అన్నారు. ఆనాడు నల్ల చట్టాలను రద్దు చేయడానికి 13 నెలల పాటు దేశవ్యాప్తంగాను, ఢిల్లీ సరిహద్దులలోనూ సుదీర్ఘ పోరాటం జరిగిందని గుర్తు చేశారు. 545 రైతు సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒకేతాటిపైకి వచ్చి పోరాడాయన్నారు. ప్రపంచంలోనే రైతాంగం పోరాటానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. అది ఒక చారిత్రాత్మకమైన రైతు ఉద్యమం అన్నారు. ఆ పోరాటంలో 740 మంది రైతు బిడ్డలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇంకా ఇప్పటికి నాలుగు వేలకు పైగా కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. చివరకు నరేంద్ర మోదీ దిగివచ్చి ఆ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవడమే కాకుండా యావత్ రైతు జాతికి క్షమాపణ చెప్పారన్నారు. ఆనాడు రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలలో మద్దతు ధర, రుణమాఫీ, విద్యుత్ బిల్లు ఉపసంహరణ ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాలు దాటిన అవి అమలుకు నోచుకోలేదన్నారు. ఈ సందర్భంలో రైతు నాయకుడు దలైన్‌వాలా ఈ డిమాండ్లపై 45 రోజులకు పైగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ చావు బతుకుల మధ్య ఉన్నారన్నారు. అయినా ఈ ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదన్నారు. ఇప్పుడు మళ్లీ గోరుచుట్టుపై రోకలి పోటులా నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీని ఉపసంహరణకు మరో మారు దేశవ్యాప్తంగా పోరాటానికి రైతులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హర్యానా, పంజాబ్‌లలో జరుగుతున్న మహా పంచాయతీలను మిగిలిన అన్ని రాష్ట్రాల్లో నిర్వహించి రైతు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని రావుల వెంకయ్య అన్నారు.

## ఆధారాలు చూపండి

అవినీతి ఆరోపణలపై కేంద్రమంత్రి కుమారస్వామికి సిఎం సిద్ధరామయ్య సవాల్



**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామిపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వంలోని మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన చేస్తున్న ఆరోపణలు నిజమైతే తగిన ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. తగిన రుజువులు లేకుండా తమపై అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా మంత్రులు 60 శాతం కమీషన్ తీసుకొని..అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి ఆరోపిస్తున్నారు. కేవలం ఆరోపణలు చేయడమే ప్రతిపక్షాల పని కాదు. వాటిని ఆయన నిరూపించే వరకు వదిలిపెట్టము అని ముఖ్యమంత్రి అన్నారు. బస్సు ఛార్జీల పెంపుపై సిఎం మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలు, డీజిల్ ధరల పెరుగుదల, కొత్త బస్సుల కొనుగోలు వ్యయం, ద్రవ్యోల్బణం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బిజెపి అధికారంలో ఉన్నప్పుడు, కుమారస్వామి సిఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచలేదా అని ప్రశ్నించారు. ఇటీవల మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల వద్ద కమీషన్‌లు తీసుకుంటూ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పిడబ్ల్యుడి నీటిపారుదల శాఖల్లో దోపిడీ మరింత హద్దులు దాటుతోందని అన్నారు. పని కావాలంటే ప్రతి ప్రభుత్వ శాఖలో కొంత మొత్తంలో ఫిక్స్‌డ్ అమౌంట్ చెల్లించాల్సి ఉందని..అందువల్లే కాంట్రాక్టర్లు, చిన్న స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఆర్‌జెడిపై విరుచుకుపడ్డ నితీశ్



**పాట్నా :** బీహార్ ముఖ్యమంత్రి నితిశ్‌కుమార్ తన బద్ధ శత్రువు అయిన లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్‌జెడిపై విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని ప్రతిపక్ష పార్టీతో 'పొరపాటున' పొత్తులు పెట్టుకున్నానని పేర్కొన్నారు. ఇప్పుడు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలోకి తిరిగి వచ్చిన మాజీ మిత్రపక్షం కోసం ఆర్‌జెడి తన 'తలుపులు' తెరిచి ఉంచుతోందని స్వయంగా మాజీ సిఎం లాలూ ప్రసాద్ పేర్కొన్న కొద్ది రోజుల తర్వాత జెడి(యు) అగ్రనేత ఈ వ్యాఖ్య చేశారు. రాష్ట్ర వ్యాప్త ప్రగతి యాత్రలో భాగంగా ఉత్తర బీహార్ జిల్లా ముజఫర్‌పూర్‌లో నితీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, తమకంటే ముందు అధికారంలో ఉన్నవారు ఏదైనా చేశారా అని ప్రశ్నిస్తూ... సూర్యాస్తమయం దాటిందంటే ప్రజలు తమ ఇళ్ల నుండి బయటకు రావాలంటే భయపడేవారన్నారు. పొరపాటున వారితో రెండుసార్లు జత కట్టానన్నారు. 'అప్పట్లో ఆడవాళ్ళ పరిస్థితి ఏంటి.. నేడు జీవిక అని పేరుపెట్టుకున్న స్వయం సహాయక సంఘాలను ఈరోజు మీరు చూడవచ్చు. కేంద్రం మా మోడల్‌ను రిప్లేట్ చేసి అజీవిక అని అభివర్ణించింది. ఇంతకు ముందు ఇంత ఆత్మవిశ్వాసం ఉన్న గ్రామీణ మహిళలను చూసారా' అని నితీశ్ ప్రశ్నించారు. అయితే కుమార్, ప్రసాద్ నుండి వచ్చిన రహస్య 'ఆఫర్' గురించి ప్రశ్నలు వేయగా, ఆయన వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఏడాది లోపు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ద్వంద్వ వైఖరిని అనుసరిస్తున్న నేపథ్యంలో ప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎకు జెడి(యు) అధిష్టానం 'ముఖం' అని రాష్ట్ర బిజెపి నాయకులు తమ వంతుగా సమర్థిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీకి దూరమైన బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండేందుకు జెడియు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి వంటి మిత్ర పక్షాలపైనే ఆధారపడి ఉంది.

## ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..

• బిజెపి అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు • కాంగ్రెస్ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బిజెపి అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సిఎం ఆతిశీపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. 'బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం' అని అన్నారు. కాగా, బిజెపి అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బిజెపి మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. 'ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధూరి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి ఎంపిపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బిజెపి అసలు ముఖం ఇదే' అని ఎక్స్‌లో విమర్శించారు.

## అత్యంత శీతలం దుప్పటిలో దక్షిణ కశ్మీరం !

8.1డిగ్రీల సెల్సియస్ చలిపులికి 'కోకెర్‌నాగ్' పట్టణ ప్రజలు గజగజ



**శ్రీనగర్ :** దక్షిణ కశ్మీర్‌లోని కోకెర్‌నాగ్ పట్టణం 8.1 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డకట్టడంతో లోయలో అర్ధరాత్రి ఉష్ణోగ్రత తీవ్రంగా తగ్గుతోందని అధికారులు ఆదివారం తెలిపారు. శ్రీనగర్‌లో 2.5డిగ్రీల సెల్సియస్ వద్ద మెర్క్యూరీ స్థిరపడిందని శ్రీనగర్‌లోని మెటీరియాలాజికల్ (ఎంఇటి) తెలిపింది. ఉత్తర కశ్మీర్‌లోని స్కీయింగ్ కార్యకలాపాలకు పేరుగాంచిన టూరిస్ట్ రిసార్ట్ పట్టణం గుల్‌మార్గ్‌లో కనిష్టంగా 4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని వార్షిక అమర్‌నాథ్ బేస్ క్యాంపులలో ఒకటైన పహల్గామ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.2డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కశ్మీర్‌కు గేట్‌వే పట్టణంగా పేరొందిన ఖాజీగుండ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 3.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, అదే సమయంలో పాంపోర్ పట్టణంలోని కొనిబాల్‌లో 3.5డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. ఉత్తర కశ్మీర్‌లోని రాత్రి ఉష్ణోగ్రతమైనస్ 2.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.దక్షిణ కశ్మీర్‌లోని కోకెర్‌నాగ్‌లో 8.1డిగ్రీలు నమోదయ్యాయి. కశ్మీర్‌లోయలో అత్యంత శీతల ప్రదేశంగా కోకెర్‌నాగ్ ప్రాంతం నమోదు అయింది. కశ్మీర్ ప్రస్తుతం 'చిల్లైకలన్' గుప్పిట్లో ఉంది. ఇది డిసెంబరు 21న ప్రారంభమైన శీతాకాలపు అత్యంత కఠినమైన కాలం. 'చిల్లైకలన్' 40రోజుల సమయంలో హిమపాతం ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోతుంది. చిల్లైకలన్ జనవరి 30న ముగుస్తుంది. దాని తర్వాత 20రోజుల పీరియెడ్ 'చిల్లైఖుర్ద్' (స్వల్ప చలి), ఆ తర్వాతి 10రోజుల కాలంలో చిల్లైబచ్చా(బేబీ కోల్డ్) అమలులో ఉంటుంది.

### 10విమానాలు రద్దు

దట్టమైన పొగమంచు కమ్మేయడంతో విజిబులిటీ కనిపించని కారణంగా శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం నాడు 10విమానాలు రద్దుచేయబడ్డాయి. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. 'శ్రీనగర్ విమానాశ్రయంలో ఆదివారం తెల్లవారుజామున విజిబిలిటీ 50 మీటర్లు ఉంది. ఇది విమాన ట్రాఫిక్‌ను ప్రభావితం చేసింది. అన్ని విమానయాన సంస్థలు తమ తమ విమానాలను ఉదయం 10గంటల తర్వాత పుష్ చేశాయి' అని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) అధికారి ఒకరు చెప్పారు. దృశ్యమానతలో స్వల్ప మెరుగుదలతో ఇప్పటి వరకూ 10విమానాలైతే రద్దు చేయబడ్డాయని సంబంధిత అధికారి తెలియజేశారు. శనివారం నాడు దట్టమైన పొగమంచు కారణంగా విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు ఆలస్యం అయ్యాయని, దారి మళ్లింపులు చర్యలను చేపట్టడం జరిగిందని వివరించారు.

## అన్ని ప్రాంతాలలోని వాహనాలకూ... 'కలర్ కోడెడ్ స్టిక్కర్లు'



ఉత్తుర్వుల పొడిగింపు అభ్యర్థన పరిశీలనకు 'సుప్రీంకోర్టు' ఓకే

**న్యూఢిల్లీ :** వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి వాహనాలకు హోలోగ్రామ్ ఆధారిత రంగు కోడెడ్ స్టిక్కర్ల వినియోగం ఆవశ్యకతను సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)తో సంబంధం లేకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉండే వాహనాలకు ఈ స్టిక్కర్లను తప్పనిసరిగా చేయడానికి అత్యున్నత న్యాయస్థానం ఆమోదం తెలిపింది. 2018లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ(ఎంఒఆర్‌టిహెచ్) ప్రతిపాదనను సుప్రీంకోర్టు అంగీకరించింది. ఇది జాతీయ రహదారి ప్రాంతంలో పెట్రోల్, సిఎన్‌జి ఉపయోగించే వాహనాలలో హోలోగ్రామ్ ఆధారిత లేత నీలం రంగు స్టిక్కర్లను ఉపయోగించాలని భావించింది. డీజిల్‌తో నడిచే వాహనాలకు నారింజరంగు స్టిక్కర్లు ఉంటాయి. ఉపయోగించిన ఇంధనం ఆధారంగా వాహనాలను గుర్తించే వీలు కల్పించే ఈ స్టిక్కర్లలో వాహనం రిజిస్ట్రేషన్ తేదీని కూడా చేర్చాల్సి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అనుసరించి, హోలోగ్రామ్ ఆధారిత స్టిక్కర్ల పథకానికి చట్టపరమైన గుర్తింపు నిచ్చేందుకు కేంద్రం సెంట్రల్ మోటార్ వెహికిల్స్ రూల్స్ 1989లోని రూల్50ని 2001 నాటి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పి)ఆర్డర్‌ను సవరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్.ఓకా, జస్టిస్ ఎజి.మహేశ్ లతో కూడిన డివిజన్ బెంచ్ ముందు శుక్రవారం ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ ద్విసభ్య ధర్మాసనం వాహనకాలుష్యాన్ని ఎదుర్కోవడానికి వాహనాలకు హోలోగ్రామ్ ఆధారిత రంగు కోడెడ్ స్టిక్కర్ల అమలు ఆవశ్యకతను ఉద్ఘాటించింది. రంగు కోడెడ్ స్టిక్కర్ల అమలు కోసం ఆదేశాలను ఇచ్చింది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) అమలులో ఉన్న సమయంలోనే డీజిల్ వాహనాలను గుర్తించవచ్చని పేర్కొంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)తో సంబంధం లేకుండా వాహనాలకు ఈ స్టిక్కర్ల మార్గదర్శకాలను పొడిగించడాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం సర్వోన్నత న్యాయస్థానం తన ప్లీనరీ అధికారాలు ఉపయోగించడం ద్వారా 2018 సంవత్సరం ఆదేశాలను ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకూ పొడిగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశంపై వాదనలు వినిపించాల్సిందిగా కేంద్రంతో సహా సంబంధిత పక్షాలను కోరడంతో పాటు తదుపరి విచారణను జనవరి నెలకు వాయిదా వేసింది. 2024 నవంబరులో (గత ఏడాది) వాహనాలలో హోలోగ్రామ్ ఆధారిత రంగు కోడెడ్ స్టిక్కర్లను ఉపయోగించడంపై దాని ఆదేశాలపై సమ్మతి నవీకరణ కోసం సుప్రీంకోర్టు కేంద్రం, ఢిల్లీ, ఇతర రాష్ట్రాలను కోరింది. పథకాన్ని ఖచ్చితంగా అమలుచేయాలనే అత్యున్నత న్యాయస్థానం డిసెంబరు 13, 2023న ఇచ్చిన ఆదేశాన్ని పాటించలేదని ఇది గమనించింది. ఢిల్లీనేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో వాయు కాలుష్యానికి సంబంధించిన వ్యాజ్యాన్ని విచారిస్తున్నప్పుడు వాహనాలకు రంగు కోడెడ్ స్టిక్కర్ల సమస్య తలెత్తింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సిఆర్) కింద రాజస్థాన్ సహా ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో అమికస్ క్యూరీగా సహకరిస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ ధర్మాసనం ముందు తన వాదన వినిపిస్తూ ఢిల్లీనేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్) పరిధి రోడ్లపై తిరిగే వాహనాలలో 50శాతానికి పైగా కలర్ కోడెడ్ స్టిక్కర్లు కలిగి లేవని చెప్పారు. కలర్ కోడెడ్ స్టిక్కర్ స్కీమ్‌ను మొదటగా అమికస్ క్యూరీ వాహనాలను గుర్తించడానికి , 'పూర్ కేటగిరీ' వాయు కాలుష్యం ఉన్న రోజుల్లో 'బ్యాడ్ క్వాలిటీ' (చెడు నాణ్యత) ఇంధనాన్ని ఉపయోగించే వాహను నియంత్రించడానికి సూచించింది. డిసెంబరు 13, 2023న సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని ఎంఒఆర్‌టిహెచ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిందని కేంద్రం తరపున హాజరైన న్యాయవాది తెలిపారు. అయితే వాహనాలకు సంబంధించిన కలర్‌కోడెడ్ స్టిక్కర్లపై ఆదేశాలను పాటించడంపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. 2023, డిసెంబరు 13న ఢిల్లీలో దాదాపు 27లక్షల వాహనాలు ఉన్నట్లు కోర్టు గుర్తించింది. కలర్ కోడెడ్ స్టిక్కర్లు 17నుంచి 18లక్షల వరకు మాత్రమే వాహనాలకు స్టిక్కర్లు పెట్టబడ్డాయి. వాయు కాలుష్యాన్ని తనిఖీ చేయడానికి సహాయపడే అన్ని వాహనాలు ఈ స్టిక్కర్లను పొందుపరిచేలా చూడాలని డివిజన్‌బెంచ్ ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆగస్ట్ 13, 2018న మొదటగా వారు ఉపయోగిస్తున్న ఇంధన స్వభావాన్ని సూచించే వాహనాలకు హోలోగ్రామ్ ఆధారిత కలర్ కోడెడ్ స్టిక్కర్లను ఉపయోగించాలనే కేంద్రం ప్రతిపాదనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు గ్రీన్‌కలర్ నంబర్ ప్లేట్లు లేదా గ్రీన్ స్టిక్కర్లు ఉండేలా చూడాలని రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (ఎంఒఆర్‌టిహెచ్)కు ధర్మాసనం సూచించింది.

## ప్రభుత్వం స్పందించి గుడిసె వాసులకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

* సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి** :వేంసూరు మండల పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న భూ పోరాటం ఉధృతం పేదల పెద్ద సంఖ్యలో పాల్గొని గుడిసెలు వేసుకోవటం జరుగుతుంది. గుడిసెలను గుడిసె వాసులను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా పట్టా భూముల్లో ఇల్లు లేని పేదలు అట్టి భూములను శుభ్రం చేసి గుడిసెలు వేసుకుంటున్నారని పేదల బాధలను ప్రభుత్వం గమనించి వెంటనే వారికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని సంక్రాంతి నుంచి పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని వేంసూరులో కూడా గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇల్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహిళా సమైక్య డివిజన్ కన్వీనర్ ఎస్కే రంజాన్ బి, సిపిఐ వేంసూరు కార్యదర్శి లాల్ మహమ్మద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యాగసిరి వెంకటేశ్వరరావు, అంజమ్మ హమీద్, బాలకృష్ణ, పుల్లమ్మ ,సైదాబీ, సరోజిని, వెంకటమ్మ, ఇజ్రాయిల్, రాంబాబు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రుల క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్** : ఖమ్మంజిల్లా గంగ పుత్ర (బెస్త) సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఆదివారం ఖమ్మం వైరా రోడ్డులోని కోణార్క్ హోటల్‌లో జిల్లా గంగ పుత్ర సం ఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారి కోసం ప్రత్యేకంగా ఫిష్ మార్కెట్లను ఏర్పాటు చేయడంతో పాటు వ్యాపారంలో లాభాలు పొందేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మత్స్య శాఖాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ వారికి ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం తరఫున సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కన్నం వైష్ణవి, సంఘం జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్న, కోశాధికారి పెద్దబోయిన సుధాకర్, యూత్ ప్రధాన కార్యదర్శి దేశబోయిన సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓంప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శి పాకాల ఉపేందర్, యూత్ అధ్యక్షులు అంబటి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

## కూచిపూడి మాస్టర్ కన్నుమూత



**ప్రజాపక్షం/భద్రాచలం** : గత 35 సం.లుగా భద్రాచలం ఏజెన్సీ కూచిపూడి నృత్యం మాస్టర్‌గా ఎందరినో తీర్చిదిద్దిన మాస్టర్ ఉప్పులూరి వరలక్ష్మి మృతి కన్నుమూశారు. కూచిపూడి కళాకారిణిగా మొదలైన ఆమె ప్రయాణం మాస్టర్ స్థాయికి ఎదిగి ఎందరినో శిష్యులుగా తీర్చిద్దిద్దారు. ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చిన ఆమె శిష్య బృంధం ఎన్నో బహుమతులు సాధించి పేరు గడించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కూచిపూడి నాట్య గురువులుగా ఉన్న వారు వరలక్ష్మి వద్ద శిష్యరికం చేసినవారే. అలాంటి గొప్ప కళాతపస్వి మృతి చెందడం పట్ల ఆమె శిష్యులతో పాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, నాట్యాభిమానులు సంతాపాన్ని తెలుపుతూ కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.

## హంసవాహనం ట్రయల్ రన్ సక్సెస్

**ప్రజాపక్షం/భద్రాచలం:** ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా గోదావరి తీరంలో సిద్ధమైన హంసవాహనం ట్రైల్ రన్ సక్సెస్ అయ్యింది. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న గోదావరి తీరంలో స్వామివారు వివహరిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా లాంచీని హంసవాహనంగా మార్చి తెప్పోత్సవం జరిపిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఆ హంస వాహనాన్ని దేవస్థానం ఇఒఎల్ రమాదేవితో పాటు ఆర్‌డిఒదామోదర్ రావు, ఇరిగేషన్, గ్రామపంచాయితీ అధికారులు ట్రైల్ రన్ వేశారు. నదిలో నీరు సరిపడా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద విద్యుత్ దీపాల కాంతులు నదీ తీరానికి అందాన్ని తెచ్చిపెట్టాయి. విద్యుత్ దీపాల కాంతులు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆ ప్రదేశంలో జరుగుతున్న విడిది. విహార పనులను పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ తెప్పోత్సవం, ముక్కోటి ఉత్తర ద్వార దర్శనానికి ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులు మెచ్చేలా సౌకర్యాలు, ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం, రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామ పంచాయితీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్** : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. ఆదివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా జరగలేదన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధంసలాపురం సర్వే నెం.408లో కొత్తగూడెంలో స్మశానవాటికకు గతంలో నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారని అక్కడ ఎటువంటి వసతులు లేవని ఆయన తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి స్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు చింతకాయల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 14వ డివిజన్ కార్యదర్శి ప్రతానపు రామనాథం, 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బుడిగె వెంకన్న, మత్స్య సొసైటీ అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, వెంకటేశ్వర్లు, రావుల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## తనికెళ్ల ఉన్నత పాఠశాలలో యోగా పోటీలు

**ప్రజాపక్షం/కొణిజర్ల** : తెలంగాణ యోగా ప్రచార సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో తనికెళ్ల ఉన్నత పాఠశాలలో రెండు జిల్లాల స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొణిజర్ల ఎంఈవో అబ్రహం ప్రారంభించారు. రెండు జిల్లాల నుంచి అనేక మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారిలో ఎనిమిది నుంచి 61 ఏళ్ల వయస్సు వారు ఉండడం గమనార్హం. ఈ పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు లేడిపోయిన గోపాలరావు, నిర్వాహకులు ఝాన్సీ, లక్ష్మి , శ్రీనివాస్, యోగా సమితి బాధ్యులు ప్రసాద్, ఎస్‌పాల్‌తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన సిపిఐ శ్రేణుల సంబురాలు

* కార్పొరేషన్ ఏర్పాటుపై వెల్లువెత్తిన ఆనందం
* బాణా సంచాకాల్పుల మధ్య చిందులు
* అభివృద్ధి కాముకుడు కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం:**కొత్తగూడెంపాల్వంచ జంట పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను కలుపుతుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్ ఏర్పాటు చేయడంపై కొత్తగూడెం నియోజకవర్గం ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం కార్పోరేషన్‌గా మార్పు చెందడంతో నగరాలకు ధీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది అకాశాలు మెరుగుపడే ఛాన్స్ ఏర్పడనున్నాయి. కార్పోరేషన్ ఏర్పాటుపై పట్టుపట్టి సాధించిన కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు అన్ని వర్గాల ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కార్పోరేషన్ ప్రకటన వెలువడటంతో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు జరిపి బాణా సంచాకాల్చి, మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ కార్పోరేషన్ ఏర్పాటు ఎంఎల్‌ఏ కూనంనేని కల అని, ఇందు కోసం ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలతో జరిపిన చర్చలు, సంప్రదింపులు సత్ఫలితాన్ని ఇచ్చాయని అన్నారు. కార్పోరేషన్ ఏర్పాటు కావడం వల్ల జంటపట్టణాలతో పాటు సుజాతనగర్ మైదాన ప్రాంత గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, ఎస్‌కె ఫహీం, మాచర్ల శ్రీనివాస్, పొలమూరి శ్రీను, దుర్గ, ధర్మరాజు, సత్యనారాయణ చారి, రామ్మూర్తి, యాకూబ్, బండి రమేష్, ఖయ్యూం, లక్ష్మీ , అజయ్, యాంగ్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగానియోజకవర్గ అభివృద్ధే కూనంనేని ఎజెండా అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్ ఏర్పాటు చేయడంపై సిపిఐ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. కార్పోరేషన్ ప్రకటన వెలువడటంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం పాల్వంచ పట్టణంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం కేంద్రంగా చేసుకుని కార్పోరేషన్ ఏర్పాటు చేయడం అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. పట్టుపట్టి మరీ కార్పోరేషన్ సాధించిన కూనంనేనికి అభినందనలు తెలిపారు. కార్పోరేషన్, విమానాశ్రయం కూనంనేని కల అని, ఏడాది కాలంగా పట్టుపట్టి ప్రభుత్వ పెద్దలను ఒప్పించి సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, వి పద్మజ, ప్రజా సంఘాల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, శేనగపు శ్రీనివాసరావు, ఇట్టి వెంకట్రావు, మన్నె వెంకన్న, ఎస్‌కె రహమాన్, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, జకరయ్య, కోటి నాగేశ్వరరావు, బివి సత్యనారాయణ, కరీం, కృష్ణ, ఆదినారాయణ, బిల్ల రంగయ్య, ఎస్‌కె లాల్‌పాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## మక్క పైనే రైతన్న ఆశలు

ధర తగ్గిన మిర్చి.... దిగుబడి రాని పత్తి

ఉమ్మడి జిల్లాలో పెరిగిన మొక్కజొన్న సాగు

**ప్రజాపక్షం/ఖమ్మం** : ఖరీఫ్‌లో రైతుల ఆశలన్నీ మొక్కజొన్న పంటపైనే ఉన్నాయి. అనువు తప్పిన వర్షాల కారణంగా వర్షాకాలం పంటల్లో వరి తప్ప మిగిలిన పంటలకు సంబంధించి రైతులు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా పత్తి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది తీవ్ర నష్టం వాటిల్లింది. అతివృష్టి కారణంగా పత్తి ఎదుగుదల లేకపోవడం, ఎదిగిన చేను సరైన కాపును ఇవ్వకపోవడంతో ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పత్తి తొలగించి రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మెట్ట భూముల్లో ప్రస్తుతం ఎటు చూసినా మొక్కజొన్న పంటే కనిపిస్తుంది. పది రోజుల పంట నుంచి తలవెన్ను వచ్చే దశ వరకు వివిధ దశల్లో మొక్కజొన్న పంటతో మెట్ట భూములు కళకళలాడుతున్నాయి. గడిచిన మూడేళ్లుగా మొక్కజొన్న సాగు రైతుకు కలిసి వస్తుంది. పెట్టుబడి తక్కువగా ఉండడం దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు మొక్కజొన్నపై దృష్టిసారించారు. గతేడాది క్వింటా రెండు వేలకు పైబడి ధర పలికింది. ఈఏడాది కూడా ధర ఎక్కువగానే ఉంటుందన్న ఆశతో రైతులు ఉన్నారు. మిర్చి తోటలు బాగానే ఉన్న ధర ఇబ్బంది కరంగా ఉంది.



గతేడాది ఇదే సీజన్‌లో రూ. 16వేల నుంచి రూ. 20 వేల క్వింటా మిర్చి ధర ఉండగా ఈ ఏడాది రూ. 12 వేల నుంచి రూ. 14వేలకు మించి పలకడం లేదు. గతంలో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన రైతుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. రూ. 20వేల పైచిలుకు ధర పలికినప్పుడు విక్రయించడానికి వెనకముందులాడి మరింత ధర పెరుగుతుందని ఆశపడ్డ రైతులకు ఇప్పుడు తీవ్ర నిరాశ ఎదురైంది. అప్పుడే విక్రయిస్తే బాగుండేదన్న భావన వ్యక్తమవుతుంది. కొంత మంది రైతులు ధర పెరిగితే అప్పులు తీరుతాయన్న ఆశతో నిల్వ చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. సన్న రకం ధాన్యం సాగు చేసిన రైతుల పరిస్థితి ఆశాజనకంగా ఉండగా లావు రకాలు సాగు చేసిన ధాన్యం రైతుల పరిస్థితి కూడా ఇబ్బందికరంగానే ఉంది. మొత్తంగా ఈ ఏడాది రైతుల పరిస్థితి కొంత మేర ఆశాజనకంగానే ఉన్నట్లు సమాచారం.

## కూనంనేని చిత్ర పటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ఖమ్మం** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కార్పోరేషన్‌గా ఏర్పాటు చేయించినందుకు కృతజ్ఞతగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చిత్ర పటానికి కొత్తగూడెంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 22వ వార్డు సిపిఐ నాయకులు యాకూబ్ పాషా మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవడం దిన దిన ప్రవర్ధమానమై ఓ పారిశ్రామిక పట్టణంగా, సింగరేణి కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను కలుపుతూ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయించడం కూనంనేని వల్లే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ 22వ వార్డు కార్యదర్శి ఎండి ఇర్ఫాన్‌అలీ, కో ఆప్షన్ సభ్యులు ఎండి యాకూబ్, షమీమ్, అజ్జు, అక్రంపాషా, అబ్దుల్ సలాం, మురాద్‌బాయ్, జహీర్, సబుదర్,పాల్గొన్నారు.



## ఆర్గానిక్ మేళాను ప్రారంభించిన మేయర్

**ప్రజాపక్షం/ఖమ్మం** : గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మేళాను ఆదివారం ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. నగర పాలక సంస్థ పరిధిలోని సమీకృత మార్కెట్‌లో ఆర్గానిక్ మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ ప్రతి నెల మొదటి ఆదివారం ఆర్గానిక్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సేంద్రియ పద్ధతిలో పండించినటువంటి ఆర్గానిక్ పంటల ఉత్పత్తులను స్టాల్స్‌లో ఉంచి విక్రయించడం జరుగుతుందన్నారు. విపరీతమైన రసాయనిక ఎరువుల వాడకం వల్ల వినియోగదారుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని మేయర్ తెలిపారు. నగర ప్రజల ఆరోగ్య దృష్ట్యా సేంద్రియ ఉత్పత్తులను విక్రయించేందుకు ఏర్పాటు చేశామని భవిష్యత్తులో వినియోగం పెరిగితే మరి కొన్ని స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు, రైతు బంధు మాజీ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, కె. మాధవి, నరేంద్రస్వరూప్, పున్నయ్య పాల్గొన్నారు.



## సంకల్ప సేవలు అభినందనీయం

10 ఐరన్ చిలేషన్ ఇంజక్షన్ మిషన్లు వితరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్** : తలసేమియా చిన్నారులకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఓలివ్ క్రిప్టో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గాదె బారవి తెలిపారు. తమ సంస్థ తరుపున తలసేమియా చిన్నారుల కోసం 10 ఐరన్ చిలేషన్ ఇంజక్షన్ మిషన్లను వితరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని రితన్య ఆసుపత్రిలో గల సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ తలసేమియా డేకేర్ సెంటర్‌ను గాదె బారవి సందర్శించారు. డేకేర్ సెంటర్‌లో తలసేమియా చిన్నారులతో కలిసి ముచ్చటించారు. చిన్నారులు రక్తం ఎక్కించుకున్న తర్వాత వారి శరీరంలో పెరిగే ఐరన్‌ను తొలగించేందుకు మందుల కన్న ఇంజక్షన్లను వినియోగించడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంకల్ప సంస్థ బాధ్యులు దాతల సహకారం కోసం సంప్రదిస్తున్నారు. గాదె బారవి తమ కంపెనీ తరుపున 10 మిషన్లు అందిస్తామని సంస్థ బాధ్యులకు హామీ ఇచ్చారు. సంకల్ప సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి రవిచంద్ర మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి చిన్నారులు రక్తం ఎక్కించుకోవడం ద్వారా రక్తంలో ఐరన్ శాతం పెరిగిపోతుందన్నారు. ఐరన్ శాతాన్ని తగ్గించేందుకు ఇంజక్షన్ ద్వారా మందును చిన్నారి శరీరంలోకి సుమారు ఎనిమిది గంటల పాటు ఎక్కించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఒక్కో మిషన్ విలువ రూ. 45 వేలు ఉంటుందని రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డి. నారాయణ మూర్తి, సంస్థ బాధ్యులు పి. పావని,పి. ఉదయ్‌భాస్కర్, గౌతమ్ పాల్గొన్నారు

## శాతవాహన రిజిస్ట్రార్‌గా జాస్తి రవికుమార్

**ప్రజాపక్షం/కొణిజర్ల** : కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం గోపవరం గ్రామానికి చెందిన జాస్తి రవి కుమార్ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ డైరెక్టర్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్టు గ్రాడ్యుయేట్స్ కాలేజేస్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కుమార్ ఈనెల నాలుగున శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. జాస్తి పురుషోత్తం, నాగరత్నం కుమారుడైన రవికుమార్ సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక, ఉన్నత విద్యను కొణిజర్లలో ఇంటర్, డిగ్రీని ఖమ్మంలో పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి యంకాం, యంబిఎ, పిహెచ్‌డి పూర్తి చేసి అదే యూనివర్సిటీలో కామర్స్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్‌గా పనిచేశారు. కేరళ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా దూర విద్య జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. 24 ఏళ్ల పాటు వివిధ హోదాలలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన రవి కుమార్ 40కు పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఏడు పుస్తకాలు రాశారు. పది అంతర్జాతీయ, 45 జాతీయ సెమినార్లలో వక్తగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన వద్ద అనేక మంది శిక్షణ పొందుతున్నారు. రవికుమార్ శాతవాహన వైస్ ఛాన్సలర్ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా రిజిస్ట్రార్ బాధ్యతను స్వీకరించారు. కుటుంబ విషయానికి వస్తే రవికుమార్ భార్య ఇందు గృహిణి కాగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రవికుమార్ రిజిస్ట్రార్‌గా నియమితులైన సందర్భంగా మిత్రులు రాయల నర్సింహారావు, కె. ఉమాశంకర్‌రావు, సూరంపల్లి రామారావు తదితరులు అభినందనలు తెలిపారు.

## తోట రామయ్య జీవితం ఆదర్శం...

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** కడవరకు కమ్యూనిస్టుగానే కొనసాగిన తోట రామయ్య జీవితం ఆదర్శనీయమైనదని, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భా గం హేమంత రావు అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని చిం తపల్లి గ్రామంలో ప్రథమ వర్ధంతి సంస్మరణ సభను నిర్వహించారు. ఇం దులో భాగంగా ఆయన కుమారులు ఏర్పాటు చేసిన రామయ్య విగ్రహాన్ని జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగం మాట్లాడుతూ...చింతపల్లిలో సిపిఐ పార్టీ బలోపేతానికి రామయ్య చేసిన కృషిని కొనయాడారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి అనే పేరు కన్నా కమ్యూనిస్టు నేత అనే గౌరవం ఎంతో గొప్పదన్నారు. అటువంటి గౌరవం పేదల పక్షాన పోరాడినప్పుడు, ప్రజలలో నుంచి దక్కుతుందన్నారు. అలాగే కమ్యూనిస్టుగా కొనసాగుతూ మృతి చెందిన తర్వాత ఎర్రజెండా కప్పుకునే ఘట్ట అజరామరమైన క్షణంగా పేర్కొన్నారు. నేటి యువత ప్రజా పోరాటాలకు నడుం బిగించడంతో పాటు రామయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, యడ్లపల్లి శంకరయ్య, పగీళ్ల వీరభద్రం, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, పాలేరునియోజకవర్గ నాయకులు వెంపటి సురేందర్, పాల్త్యీ శ్రీను, బానోత్ రామ్మూర్తి, గ్రామ నాయకులు చాపల శ్రీనివాసరావు, తోట రామయ్య కుమారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్

కూనంనేని కృషితో నెరవేరనున్న దశాబ్దాల కల

**ప్రజాపక్షం/ఖమ్మం** : ఉమ్మడి ఖమ్మంజిల్లా వాసుల చిరకాల వాంచ నెరవేరనున్నది. కొత్తగూడెం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ప్రాంతాభివృద్ధితో పాటు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. పలుమార్లు ప్రకటనలు వచ్చిన కార్యరూపం దాల్చలేదు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రెండవ దఫా శాసన సభ్యునిగా ఎన్నికైన తర్వాత విమానాశ్రయ నిర్మాణం, కార్పోరేషన్ ఏర్పాట్లపై దృష్టిసారించి రెండింటిలోనూ విజయం సాధించారు. కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్‌పోర్టుకు సంబంధించి సర్వే చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రూ. 38 లక్షల నిధులను విడుదల చేసింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ విమానాశ్రయ నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంచ అని నా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోరికను నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు.

## క్రీడలు ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయి

* సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**క్రీడలు ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా అన్నారు. ఆదివారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ఐక్యమత్యానికి దోహదపడతాయని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో ఉండి ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రభుత్వాలు యువతకి మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించాలని, మండల కేంద్రంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న మేనేజ్మెంట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, గుండే పిన్ని వెంకటేశ్వర్లు, యలంకి మధు, షేక్ చాంద్ పాషా, నిర్వాహకులు రాయల సిద్ధు, కల్లోజు నరేష్, వినోద్ సురేష్ పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టుకు పోతున్నాం... చందాలివ్వండి

### ఉమ్మడి జిల్లాలో వసూళ్ల దందా

**ప్రజాపక్షం/ఖమ్మం** : సుప్రీం కోర్టుకు పోతున్నాం చందాలు ఇవ్వండి అంటూ ఇప్పుడు ఖమ్మంజిల్లాలో కొన్ని ముఠాలు వసూళ్ల దందాకు పాల్పడుతున్నాయి. అధికారులు, అనాధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలను నకిలీ విలేకరులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు ఇండ్ల స్థలాలకు సంబంధించిన ఓ తీర్పును వెలువరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హౌజింగ్ సొసైటీలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను నిలిపివేయాలని తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు సంఘాలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే ప్రక్రియలో ఉండగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వసూళ్ల రాయుళ్లకు వరంలా మారింది. మా జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పున సవాల్ చేస్తూ జర్నలిస్టులం సుప్రీం కోర్టులో పిటిషన్ వేస్తున్నాం. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది కాబట్టి మీరు చందాలు ఇవ్వాలంటూ ఉమ్మడి జిల్లాలో రెండు మూడు ముఠాలు పైన పేర్కొన్న వివిధ వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఈ ముఠాల్లో ఏ ఒక్కరూ కూడా జర్నలిస్టులు కాదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఒక ప్రాంతంలో ఒక పత్రిక పేరు, మరో ప్రాంతంలో మరో పత్రిక పేరు లేదా ఛానల్ పేరును ఉపయోగిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. కొద్ది రోజుల క్రిందట ఓ సంక్షేమ వసతి గృహానికి వెళ్లి నేను ప్రజాపక్షం రిపోర్టర్‌ను మాది జిల్లా మహాసభ ఉంది రూ. 5వేలు ఇవ్వండి అంటూ వార్డెను డిమాండ్ చేశారు. ప్రజాపక్షం విలేకరి పరిచయం ఉండడంతో వెంటనే వసతి గృహ సిబ్బంది స్థానిక విలేకరికి సమాచారం ఇవ్వగా అతను పరారయ్యాడు. ఇది కేవలం ఒక ఘటన మాత్రమే. ఇటువంటి ఘటనలు కోకొల్లలు. వసతి గృహంలో సిసి పుటేజీని పరిశీలించగా ఆ వ్యక్తి మీడియాకు సంబంధం లేని వ్యక్తిగా నిర్ధారణ జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గడిచిన నెల రోజులుగా ఇదే రకమైన వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతకు ముందు మహాసభల పేరుతో వసూళ్లు చేస్తున్నారు. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో మహాసభ జరుగుతుందని ఒక్కో చోట ఒక్కో జర్నలిస్టు సంఘం పేరు చెబుతుండడం తద్వారా ఎంతో కొంత పిండుకోవడం అలవాటుగా మారింది. ప్రధాన పత్రికలు, ఛానెళ్ల పేరు చెప్పి ఫోన్‌లు చేయడం, బెదిరింపులకు పాల్పడడం గమనార్హం. రూ. 50వేల వరకు డిమాండ్ చేయడం కాదు కూడదంటే చివరకు వంద రూపాలైన ఇవ్వండి సరిపెట్టుకుంటాం అంటున్నారట. తొలుత బెదిరింపులు తర్వాత వంద రూపాయలకు కాళ్ల బేరానికి దిగడం చేస్తున్నారు. వీరిలో ఎవరు మీడియా వ్యక్తులు కాకపోవడమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. వ్యాపార వర్గాలు, అధికారులు లేదా ఇతరులు ఎవరు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం కూడా చర్చనీయాంశమవుతుంది. వచ్చిన వారు జర్నలిస్టులా కాదా సుప్రీం కోర్టుకు మా చందాలకు లింక్ ఏమిటన్న ఆలోచన చేయకుండా ఎంతో కొంత ఇచ్చిన వదిలించుకుందాం లేకుంటే... అన్న ఆలోచనలో ఉన్నారు తప్ప ఫిర్యాదు చేయడం లేదన్న చర్చ కూడా సాగుతుంది. ఒక రకంగా నకిలీలను వసూళ్ల రాయుళ్లను వ్యాపారులు, అధికారులు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. తమ దందాలు ఎక్కడ బయటపడతాయోనని జర్నలిస్టు అయితే ఏమిటి, కాకపోతే ఏమిటి ఎంతో కొంత ఇచ్చి వదిలించుకుందామన్న ధోరణిలో ఉన్నారు తప్ప మరో ఆలోచన చేయడం లేదు. మొత్తంగా ఈ వసూళ్ల దందాలో ఉన్న వ్యక్తులు చిన్నదో పెద్దదో లేదా కనీసం యూట్యూబ్ ఛానెల్స్‌లో కూడా పని చేసే వారు కాకపోవడం శోచనీయం. వీరి వసూళ్ల కారణంగా మొత్తం జర్నలిస్టు వ్యవస్థపైనే దూరాభిప్రాయం ఏర్పడుతుంది. ఎవరైతే విలేకరేగా అనే భావన కొందరిలో ఏర్పడుతుండడం శోచనీయం. కొన్నిజిల్లాల్లో నకిలీ రిపోర్టర్లకు సంబంధించి చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు వర్కింగ్ జర్నలిస్టులు ఫిర్యాదులు చేస్తున్నారు. మరి ఈ వసూళ్ల దందాను నిలువరించేది ఎలానో....

## మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు : ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మిషన్ భగీరథ కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని, వెంటనే జీతాలు చెల్లించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుభాష్‌నగర్ జిల్లా ఏఐటియూసి కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా పాలనలో కార్మికుల సమస్యలు బాగుపడతాయని అనుకుంటే కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవ కాంట్రాక్టు నుండి సబ్ కాంట్రాక్టుగా ఎవరెస్టు ద్వారా వేతనాలు ఇస్తున్నారని వీరు 18వేలు వేతనం వస్తే మిషన్ భగీరథ కార్మికులు కట్టింగులు చేస్తూ 9,500 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఈ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి జీతాలు చెల్లించాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కల్యాణ మండపంలో 1998'–99 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యకమానికి సిద్దార్థ సెకండరి పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులు బాదం రమేష్, మాలకొండయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్,సుప్రపసన్న, రమేష్, అహ్మది భేగం హాజరై మాట్లాడారు. మీలో ఎవరికైనా పిల్లలను చదివించే స్థోమత లేని వారికి మీవంతు సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సుమారు 40మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూతో ఆత్మస్థైర్యం : అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి :** కుంగ్‌ఫూ నేర్చుకోవడం ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందడంతో పాటు, ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఆదివారం ధర్మపురి పట్టణంలోని ఎస్.ఆర్.ఆర్ గార్డెన్‌లో డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ అకాడెమి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన 150 విద్యార్థులకు బెల్ట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ అకాడెమి ఫౌండర్ రాజమల్లు,ప్రెసిడెంట్ రాజేందర్, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, ఆర్గనైజర్ చంద్రయ్య, లింగంపల్లి రమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, ఉపాధ్యాక్షుడు వేముల రాజేష్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి , నాయకులు చిలుముల లక్ష్మ ణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోల్ మోడల్‌గా తెలంగాణ రాష్ట్రం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం మధురాగన్ చౌరస్తాలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ప్రతి ఎకరానికి రూ.12 వేలు ఇవ్వాలని, అలాగే భూమిలేని కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, ఒడ్నాల యగ్నేష్, తోట సంధ్య, బూరుగు గంగన్న, రోమాల రమేష్, కొల్లిపాక స్వామి, పడ్నాల రాజన్న, దోర్నాల శ్రీనివాసరెడ్డి, బట్టు లక్ష్మీ నారాయణ, కర్ర విద్యాసాగర్ రెడ్డి, సత్తు కనకయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జగిత్యాలలోని ఎమ్మెల్సీ నివాసంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ధర్మపురి లక్ష్మి నరసింహాస్వామి చిత్ర పటాన్ని అందించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం జీవన్ రెడ్డీతో 74 కేజీల కేక్ కట్ చేయించారు. జీవన్‌రెడ్డితో కలిసి లక్ష్మ ణ్ కుమార్‌ను కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో ఘనంగా సన్మానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి. పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, పాత్రికేయులు లక్ష్మి రెడ్డి, గుండేటి రాజు, రాజ్ కుమార్, మాజీ ఎంపిపి తాటిపర్తి కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, మూలస్థం లలిత,కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లాల రమేష్ రావు, గాజుల రాజేందర్, జగిత్యాల క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్,రేపల్లె హరికృష్ణ, గజంగి నందయ్యా, జున్ను రాజేందర్,, కార్యకర్తలు, అభిమానులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.60 కోట్లతో త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు

ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని నుండి ఓడేడు వరకు రూ.60 కోట్ల వ్యయంతో త్వరలోనే నాణ్యతతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం ముత్తారం మండలంలోని మైదా బండ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముత్తారం నుండి మంథని వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బి మంత్రి వెంకట్‌రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డిలను కోరగా నిధులు మంజూరు చేశారని, వారికి మంథని, ముత్తారం మండలాల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యతతో కూడిన రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామాల్లో రోడ్డు మధ్యన సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వనరుల సంబంధించి పది సంవత్సరాల పాటు ఈ రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్ ఇష్టారాజ్యాంగ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత హామీలను నిలబెట్టుకోవాలని ప్రయత్నంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలనే లక్ష్యంతో ముందుకు పోవడం జరుగుతుందని శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను అన్ని దశలవారీగా నెరవేరుస్తున్నామన్నారు. రైతులకు రుణమాఫీ ద్వారా చేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీ వారు పెట్టుబడి సహాయం ఇవ్వడంలేదని రైతులను ఆరు నెలలుగా కన్ఫ్యూజ్ చేస్తున్నారన్నారు. రైతు పెట్టుబడి సహాయానికి బిఆర్ఎస్ ప్రభుత్వం 10 వేల రూపాయలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తుందన్నారు. సాగులో ఉన్న భూమి రైతులందరికీ పెట్టుబడి సహాయం అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అందివ్వడం జరుగుతుందని మంత్రి తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, సిరికొండ బక్కారావు,దాసరి చంద్రమౌళిగౌడ్, కోలా విజయ్‌గౌడ్, గాదం శ్రీనివాస్, వాజిద్ పాషా, తీగల సత్యనారాయణరావు, కోటగిరి శ్రీనివాస్, అశోక్‌చారి, లక్కం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ట్రినిటీ'లో ప్రతిభా పరీక్షలు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం పురస్కరించుకుని కరీంనగర్, ఆదిలాబాద్‌లో పదవ తరగతి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు లెవెల్ 1 పరీక్షను వారి వారి పాఠశాలల్లో డిసెంబర్ 2 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించగా 14445 మంది రాశారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిసెంబర్ 22, డిసెంబర్ 29న లెవెల్ 2 పరీక్ష నిర్వహించగా 3389 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం ట్రైనీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ సీనియర్ లెక్చరర్ సిగ్మా శ్రీరాములు, కెమిస్ట్రీ లెక్చరర్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లి దండ్రులు,అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తమ కళాశాల ఫీజులో 20 నుంచి 100 శాతం రాయితీ ఇవ్వబడుతుందని వారు తెలిపారు.



## ప్రజాసంఘాల బలోపేతమే పార్టీ లక్ష్యం : చాడ





**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నేతలు ముందుకు కదలాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల సంయుక్త సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మొట్టమొదట ప్రజాసంఘాలను సిపిఐ ఏర్పాటు చేసిందన్నారు. అన్నిరంగాల కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పార్టీ అభ్యున్నతికి ప్రజాసంఘాల నిర్మాణం బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో అన్ని ప్రజాసంఘాల నిర్మాణం కోసం సభ్యత్వం, కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేశం, కిష్టపురం లక్ష్మ ణ్, అందే అశోక్, కనుకుంట్ల శంకర్, యేదల వనేష్, వెంకట్‌రెడ్డి, శివలింగు కృష్ణ, ఈరి భూమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్, సంగెం మధు, నరేష్, పొన్నపోయిన మమత, వేల్పుల ప్రసన్నకుమార్, బన్సిలాల్, కొమ్ము భాస్కర్ సుధాకర్, సంపత్, భిక్షపతి,ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### చాడ మద్దతు కోరిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లారెడ్డి

సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి జెగ్గు మల్లారెడ్డి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.

## అంబేద్కర్ ప్రతిఒక్కరికీ మార్గదర్శకుడు

ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** అంబేద్కర్ విగ్రహాలకు మాత్రమే పరిమితం కాదని, ప్రతిఒక్కరికీ మార్గదర్శకుడని,, ఆయన ఆశయాలను అన్ని వర్గాల ప్రజలు కొనసాగించాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అడవిపదిరలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ హాజరై రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావిగా పేరుగాంచిన అంబేద్కర్ గొప్ప మహనీయుడన్నారు. కుల వివక్షను ఎదురించి, అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి అందరికీ సమన్యాయం అందించాలనే అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరూ స్పూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతి సమాఖ్య నాయకురాలు విమలక్క, కెవిపియస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మ ణ్ మాదిగ, బహుజన గర్జన నాయకుడు గజ్జెల అశోక్, నాయకులు మూసం రమేష్, మల్లారపు అరుణ్‌కుమార్, గుజ్జుల రాజిరెడ్డి, మాద్గుల మల్లేశం, సురేష్ నాయక్, ఎడ్ల సాగర్, భాస్కర్, చాంద్‌పాషా, గునుకుల దేవేందర్‌రెడ్డి, భూత శ్రీనివాస్, బొంగు తిరుపతి, దొమ్మాటి నర్సయ్య, మల్లారపు ప్రశాంత్ పాల్గొన్నారు.

## జస్టిస్ వేణుగోపాల్‌ను కలిసిన దొగ్గలి శ్రీధర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పట్టణానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ ఇవి. వేణు గోపాల్‌ను బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్టిఐ రాష్ట్ర అధ్యక్షుడు దొగ్గలి శ్రీధర్, అద్దెంకి మహేందర్‌లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జస్టిస్ ఇవి. వేణు గోపాల్‌కు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



## చైనా మాంజా అమ్మినా, వినియోగించినా చర్యలు

ఎస్‌పి అఖిల్ మహాజన్



**ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా దారం విక్రయించినా, వినియోగించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో యువతీ, యువకులు గాలిపటాలు ఎగరవేయడానికి సిద్ధమవుతున్న వేళ గాలి పటాలు విక్రయదారులు చైనా దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటుఎగిరే పక్షులకు ప్రమాదకరమని పర్యావరణానికి విపత్తుగా కావడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. అలాగే ఎవరైనా చైనా మాంజా ఎగురవేసుకోవాలని కోరారు. అలాగే ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్న వినియోగిస్తున్న డయల్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్‌పి అఖిల్ మహజన్ ప్రజలను కోరారు.

## అన్నిరంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధి

పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఎల్లమ్మ చెరువు నాలుగు జిల్లాల సరిహద్దులో ఉన్నందున పర్యాటక కేంద్రగా అభివృద్ధి చేస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో రూ.3 కోట్లతో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనం, మార్కెట్‌యార్డులో కోటి రూపాయలతో నిర్మించిన గోదాంలను ఆదివారం పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. రూ.35కోట్లతో పట్టణంలో సిసి రోడ్లు, మురుగు నీటి కాల్వ నిర్మాణం, అరెపల్లెలో రూ.17 కోట్లతో బతుకమ్మఘాట్, చెరువు ఆధునికరణ చేస్తామన్నారు. పలు కుల సంఘాల కమ్యూనిటీ భవణాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఆధునికరణకు రూ.18కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున ప్రభుత్వం ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలుచేస్తున్నమన్నారు. గత పది ఏళ్లుగా రానటువంటి రేషన్‌కార్డులను ఈనెల 26నుంచి పంపిణీకి చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధారిత భూములకు ఏలాంటి షరతులు లేకుండా రైతుకు ఏటా రూ.12వేలు ఇస్తున్నామన్నారు. భూములు లేని రైతు కుటుంబాలకు, నిరుపేదలకు ఏటా 12 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అనంతరం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం 40శాతం డైట్ చార్జీలను పెంచామని. నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అకుల రజిత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఆర్‌డిఓ రామూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మరవీందర్‌తో పాటు కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అంటేనే కోతలు, ఎగవేతలు

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ అంటేనే కోతలు, ఎగవేతలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం నంగునూరు మండల యువజన విభాగం నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే మాటలు కోటలు దాటాయని, చేతల్లో ఎగవేతలు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలు బంద్ చేశారని ఆరోపించారు. బతుకమ్మ చీరలు, దళిత బంధు. బిసిబంధు, కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, వానకాలం రైతుబంద్, చెరువులో చేపపిల్లలను బంద్ చేసారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలను అటకెక్కించారన్నారు. మహాలక్ష్మి కింద మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయల ఊసే లేదని, తులం బంగారం మాట లేదని,, రుణమాఫీ సగం చేశారన్నారు. రైతుభరోసా కింద కొత్త రూల్స్ పెట్టారని మండిపడ్డారు. పదేళ్లలో పరుగులు పెట్టిన సిద్దిపేట అభివృద్ధి ఏడాదిలోనే ఎడారిగా మారిందని, సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కెసిఆర్ సర్కార్ మంజూరు చేసిన పనులు రద్దు చేయటం, పనులు ఆపటం, సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపు ఎందుకు అని ప్రశ్నించారు. శిల్పారామం, రంగనాయక్‌సాగర్ టూరిజం, ఆసుపత్రి రోడ్లు, ఇతర ఎన్నో పనులు అర్థాంతంగా ఆపారన్నారు. కొత్తవి ఇవ్వకపోగా పాతవి ఆపటం ఎంతవరకు సమంజసమన్నారు. ఏడాదిలో ఒక్క మంచిపనియైన చేశారా అని కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రద్దు చేసిన పనులపై మీ వైఖరి చెప్పాలన్నారు. నిధులు రాక, పనులు లేక. సిద్దిపేట అభివృద్ధి నోచుకోలేక ప్రజలపై ఎందకి కక్ష అన్నారు. సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరు మెదపరన్నారు. సిద్దిపేట ప్రజల కొరకు అభివృద్ధి జరిగే వరకు పోరాటం చేస్తానన్నారు. అభివృద్ధి కొనసాగించేవరకు, రద్దు చేసిన పనులు ప్రారంభమయ్యేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టానన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై ప్రజల్లో తీసుకెళ్లిన బాధ్యత యువతదే అన్నారు. యువత రాజకీయాల్లో ముందు వరుసలో ఉండాలన్నారు. సిద్దిపేటలో గతంలో జరిగిన అభివృద్ధి ప్రజల్లో తీసుకెళ్తో కాంగ్రెస్ సర్కార్ చేసిన అన్యాయం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయేది యవతనే. యువతకు సముచిత స్థానం ఇస్తామని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాలుపంచుకోవాలని సూచించారు. అనంతరం సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు నిర్వహించిన అయ్యప్ప పూజ, స్వాములతో కలసి సామూహిక బిక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, నాయకులు గుండు భూపేష్, సంపత్‌రెడ్డి, పాల సాయిరాం, మచ్చవేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా స్థలంలోనే బిఆర్ఎస్ భవన్

వేములవాడ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రభుత్వం ఇచ్చిన భూమి ఎంత, మీ బిఆర్ఎస్ భవన్ కట్టిన భూమి ఎంత అని కెటిఆర్‌ను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించా రు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం లో సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కెకె మహేందర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిరిసిల్ల బిఆర్ఎస్ భవన్ కూడా కబ్జాకు గురైందేనని ఆరోపించారు. కెటిఆర్ ఒక వైపు గంభీరంగా మాట్లాడుతూనే లో లోపల భయపడుతున్నారని బిఆర్ఎస్ భవన్ కబ్జాకు గురైందో లేదో మీ గుండెమీద చేతులు వేసుకుని చెప్పాలన్నారు. ఇప్పటికే కొంత మంది ప్రభుత్వ భూములను తిరిగి ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. మీరు ప్రైమ్ లోకేషన్‌లో ఎకరాకు రూ.2కోట్లు, 3 కోట్లు, 50లక్షలు పలికే భూములను కబ్జా చేసింది నిజం కాదా అన్నారు. జంగ్ భూములు, సిపాయి భూములు, పోరంబోకు, పంచరాయి, శిఖం, లావుణి పట్టా దేవాలయ, ప్రభుత్వ భూములను అక్రమ పట్టాలు చేసుకున్నారన్నారు. సుమారు 1000 ఎకరాలు భూమి కబ్జాకు గురైతే మా ప్రభుత్వం ఇప్పటికే పావలా భూమి స్వాధీనం చేసుకుందన్నారు. సిరిసిల్ల చుట్టుపక్కల ఇంత భూమి కబ్జా చేస్తే హైదరాబాద్ చుట్టుపక్కల ఇంకెంత భూమి కబ్జా చేశారో తేట తెల్లమవుతుందన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో ఈడి, ఐటీ నోటీస్ ఇస్తే మొట్ట మొదలు లాయర్‌ను మాట్లాడుకుంది నువ్వుకాదా అన్నారు. మీ హాయాంలో కాళేశ్వరం, సుందిల్ల, టెలిఫోన్ ట్యాపింగ్ వంటి అనేక స్కాములు చేశారని మండిపడ్డారు. గొర్లు, బర్లు, చేపలుప్రతి పథకంలో స్కాములే అన్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ చేసి సినీ తారలు, జడ్జిలు వేములవాడలో నా మాటలు కూడా విన్నారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతే మీకుందుకు భయం అన్నారు. కెటిఆర్ నేను అందరిపేర్లు రాసుకుంటున్నానని మాట్లాడుతున్నామని, నీతాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడాలని బదులిచ్చారు. మీలాగా మీ నాయకుల లాగా నాయకులు ఎక్కడ కబ్జాలు చేయలేదన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, సంగీతం శ్రీనివాస్, కాముని వనిత, ఆకునూరి బాలరాజు, టోని, చందు, నేరేళ్ల శ్రీకాంత్ గౌడ్, రాము, భాను తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం జరిగే ప్రజావాణి రద్దు



ప్రజాపక్షం/ ఖిలా వరంగల్: నేడు జిడబ్ల్యూఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దుచేస్తున్నట్లు జిడబ్ల్యూఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే తెలిపారు. ఈ విషయాన్ని గమనించి నగర ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి బల్దియా కార్యాలయానికి రాకూడదని కమిషనర్ కోరారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాపక్షం/దుగ్గొండి: విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం రేబల్లె గ్రామంలో సుగుణ శుక్రవారం మొక్కజొన్న చేనుకు నీరు పారిస్తూ ఇంటికి వచ్చే క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. విషయం తెలుసుకునన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

## రామప్ప టెంపుల్ 'సూపర్'

### ఇటలీ దేశస్తుడి కితాబు



ప్రజాపక్షం/వెంకటాపూర్ : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను ఇటలీ దేశానికి చెందిన అలెగ్జాండర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు నిర్వహించగా అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్‌లు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను గురించి టూరిజం గైడ్‌గో రంట్ల విజయకుమార్ వివరించారు. వారు మాట్లాడుతూ రామ ప్ప దేవాలయం సూపర్ అప్ప అని కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

## పార్టీ కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



ప్రజాపక్షం/రాయపర్తి: మండలంలోని ఎకె తండాకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మూడు చక్రు నాయక్ అనారోగ్యంతో హన్మకొండ లోని పినాకిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదివారం హాస్పిటల్ కి వెళ్లి చక్రు నాయక్, ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## డిప్యూటీ సిఎం కాన్వాయ్‌లో అపశృతి, డ్రైవర్‌కు గాయాలు



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కాన్వాయ్‌లో అపశృతి చోటుచేసుకుంది. జనగామ ఎస్ఐ చిన్న కేశవులు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆదివారం డిప్యూటీ సిఎం వరంగల్ పర్యటనకు వెళ్తుండగా పెంబర్తి తోరణం వద్ద రిసీవింగ్ చేసుకున్నారు. కాన్వాయ్ అతివేగంగా వెళ్తున్న క్రమంలో పెంబర్తి వద్ద అదుపుతప్పింది. దీంతో ఎస్ఐ చెన్నకేశవులుకు ప్రమాదం తప్పగా డ్రైవర్ సాగర్‌కు గాయాలు కావడంతో హాస్పిటల్‌కు తరలించారు. సిఐ దేవేందర్‌రెడ్డి సంఘటనను పరిశీలించడం జరిగింది.

## ఇందిరమ్మ ఇళ్లు.. పేదలకు వరం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ప్రజాపక్షం/దామెర: ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం దామెర మండల కేందరలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పేద ప్రజల సొంతింటి కలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నిలబెట్టుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి రాజేందర్, ఆర్‌డిఓ నారాయణ, మండల ప్రత్యేకాధికారి బాలరాజు, తహసీల్దారు జ్యోతివరలక్ష్మి , ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిఓ రంగాచారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిల్లా రమణారెడ్డి, సదిరం పోశాలు, దురిశెట్టి భిక్షపతి, అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోతుల రాయకొమురు, రతన్ తదితరులు పాల్గొన్నారు.

## పనికర గ్రామానికి ఏమైంది?

### వరుస చావులపై గ్రామస్తుల విస్మయం

ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర గ్రామంలోకి ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది గత నాలుగు సంవత్సరాల నుండి గ్రామంలో ఎవరైనా ఏదో ఒక కారణంతో చనిపోతే ఆ తర్వాత వరస పెట్టి పది రోజుల లోపల మరొకరు ఇలా చాలా మంది చనిపోతూ ఉంటారని గ్రామస్తులు చెప్పారు. 2025 జనవరి 1న బోళ్ల ఆగయ్య, అనే వృద్ధుడు చనిపోయాడు. నాలుగవ తారీకున చెరుకు సొంబయ్య, అనే వ్యక్తి చనిపోగా 5వ తారీఖున మూల ఉపేందర్ చనిపోయాడు. ఈ ముగ్గురికి ముందు ఒక చిన్నారి వికలాంగురాలు కూడా చనిపోయింది. అయితే గ్రామంలో ఇది ఆనవాయితీ అని ఈ ఆనవాయితికీ మళ్లీ ఎవరు చనిపోతారో అని భయం గుప్పిట్లో గ్రామ ప్రజలు ఉన్నారు. ఇది కాకతాళీయంగా అయినా ఏదో తెలియని ఆందోళనలో గ్రామస్తులు కొందరు ఉన్నారు.

## 'సంవిధాన్ బచావో' మీటింగ్‌కు బయల్దేరిన నాయకులు



ప్రజాపక్షం/జనగామ టౌన్: టిపిసిసి మైనార్టి వైస్ చైర్మన్ ఎండి జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో జరిగే సంవిధాన్ బచావో సమావేశానికి ఆదివారం బయల్దేరి వెళ్లడం జరిగింది. హైదరాబాద్‌లోని కులికుతుబ్ షా గ్రౌండ్‌లో జరుగు సమావేశానికి వారు వెళ్లడం జరిగింది. వెళ్లినవారిలో అషు, రఫీక్, అషన్, అదిల్, అహ్మద్, తదితరులున్నారు.

# విద్యార్థులకు పౌష్టిక ఆహారం

### గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి : వరంగల్‌లోని ఉరుస గుట్టలో ని మహాత్మ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తు న్న మెనూ ప్రకారం విద్యార్థుల కు పౌష్టిక ఆహారం అందిస్తున్నారా లేదని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సంభాషించారు. అనంతరం పదవతరగతి చదువుతున్న విద్యార్థినులకు పరీక్ష కిట్స్ పంపిణీ చేశారు. వంటశాల ఆహారపదార్థాలు, వంట దినుసులను నిలువచేసే విదానాన్ని, బియ్యం శుద్ధి చేసే యంత్రాన్ని పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ క్షణంలో నైన ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాల, వంటశాల, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హాస్టల్ నిర్వహకులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి పుష్పలత, జడ్‌పి సిఇఒ రాం రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/ఆత్మకూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లుకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లులేని ప్రతీ పేదవారికీ ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిదన్నారు. ఇప్పటివరకు పరకాల నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇల్లు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూమి కోల్పోయిన రైతులకు 863 ఇండ్లను మంజూరు చేసామని తెలిపారు. మోడల్ ఇంటి నమూనాను మండల కేంద్రానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఆత్మకూరు తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా 'ప్రజాపక్షం'

### హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్



ప్రజాపక్షం/ కమలాపూర్: ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం పనిచేసే విధంగా ప్రజాపక్షం పత్రిక పని చేస్తుందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్‌లో 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రణవ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రజా సంక్షేమానికి సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందించడమే కాకుండా ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వారి వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం కమలాపూర్ మండల రిపోర్టర్ కుమార్, హుజురాబాద్ నియోజకవర్గం లోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ తొలగింపులను నిరోధిస్తూ జిఒ విడుదల చేయాలి



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: అక్రమ తొలగింపులను నిరోధిస్తూ జిఒ విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గున్నాల రాజకుమారి అధ్యక్షతన జరిగిన పాఠశాల వంట కార్మికుల జిల్లా జనరల్ బాడీ సమావేశంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పాఠశాల వంట కార్మికులకు ప్రకటించిన రూ. 10వేల వేతనం, మెనూ చార్జీల పెంపు విషయం, వంట కార్మికులను అక్రమ తొలగింపులను నిరోధిస్తూ జిఒ విడుదల విషయంలో, సంవత్సర కాలంగా కోడిగుడ్ల బిల్లులు, అయిదు నెలలుగా వంట బిల్లులు పెండింగ్‌లో ఉన్న ఏ మాత్రం పట్టించుకోకుండా, కోడిగుడ్ల ధరలైతే కొండెక్కి కూర్చున్న సమయంలో మూడు రూపాయల నష్టంతో ఎలా అందించాలని అన్నారు. ఇప్పుడేమో వారానికి మూడు కోడిగుడ్లు, రోజు రెండు కూరలు అందించాలని హుకుం జారీ చేస్తే ఎలా సాధ్యమవుతుందన్నారు. సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని గ తంలో అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, అయినా పరిష్కరించడంలో ప్రభుత్వం అశ్రద్ధ చేస్తున్నందున ఎఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతున్నటుల తెలిపారు. ఈ సమావేశంలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం నుండి వంట కా ర్మికులు గున్నాల రాజకుమారి, సామల రమ, గడ్డం భారతి, భవాని, కురుసం రాజకుమారి, లలిత, స్వరూప, మనక్క, లావణ్య, రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్లపై మాట్లాడే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదు

### వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి : బిసిల రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక అర్హత బిఆర్ఎస్ పార్టీకి, ఎంఎల్సీ కవితకు లేదని వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. వరంగల్ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకలజనుల సమస్యల పరిష్కారానికి, సకలజనుల సమ్మెతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ పార్టీ అని చెప్పుకుంటున్న టిఆర్ఎస్ (బిఆర్ఎస్) కెసిఆర్ ముఖ్యమంత్రి పాలనలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని అందరు భావించారన్నారు. బిసి కులాలలోని ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాజకీయ, సామాజిక, న్యాయం జరుగుతుందని ఆశించడం వల్లనే అనేక వందల మంది ఆ ఉద్యమ నినాదాలు నమ్మి ప్రాణాలను తమ భవిష్యత్ తరాల కోసం తృణప్రాయంగా సమర్పించారన్నారు. అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన ప్రభుత్వం తన ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలలో కెజి టు పిజి ఉచిత విద్య, సూపర్ స్పెషాలిటీ వైద్యం, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇల్లు లేని పేదలకు రెండు గదుల ఇళ్లు ఇస్తామని ఇవన్నీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణలో కావలసిన ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయని, పరిపాలన దక్షత కలిగిన నాయకుడే అవసరమని అందుకే కేసిఆర్ దళితుడిని ముఖ్యమంత్రి అని చెప్పి ఆ తర్వాత తన మాటను విస్మరించారన్నారు. పేద, మధ్యతరగతి, కొద్ది గొప్పో ధనిక రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు, అడ్డా మీద కూలీలు, ఆటోవాలా , ఆటోమొబైల్ రంగంలో పనిచేసే కార్మికులు సమస్త కార్మిక వర్గం అంతా కూడా ఈ సమాజంలో సగానికి పైగా ఉన్న బిసి సమాజంలోని వారే గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బంది మురికి ఎత్తిపోయడం, రోడ్లు ఊడవడం, మున్సిపాలిటీలలో పనిచేసే పారిశుద్ధ కార్మికులు 99శాతం దళితులే, చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2016లో కెసిఆర్ చేసిన కుటుంబ సమగ్ర సర్వే ద్వారా ఈ బిసి, దళిత సమాజానికి న్యాయం జరుగుతుందని అందరు ఆశించారన్నారు. శాసనసభ్యులుగా, ఎమ్మెల్సీలుగా, ఎంపీలుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా కీలకమైన పదవులు అన్నింటిలోనూ వెలమ, కమ్మ, రెడ్డి, సామాజిక వర్గాలకే కెసిఆర్ పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42% స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని, లేకపోతే బీసీల ఉద్యమాన్ని నిర్మించి విస్తృతం చేస్తానని సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా ఇంద్ర పార్క్ లో ధర్నా చేస్తూ డిమాండ్ చేసింది బీసీ హక్కుల సాధన సమితి అన్నారు.

## ఘనపూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల



ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండలంలోని పలు గ్రామాల రైతులకు యాసంగి సాగు కోసం ఆదివారం నీటిని విడుదల చేయడం జరిగిందని ఉప్పుగల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని ఆదేశించడంతో వెంటనే స్పందించిన ఇరిగేషన్ అధికారులు కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఘనపురం రిజర్వాయర్ నుంచి వ్యవసాయ భూములకు నష్కల్ దంస ఫిదారు చానల్ నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. అనంతరం ఉప్పుగల్లు గ్రామ రైతుల పక్షాన కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కనకయ్య, కాంగ్రెస్ నాయకులు సత్తిరెడ్డి, రాజు, జైపాల్‌రెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు కృషి

### పాలిటెక్నిక్ లెక్చరర్స్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే దొంతి



ప్రజాపక్షం/ నర్సంపేట : నర్సంపేటకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మర్యాదపూర్వకంగా పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పాలిటెక్నిక్ కళాశాలను నర్సంపేటకు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ అసోసియేషన్ యొక్క చొరవను అభినందించి, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ లెక్చరర్ అసోసియేషన్ అధ్యక్షులు(పిఎల్ఎ)అజ్మీర శ్రీనివాస్, టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని రాజేందర్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్ గౌడ్, ఒబిసి జిల్లా ఉపాధ్యక్షులు సాంబయ్య, పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి జన్ను మురళీ పాల్గొన్నారు.

## చైనా మాంజా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైన ప్రభుత్వం నిషేధించినచైనా మాంజాలు విక్రయించిన వినియోగిమచిన వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్నతరుణంలో యువతి, యువకులు గాలిపటాలను ఎగరవేయడానికి సిద్ధమవుతున వేళ గాలి పటాల విక్రయదారులు చెనా మాంజాను విక్రయించడం జరుగుతొందని, నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటు ఎగిరే పక్షులకు ప్రమాదకరం కావడంతో పాటు పర్యవరణానికి విపత్తుగా కావడంతో జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఆదేశాలను మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ చెనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల అధ్వర్యంలో నిర్వహించిన తనీఖీల్లో సూమారు 2లక్షల 62వేల రూపాయల విలువైన చెనా మాంజాను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే కమిషనరేట్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో చెనా మాంజా విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకొవడం జరుగుతొందని, ప్రధానం ప్రజలు సైతం చెనా మాంజా వినియోగం పట్ల దూరంగా వుంటూ ఎవరేకి హాని కలగని సాధారణ దారంలో గాలిపటాలను ఎగురవేసుకోవాలని, అలాగే ఏవరైన చెనా మాంజా విక్రయిస్తున్న, వినియోగిస్తున్న డయల్ 100నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్‌కు విశేష స్పందన

### వేలాదిగా హాజరైన కార్పొరేట్ స్కూల్స్ స్టూడెంట్స్



ప్రజాపక్షం/హసన్ పర్తి : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీనివాస రామానుజన్ (ఎస్ ఆర్ ఎఫ్) ఒలంపియాడ్ ఎగ్జామ్ విశేష స్పందన లభించింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, మంచిర్యాల 7 జిల్లాలో ఎస్ ఆర్ ఎఫ్ ఒలంపియాడ్ లెవెల్ 2 ఎగ్జామ్స్ నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు సుమారు పదివేల మంది విద్యార్థులు హాజరై గణిత, సామాన్య ఒలంపియాడ్ పరీక్షలు రాశారు. హనుమకొండలోని భీమవరంలో గల ఎస్‌విఎస్ కాలేజ్ పరీక్ష కేంద్రం కు సుమారు 3000 మంది విద్యార్థులు హాజరై ఒలంపియాడ్ పరీక్ష రాశారు. సిటీలోని పలు కార్పొరేట్ స్కూల్ నుండి స్టూడెంట్స్ వేలాదిగా హాజరై ఉత్సాహంగా పోటీ పరీక్షలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎస్సార్ఎఫ్ ఒలంపియాడ్ పరీక్ష పోటీ పరీక్షల తరహాలో ఉంటూ భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు మార్గదర్శకంగా ఉంటుందని, ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్ పరీక్షల నిర్వహణ చాలా చక్కగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రతి ఏటా పోటీ పరీక్షల తరహాలో ఒలంపియాడ్ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, పేరాల రాజన్ బాబు, తోటరాజు, లింగాల దిలీప్, శశి, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/హసన్‌పర్తి: హన్మకొండలోని విశ్వబ్రాహ్మణ పరస్పర సహాయ పరపతి, పొదుపు సంఘం క్యాలెండర్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు సంఘ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఆర్థిక స్వాలంభనకు పొదుపు సంఘాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పరపతి సంఘం అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవాచారి, కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శి చిలుపూరి శ్రీధర్, నాయకులు మట్టెవాడ బ్రహ్మచారి, రాగి కరుణాకర్, సిద్దోజు సూర్యప్రకాష్, డాక్టర్ గురుబ్రహ్మం, పొనుగోటి సారంగపాణి, సిద్దో జు విద్యాసాగర్, కూరోజుదేవేందర్, ఆకోజు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కనీస అవసరాలు తీర్చలేని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగం

### గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగం ఉద్యోగుల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితిలో ఉండడం దారుణమని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేష్ ఆధ్వర్యంలో గత 27 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా గౌడ జన హక్కుల పోరాట సమితి పూర్తి మద్దతు ప్రకటించడం జరిగింది. అనంతరం విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్ గౌడ్, కల్లుగీత, వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్నగౌడ్, గౌడ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, నాయకులు పరమేశ్వర్‌గౌడ్, రవి, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి భట్టికి కాంగ్రెస్ నాయకుల స్వాగతం



ప్రజాపక్షం/హనుమకొండ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఆయన తొలుత హనుమకొండ జిల్లాలోని ఎన్ఐటికి రాగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని, టి పిసిసి నాయకులు ఈవి శ్రీనివాసరావు, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈవి శ్రీనివాసరావుబట్టికి పూలమొక్క బహూకరించారు.

షోకేస్

# ఆరోగ్యం

## నాఫిత్రోమైసిన్‌తో న్యుమోనియాకు చికిత్స




భారత్ ఇటీవల దేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీబయాటిక్ 'నాఫిత్రోమైసిన్'తో న్యుమోనియా కేసుల్లో మెరుగైన చికిత్సను అందించవచ్చని నిపుణులు అంటున్నారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఆర్ఎం)ను సమర్థంగా ఎదుర్కోవడంలో ఈ ఔషధం మెరరగైన ఫలితాలనిస్తుందని అంటున్నారు. న్యుమోనియా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంతటి ప్రమాకరమైన వ్యాధికి దేశీయంగా ఒక యాంటిబయాటిక్‌ను అభివృద్ధి చేయడం హర్షణీయం. న్యుమోనియా అనేది ఊపిరితిత్తులను ప్రభావితం చేసే వ్యాధి. ఊపిరితిత్తులలో అల్వియోలీ అని పిలిచే చిన్న గాలి సంచులు ఉంటాయి, మీరు ఊపిరి పీల్చుకున్నప్పుడు గాలితో నిండి ఉంటుంది. ఒక వ్యక్తికి న్యుమోనియా ఉన్నప్పుడు, అల్వియోలీలో చీము లేదా ద్రవంతో నిండి ఉంటుంది, ఇది శ్వాసను బాధాకరంగా చేస్తుంది. ఆక్సిజన్ తీసుకోవడం పరిమితం చేస్తుంది. న్యుమోనియా బ్యాక్టీరియా, వైరస్లు, శిలీంధ్రాలు లేదా మైకోప్లాస్మా వల్ల సంభవించవచ్చు. అత్యంత సాధారణ బ్యాక్టీరియా కారణం స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, అయితే సాధారణ వైరల్ కారణాలలో ఇన్‌ఫ్లుయెంజా, కొవిడ్ కూడా ఉన్నాయి. నాఫిత్రోమైసిన్‌ను కమ్యూనిటీఅక్వైర్డ్ బాక్టీరియల్ న్యుమోనియా (సిఎబిపి) చికిత్స కోసం సిద్ధం చేశారు. ఇది పిల్లలు, వృద్ధులు, మధుమేహం, కేన్సర్ రోగులు లేదా ఇతరత్రా కారణాల వల్ల రోగనిరోధక శక్తి తగ్గిన వారికి బాగా ఉపయోగపడుతుంది. ఈ తరగతిలో కొత్త యాంటీబయాటిక్‌లు గత 30 సంవత్సరాలుగా రాలేదు. దీనితో ప్రపంచ వ్యాప్తంగా నాఫిత్రోమైసిన్‌కు అధిక డిమాండ్ ఉంటుంది.

## మళ్లీ జీవం పోసుకున్న పోలియో!



ఎన్నడో కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న పోలియో మళ్లీ జీవం పోసుకుందా? మానవాళిని వెంటాడనుందా? ఈ ప్రశ్నలకు అవునని ఖచ్చితమైన సమాధానం ఇవ్వలేకపోయినా, కాదని చెప్పే అవకాశం మాత్రం లేదు. ఇటీవల కాలంలో పెరుగుతున్న పోలియో కేసులు వైద్య నిపుణులను, పరిశోధకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సైతం తన తాజా నివేదికలో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. పాకిస్తాన్, కామెరూన్, యూరోపియన్ యూనియన్‌లోని వివిధ దేశాల్లో పోలియోవైరస్ ఉనికిని గుర్తించినట్టు ప్రకటించింది. ఇలావుంటే, నోరు లేదా మల మార్గాల ద్వారా మాత్రమే పోలియో వైరస్ మనిషి శరీరంలోకి చేరేదని నిన్నమొన్నటి వరకూ విశ్వసిస్తూ వచ్చారు. అయితే, శ్వాసకోశ మార్గం ద్వారా కూడా పోలియోవైరస్ శరీరంలోకి చేరుతుందని తాజా అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఈ క్రమంలోనే పోలియో పునరుజ్జీవన సమస్యను డబ్ల్యుహెచ్ఒ ప్రస్తావించింది. ఈ పోలియో వైరస్‌ను గత ఏడాది గుర్తించారు. పాకిస్తాన్‌లో అత్యధికంగా 62 వైల్డ్ పోలియోవైరస్ టైప్ 1 (డబ్ల్యుపివి1) కేసులు నమోదయ్యాయి. బార్సిలోనా (స్పెయిన్), వార్సా (పోలాండ్), కొలోన్ (జర్మనీ) వంటి నగరాల్లోనూ పోలియో వైరస్ నమూనాలను బయటపడ్డాయి. ఇంకా వైరస్‌ను గుర్తించని... టీకాలు వేయని ప్రాంతాలు చాలా ఉన్నాయని, అక్కడ యుద్ధ ప్రాతిపదిక చర్యలు అవసరమని డబ్ల్యుహెచ్ఒ నివేదిక పేర్కొంది. చాలా దేశాల్లో పౌష్టికాహారం లభించడం లేదన్నది నిజం. ఫలితంగా, ప్రజల్లో రోగనిరోధకత తక్కువగా ఉంటున్నది. పోలియోతోసహా రకరకాల వైరస్‌లు శరీరంలోకి చేరడానికి, ప్రాణాంతకంగా పరిణమించడానికి ఇది కూడా ఒక కారణం. యుద్ధంలో మునిగి తేలుతున్న ప్రాంతాల్లోనూ ఇదే సమస్య తెరపైకి వస్తున్నది. ఉదాహరణకు నిత్యం యుద్ధం లేదా అంతర్యుద్ధాలు జరిగే సూడాన్‌లో ఒకప్పుడు 85 శాతంగా ఉన్న వ్యాక్సినేషన్ ఇప్పుడు 30 శాతానికి పడిపోయింది. ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఒపివి) లేదా వ్యాక్సిన్ ఉత్పన్నమైన పోలియోవైరస్ కేసులు (సివిడిపివి) వ్యాప్తి చెందడంతో, పోలియో నిర్మూలన కష్టసాధ్యమవుతున్నది. ఇటీవలి పరిశోధనలు 'ఇన్‌యాక్టివేటెడ్ పోలియోవైరస్ వ్యాక్సిన్' (ఐపిఒ) అవసరాన్ని గుర్తుచేస్తున్నది. పోలియో చుక్కలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది ఈ పరిశోధన సారాంశం. పోలియో చుక్కలతో పోలిస్తే ఐపిఒ కొంత ఖరీదైనప్పటికీ, సమస్య నివారణకు వ్యయప్రయాసలు భరించక తప్పదు. డబ్బు కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యం.

## పోటీ కోసం జీకె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- అంతర్జాతీయ యోగ దినోత్సవం?
  జూన్ 21
- వర్సయిల్స్ సంధి ఎప్పుడు జరిగింది?
  1919
- దక్షిణ భారతదేశంలో జైనుల ప్రధాన కేంద్రం ఎక్కడ ఉంది?
  శ్రావణ బెళగొల
- BRICS బ్యాంక్ తొలి ఛైర్మన్ ?
  కె.వి. కామత్
- భారతీయులను స్వాతంత్రోద్యమము వైపు నడిపించినది ఏది?
  ఆంగ్ల విద్య
- ఆఫ్రికా ఖండంలో ప్రవహిస్తున్న నది:
  నైలునది
- ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఉష్ణమండల ఎడారి:
  సహారా
- శ్రమకు ప్రతిఫలం
  వేతనం
- గోదావరి నది యొక్క ఉపనది
  మంజీరా
- ఆంగ్లేయ విప్లవం ఏ సంవత్సరంలో సంభవించింది?
  1688
- ఆధునిక రాజ్యం అనేది ఒక ............?
  సంక్షేమ రాజ్యం
- మొదటి జైనమత కౌన్సిల్ ఎక్కడ జరిగింది?
  పాటలీపుత్రం
- ఇంగ్లాండ్లో మొదటి చార్లెస్ ను ఉరితీసిన సంవత్సరం?
  1649
- ప్రజాస్వామ్యానికి చక్కటి నిర్వచనాన్ని ఇచ్చినది:
  అబ్రహాం లింకన్
- వాయు వాయిద్యము
  ఫ్లూటు
- ఉష్ణశక్తిని యాంత్రిక శక్తిగా మార్చునది:
  ఆవిరియంత్రం
- కిందివాటిలో అత్యంత పొడవైన రైల్వే ప్లాట్ ఫామ్ ఎక్కడ ఉంది?
  ఖరగ్పూర్
- వర్ధమానుడు ఎక్కడ జన్మించాడు?
  కుంద గ్రామం
- భారతీయులకు ఉన్నతోద్యోగాలను ఇచ్చుటకు నిరాకరించినది?
  కారన్ వాలీస్
- ఓడలు నీటిపై తేలియాడటానికి కారణం ఏమిటి?
  ఉత్ప్లవన సూత్రం
- దక్షిణ భారతదేశ నదులలో పెద్దది
  గోదావరి
- థర్మామీటర్ వాడు ద్రవం?
  పాదరసం
- హైదరాబాద్ ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
  600
- జైన తీర్థంకరులందరూ ఏ వంశానికి చెందిన వారు?
  క్షత్రియ
- రైలు మార్గాలు మనదేశంలో ప్రవేశపెట్టబడిన సంవత్సరం?
  1853
- జైనుల 22వ తీర్థంకరుడు ఎవరు?
  అరిష్టనేమి

## ఎన్ఎఎఫ్ఎల్‌డి పేరు మారింది..



నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఎఎఫ్ఎల్‌డి) పదం మారింది. ఇకపై దానిని మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఎఎస్ఎల్‌డి)గా పిలవాలి. ఆల్కహాల్ లేకపోవడం కంటే, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్‌ను ఈ వ్యా ధికి ప్రాథమిక కారణంగా వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకే, ఈ వ్యాధి పేరును మార్చారు. ఆల్కహాల్ వాడకంతో ముడిపడి ఉన్న కళంకాన్ని తొలగించడంలో ఈ మార్పు సహాయపడుతుంది. అంతర్లీన జీవక్రియ సమస్యలు, అసాధారణ కొలెస్ట్రాల్ వంటి అంశాలపై దృష్టి పెట్టడానికి అవకాశం కల్పిస్తుంది. కాలేయంలో లేదా లివర్ దెబ్బతినడానికి, కొవ్వు పేరుకుపోవడానికి ఆల్కహాల్ వినియోగమే ప్రధాన కారణమన్నది చాలా మందికి ఉన్న అపోహ. ఎందుకంటే, ఆల్కహాల్‌తో సంబంధం లేకుండానే కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. అందుకే దీనిని ఎన్ఎఎఫ్ఎల్‌డిగా పేర్కొంటున్నారు. ఈ వ్యాధిని రెండు రకాలుగా విభజించారు. మొదటిది నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ (ఎన్ఎఎఫ్ఎల్)కాగా, రెండోది నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ (ఎన్ఎఎస్‌హెచ్). కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, మంట వంటి లక్షణాలను ఎన్ఎఎఫ్ఎల్‌గా పిలుస్తారు. ఇది సాధారణంగా కాలేయ సమస్యలకు దారితీయదు. కానీ, కాలేయం పెరుగుదలకు కారణమవుతుంది. అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో కాలేయంలో కొవ్వు పేరుకుపోవడమేగాక, వాపు కూడా కనిపిస్తుంది. దీనిని ఎన్ఎఎస్‌హెచ్‌గా పేర్కొంటారు. దీని వల్ల కాలేయం దెబ్బతింటుంది. ఫైబ్రోసిస్ (కాలేయం మచ్చ కణజాలం ఎక్కువగా అభివృద్ధి చెందే పరిస్థితి), సిర్రోసిస్, కాలేయ కేన్సర్ వంటి ప్రమాదాలు సృష్టిస్తుంది. ఎన్ఎఎఫ్ఎల్‌డి సోకిందని చెప్పడానికి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అయితే, ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్ (జీవక్రియ అసాధారణతల సమూహం), టైప్ 2 మధుమేహం వంటి పరిస్థితులు దాని ప్రమాదాన్నిపెంచుతా యి. వివిధ రకాలైన శారీరక పరీక్షలు జరిపి ఎన్ఎఎఫ్ఎల్, ఎన్ఎఎస్‌హెచ్ మధ్య తేడాను గుర్తించవచ్చు. ఇమేజింగ్, కాలేయ బయాప్సీ వంటి పరీక్షల ద్వారా కూడా రోగ నిర్ధారణ సాధ్యమవుతుంది. ఎన్ఎఎఫ్ఎల్‌డి సమస్య నుంచి బయటపడాలంటే బరువు తగ్గడం అత్యవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యా యామం వంటిని ఎన్ఎఎఫ్ఎల్‌డిని నియంత్రించడానికి, నిరోధించడానికి ఉపయోగపడతాయి. ఆహారంలో మార్పులు, బరువు తగ్గడం తప్పనిసరి అని వైద్యులు సైతం స్పష్టం చేస్తున్నారు.

## వైద్య రంగంలో సరికొత్త ఆవిష్కరణ



మన దేశం వైద్య రంగంలో మెరుగైన ఫలితాలను సాధిస్తున్నది. అందుకు ఉదాహరణగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) బాంబే పరిశోధకు లు అభివృద్ధి చేసిన షాక్వేవ్ ఆధారిత, సూ ది రహిత సిరంజిని పేర్కోవాలి. ఇది నొప్పిలేకుండా శరీరంలోకి ఔషధాన్ని చేర్చడానికి ఉప యో గపడుతుంది. సూది ఉండదు కాబట్టి, చర్మం దెబ్బతినే అవకాశం ఉండదు. అంతేగాక, ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని కూడా ఈ విధానం తగ్గిస్తుంది. షాక్‌వేవ్ అనేది గాలి, నీరు లేదా ఘనపదార్థాల వంటి మాధ్యమం ద్వారా ధ్వని కంటే వేగంగా కదిలే పీడన తరంగం. ఒక వస్తు వు లేదా శక్తి వేగ వంతమైన పీడన మా ర్పుకు కారణమైనప్పుడు, చుట్టుపక్కల వాతావరణంలో ప్రయాణిస్తున్నప్పుడు ఈ షాక్ వేవ్ ఏర్పడుతుంది. షాక్ సిరంజిని మైక్రో షాక్ ట్యూమ్‌తో రూపొందించారు. ఇది ద్రవ ఔషధ మైక్రోజెట్‌ను రూపొందించడానికి కంప్రెస్ లేదా ఒత్తిడి చేసిన నైట్రోజన్ వాయువును ఉపయోగిస్తుంది. ఇది చర్మంలోకి చొచ్చుకుపోయేలా ధ్వని కంటే వేగంగా ప్రయాణిస్తుంది. సాధారణ సూదులతో పోలిస్తే లోతైన కణజాలం చొచ్చుకుపోతుంది. షాక్ సిరం జి మిషన్ ఇంద్రధనుష్ (ఎంఐ) వంటి ఇమ్యునైజేషన్ డ్రైవ్‌లను వేగవంతం చేస్తుంది. సూదివల్ల ఏర్పడే గాయాల ద్వారా రక్తంలో సంక్రమించే వ్యాధి ప్రమాదాలను తగ్గిస్తుంది. అయితే, ఈ ప్రక్రియ ఎంతో ఖర్చుతో కూడుకున్నది.దీనిధరతగ్గితే,త్వరలోనే అందరికీ అందుబాటులో ఉంటుంది.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**


## పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు

### 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/ధర్మపురి:** ప్రజా సమస్యలను వెలికితీస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలకు దిక్సూచిలా వ్యవహరిస్తున్న పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యంగా విలువలతో కూడిన చక్కటి కథనాలు అందిస్తూ 'ప్రజాపక్షం' దినపత్రిక అక్షరం అక్షరం ప్రజల పక్షమై నిలుస్తున్నదని ఆయన అభినందించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎన్నం కిషన్ రెడ్డి, ధర్మపురి నియోజకవర్గ పాత్రికేయులు స్థంభంకాడి అశోక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యాక్షులు ఎస్. దినేష్, వేముల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను నిగ్గుతేల్చేదే 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట :** ప్రజలకు ప్రభుత్వానికి మధ్యవారధిగా ప్రజాపక్షం పని చేస్తుందని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహా విష్కరణ సందర్భంగా వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల రిపోర్టర్లు శాడ చంద్రశేఖర్, కొండ్లెపు జగదీశ్వర్ అధ్వర్యంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్లా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షులు బూత శ్రీనివాస్, బీఆర్ఎస్ మం డల అధ్యక్షులు గుజ్జులరాజిరెడ్డి, ఎడ్ల సాగర్,మాడుగుల మల్లేశం. మాజీ జెడ్‌పిటిసి కళావతిసురేష్ నాయక్, వీర్నపల్లి మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల నిరసన

**ప్రజాపక్షం/రామాయంపేట:** గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించడంలేదంటూ బిక్షాటన చేస్తూ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈసంఘటన ఆదివారం మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. కార్మికుల కథనం ప్రకారం చాలీచాలని వేతనాలతో గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్నా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## కార్మికవర్గ హక్కులకోసం సిపిఐ కృషి

### 22న మంచిర్యాలలో సదస్సు
### రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** భారత కమ్యూనిష్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి వంద ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా మంచిర్యాలలో 22వ తేదీన అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ, మండల కార్యదర్శిల సమావేశం చాడా మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానిక ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేనశంకర్ హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా దేశమంత శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగా 22న మంచిర్యాల జిల్లాలో సిపిఐ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద ప్రజల, కార్మిక వర్గ హక్కుల కోసం నిరంతరం కృషి చేసింది సిపిఐ అని, కార్మిక, కర్షక, ప్రజల హక్కుల కొరకు పోరాటలు, ప్రాణత్యాగాలు చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ అని గుర్తు చేశారు. ఎర్ర జెండ పోరాటాల ఫలితంగా ఈ దేశంలో కార్మికులకు హక్కులు ఏర్పడ్డాయని, స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టు పార్టీ క్రియాశీలకంగా పాల్గొని బాసటగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం పూర్ణిమ, మేకల దాస్, జోగుల మల్లయ్య, కారుకూరి నగేష్, ఖలీందర్ ఆలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శులు, బొంతల లక్ష్మీనారాయణ, సాలిగామ సంతోష్, నెన్నెల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వివక్ష విడనాడాలి

### ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్** పేదల విద్య పట్ల ప్రభు త్వం వివక్షత విడనాడాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. కెజిబివి పాఠశాలల్లో విద్యను బోధించే ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తుండడంతో ఆయా పాఠశాలల్లో విద్య కుంటుపడిందన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ కెజిబివి పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు 22 రోజులుగా సమ్మె చేస్తున్న వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడిందన్నారు. కెజిబివి పాఠశాలలో చదివే విద్యార్థులు పేద, మధ్య తరగతి విద్యార్థులని వారి విద్య పట్ల ప్రభుత్వం వివక్షత ప్రదర్శిస్తుందన్నారు.తక్షణమే ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహయ కార్యదర్శి శివనాయక్, వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, రవి, గణేష్, సాయి, నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.




## సమసమాజ స్థాపన మార్క్సిజానికే సాధ్యం

### మార్క్సిస్టు అధ్యయన వేత్త నేదునూరి రాజమౌళి

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** భారతదేశంలో పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం నాయకత్వాన జరిగే విప్లవ పోరాటం విజయవంతమై పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సమ సమాజాన్ని సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం మార్క్సిజంనికే సాధ్యమని మార్క్సిస్టు అధ్యయన వేత్త నేదునూరి రాజమౌళి తెలిపారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన సిపిఐ రాజకీయ అధ్యయన తరగతులు నిర్వహించగా ఈ శిక్షణా తరగతులకు నేదునూరి రాజమౌళి బోధకుడిగా హాజరై మార్క్సిజం విశిష్టతపై మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం రైతాంగ మద్దతుతో పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీకి గురికాబడే చిన్న, మధ్య తరగతి, వ్యాపార ఉద్యోగ వర్గాల మద్దతుతో కార్మిక వర్గ రాజ్యం నెలకొల్పడం అనివార్యమన్నారు. మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణమై ప్రజలలో మూఢనమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ సోషలిజం ఆలోచనలను పెంచాలని ఉద్బోధించారు. ప్రపంచాన్ని మార్చిన మహత్తర సిద్ధాంతం మార్క్సిజమని పేర్కొన్నారు.శ్రమ దోపిడీ పీడన వివక్షత రాజ్య హింస అంతమయ్యే వరకు వర్గ పోరాటా లు వర్ధిల్లుతాయన్నారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, కర్రె లక్ష్మణ్, ఏఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, బత్తిని సదానందం, మాలోత్ శంకర్, రాస మల్ల దీన, వెంకట్రాజం, సుదర్శన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జిఒను తక్షణమే అమలు చేయాలని హమాలీ కార్మికుల నిరసన




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్లను పెంచిన జిఒను తక్షణమే అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హమాలీ కార్మికులు రామన్నపేటలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సివిల్ సప్లయ్ కమిషనర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పెంచిన కూలీ రేట్ల జీవోను విడుదల చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. నేడు కలెక్టరేట్ కార్యాలయ ముట్టడిలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్‌గౌడ్, ఎఐటియుసిమండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల సత్తయ్య, శివరాత్రి సమ్మయ్య, హామాలీ నాయకులు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు గౌరిగె నరసింహా, గౌరిగె శంకరయ్య, బండ స్వామి, అంజయ్య, నగేష్, రవి, ఉపేందర్, బాలరాజు, మహేష్, పెంటయ్య, అచ్చాలు, అనిల్, శ్రీను, లింగస్వామి, నర్సింహా, స్వీపర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ నర్సంపేట :** సివిల్ సప్లయి హమాలీ రేట్ల జిఒను తక్షణమే విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్ డిమాండ్ చేశారు. నర్సంపేట మండల కేంద్రంలో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద సివిల్ సప్లై హమాలి కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం నాటికి ఐదవ రోజుకు చేరింది. ఈసందర్భంగా సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆహార పంపిణీ పథకం క్రింద అనేక రకమైన నిత్యావసర సరుకులను ప్రజల అందిస్తూ తమ రక్తాన్ని చెమటగా మార్చి ఈ దేశానికి, రాష్ట్రానికి సంపదను అందిస్తుంటే సివిల్ సప్లై హమాలీ కార్మికులను చులకనగా చూస్తుందన్నారు. తక్షణమే అక్టోబర్ లో యూనియన్, సివిల్ సప్లై అధికారులు మధ్య జరిగిన ఒప్పంద జిఒను వెంటనే విడుదల చేసి, హామాలి కార్మికులకు తగు న్యాయం చేయాలని లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడికి వెనుకాడబోమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు (సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సివిల్ సప్లై హమాలి కార్మికుల కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి హమాలి కార్మికులు కొత్తగట్టు నర్సింహం, బక్కెర కిషోర్, తుప్పతి కుమారస్వామి, గొర్రె కుమారస్వామి, మిట్టపల్లి సురేందర్, రాయరాకుల సతీష్, కొలువుల సాంబయ్య, తుప్పతి రమేష్, ఎల్లబోయిన శ్రీను, సిలువేరు బాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** నేడు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు సివిల్ సప్లై హమాలి యూనియన్ వరంగల్ జిల్లా అధ్య క్షులు జలగం బిక్షపతి అన్నారు. ఆదివారం వర్ధన్నపేట సివిల్ సప్లై గోదాం ఆధ్వర్యంలో నిర్వాదిక సమ్మె ప్రారంభించి నేటికీ ఐదవ రోజుకు చేరుకుందన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించబోతున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎఐటియుసి, హమాలీ యూనియన్ సభ్యులు ధర్నా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హమాలీల న్యాయమైన డిమాడ్లను, జిఒ వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి శ్రీనివాస్ జలగం రవి, వర్ధన్నపేట హమాలి యూనియన్ అధ్యక్షులు జలగం మోహన్ బాబు, సభ్యులు జలగం సామెల్ భుజాంగం యు.శీను, బి.ప్రకాష్,ఐ.రాజు, జి.వెంకన్న, ఏ.వేణు, పి.బాబు, జి.వెంకన్న, జలగం సుమన్, కే.సంపత్, కే.శ్రీకాంత్, సుమన్, కె.వెంకటేష్, రవి, చిన్న కుమార్, తిరుపతి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణకు కరాటే దోహదం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆత్మరక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బేబిమూన్ పాఠశాలలో సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ దూ అకాడమి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పూల్ బెల్టులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరాటే ఎంతో పేరొందిదని జిల్లా కేంద్రంలో ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో అమ్మాయిలు ధైర్యంగా బయటికి వెళ్లాలంటే వారికి ఆత్మరక్షణ కోసం కరాటే తప్పనిసరి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, నాయకులు నూకల సుదర్శన్ రెడ్డి, అబుద్ల్ రహీం, కరాటే మాస్టర్ జెవి రమణ, ఆర్ సంతోష్, సూర్య పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ మహిళ సావిత్రిబాయి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** దేశం గర్వించదగ్గ మహిళా సావిత్రిబాయి పూలే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ గార్డెన్ ఫంక్షన్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 2025 ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన వారికి అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా ఆమె జీవితం అందరికి ఆదర్శనీయమన్నారు. మహిళల చైతన్యంతోనే సమాజంలో పూర్తి స్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సావిత్రిబాయి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మహిళలను విద్యావంతులను చేయాలన్న మహాత్మ జ్యోతిరావుపూలే గొప్ప ఆలోచనతో ముందుగా తన సతీమణినే చదివించి ఉపాధ్యాయురాలిని చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టిఎంఎస్‌టిఎ నాయకులు, మహిళ ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** గిరిజన ఉద్యోగుల సమల్యల పరిష్కారం కోసం ప్రతి ఉద్యోగి ఐక్యంగా ఉద్యమించాలని టిబిఈఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసిరాం రాథోడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు ధారాసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న అడ్వకసి పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. బంజార ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 14ను తీజ్ పండుగ, సీతల భవాని పండుగలకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతి బంజార ఉద్యోగి కింది స్థాయి నుండి పై స్థాయి వరకు టిబిఈఎస్ఎస్ సంఘం నిర్మామంలో భాగస్వామం కావాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు అర్జున్ చౌహాన్, హీరాలాల్ చౌహాన్, అజయ్ నాయక్, జిల్లా కోశాధికారి హుస్సేన్ నాయక్, పాండు నాయక్, రాంసింగ్, డివిజన్ అధ్యక్షులు వాంకుడోతు వెంకన్న నాయక్, సైదా నాయక్, రఘుపతి, రవీందర్, కిషన్ సింగ్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** సువెన్ ఫార్మ కంపెనీ ఆధ్వర్యంలో ప్రతి నెల ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కంపెనీ హెడ్ ఎం రమేష్ బాబు అన్నారు. ఆదివారం కంపెనీ సమీపంలోని భరోసా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీతో పాటు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీలాబాయి లింగా నాయక్, సిఎస్ఆర్ ఇంచార్జీ పిఎస్ఎన్ మూర్తి, కం పెనీ ప్రతినిధులు వెంకటరమణ, పిజెరెడ్డి, పివి రమణ, ఎంవి రమణ, సైదు లు, విజయచక్రునాయక్, జీవన్, శంకర్, శివరాం నాయక్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు చేయూత అభినందనీయం

### టిపిసిసి అధ్యక్షుడు ముఖేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం /హాలియా:** దివ్యాంగులకు తన వ్యక్తిగతంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చిన సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అభినందనీయుడని రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు ముఖేష్ కుమార్ గౌడ్ అన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తన సొంత ఖర్చులతో నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంగతి విధితమే. దీనిలో భాగంగా ఆదివారం నాగార్జునసాగర్ లో ఆయా మండలాలకు చెందిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పిసిసి అధ్యక్షుడు ముఖేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు ముఖేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షి మాట్లాడుతూ ఎవరి సహకారాలు లేకుండా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుల సమస్యలను గుర్తించి వారికి చేయూతనివ్వాలని ఆలోచన రావడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మల్లయ్య, అనుముల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, గౌని రాజా రమేష్ పాల్గొన్నారు.



## రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు

# డ్రైవర్లకు మెరుగైన కంటిచూపు

### రహదారుల భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/చిట్యాల :** రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు మెరుగైన కంటి చూపు కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రహదారుల భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గల ఒక హోటల్ ఆవరణలో ఆదివారం డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్ళే వారు తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. డ్రైవర్లు, ప్రజలు రహదారి నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్, విజయవాడ రహదారిపై ప్రతి రోజు సుమారు 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని అన్నారు. చిట్యాల, నార్కట్‌పల్లి పరిధిలో రోడ్డు ప్రమాదాల స్పాట్‌లు ఎక్కువగా ఉన్నాయన్నారు. హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా మార్చేందుకు మే చివరినాటికి టెండర్లు పూర్తి చేసి పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉద్దేశించి చేపట్టిన కంటి వైద్య పరీక్షల శిబిరాలకు ప్రతీక్ ఫౌండేషన్ తరఫున అవసరమైతే తన సహకారాన్ని అందిస్తానని కోమటిరెడ్డి వెల్లడించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సమయాభావం, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో డ్రైవర్లు తమ కంటి పరీక్షలను నిర్లక్ష్యం చేస్తారని, వారి కోసం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే కంటి అద్దాలను అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, రవాణా శాఖ డిప్యూటి కమీషనర్ వాణి, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్, డిడిఎంహెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌డిఓ లావణ్య, ఆర్‌టిఓ అశోక్‌రెడ్డి, చిట్యాల, నల్లగొండ మున్సిపల్ చైర్మన్లు కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఎఎన్‌సి భవనాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/ నల్లగొండటౌన్ :** గర్భిణి స్త్రీల గర్భస్థ శిశు పరీక్షలకు సంబంధించి నూతనంగా నిర్మిస్తున్న ఎఎన్‌సి భవనాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆంటినేటల్ పరీక్షల భవన పనుల నిర్మాణానికి పూజ చేశారు. ఈ నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టాలని,అంతేకాక సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మంత్రి ఆసుపత్రిలోని పలు వార్డులను,విభాగాలను పరిశీలించారు. పోస్ట్ నేటల్ వార్డు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గైనిక్, జనరల్ సర్జన్, స్టాఫ్ నర్సుల కొరతను తీరుస్తామని ఆయన ఆసుపత్రి యాజమాన్యానికి తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మంచి సేవలను అందించిన బెస్ట్ డాక్టర్‌కు ప్రతినెల రూ.15000 పారితోషకం ఇచ్చే విధంగా ఇది వరకే ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ పొట్ల శ్రీనివాస్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిజిహెచ్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, డాక్టర్ వందన,డాక్టర్ స్వరూపారాణి ఉన్నారు. అనంతరం మంత్రి స్థానిక ఐటిఐలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.



## భూమిలేని రైతుల గురించి కెసిఆర్ ఎప్పుడైనా ఆలోచన చేశారా?

### రైతు భరోసాపై ప్రతిపక్షాలకు డిప్యూటీ సిఎం భట్టి కౌంటర్



**ప్రజాపక్షం/బీబీనగర్:** మిగులు రాష్ట్రాన్ని చేతుల్లో పెడితే భూమి లేని రైతుల గురించి ఏనాడూ ఆలోచించని బిఆర్ఎస్‌కు అసలు బుద్ధుందా.. అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు విమర్శలు చేశారు. ఆదివారం బీబీనగర్ మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12 వేలు ఇస్తోందని ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. బీజేపీ మాదిరిగా తాము పీఎం కిసాన్‌కు విధించినట్లుగా రకరకాల కండీషన్లను పెట్టలేదన్నారు. సాగుచేసే భూములకు ఎలాంటి షరతు లేకుండా రైతు భరోసా ఇవ్వబోతున్నామన్నారు. బీజేపీ వాళ్లు ఎంత తక్కువ మాట్లాడితే వాళ్లకు అంత మంచిదని భట్టి చురకలంటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం చేయబోతున్నామన్నారు. రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం క్లారిటీ ఇచ్చారు. దళితులకు మూడెకరాలు భూమి, ఇంటికో ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి అని చెప్పి బీఆర్ఎస్ పార్టీ నెరవేర్చిందా? నోరుంది. కదా అని ఏదిపడితే అది మాట్లాడటం, డబ్బుందికదా అని సోషల్ మీడియాలో ఏది పడితే అది ప్రచారం చేయించుకోవడం తగదని మండిపడ్డారు. మీ వల్ల ఈ రాష్ట్రం ఎంత దర్భరంగా మారిందో రాష్ట్ర ప్రజలకు అంతా తెలుసని కేటీఆ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాదిరిగా చేయని పనిని కూడా చేస్తామని చెప్పుకోమని రాష్ట్ర ఆర్థికపరిస్థితి దృష్ట్యా రూ.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. మంత్రి మండలి నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బట్టి పేర్కొన్నారు. ఆయన వెంట భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## సాగర్‌లో పర్యాటకుల కోలాహలం...

**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్కు పర్యాటకులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి విద్యార్థులు, పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. అదేవిధంగా రెం డేళ్ల తర్వాత తెలంగాణ పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చి న నాగార్జునసాగర్ శ్రీశైలం యాత్ర శనివారం నూతన సంవత్సరంలో మొదటిసారి పూర్తిస్థా యి పర్యాటకులతో బయలుదేరిన లాంచి ఆదివారం సాయంత్రం తిరిగి సాగర్ చేరుకుంది. నాగార్జునసాగర్ నుండి శ్రీశైలంకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని వ్యక్తపరిచారు.

## జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/భువనగిరి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండల, పట్టణ సమితి సమావేశం షర్ఫుద్దీన్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు హాజరై ప్రసంగిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు ప్రజాప్రతినిధులు ప్రకటిస్తున్నప్పటికీని ఆచరణలో ఎక్కడ కనిపించడం లేదన్నారు. భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న రోగాన్ని కూడా హైదరాబాద్ పంపిస్తున్నారని, హైదరాబాద్ పంపించకుండా ఇక్కడే వైద్య సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సం బంధిత అధికారులను కోరారు. రోగులకు సరిపడా మందులు అన్ని రకాల వైద్య పరికరాలు సమకూర్చాలని అన్ని రకాల ఆపరేషన్లు ఇక్కడే చేసే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి నిరుపేద కుటుంబాలు వందల సంఖ్యలో రోగులు వస్తున్నారని వారిని పట్టింపు చేయడం లేదని గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయని అన్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నారు తప్ప ఎలాంటి మార్పులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడ డాక్టర్లు నర్సులు స్టాఫు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ఆసుపత్రిని మెరుగుపరచడం కోసం ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్తామని తెలియజేస్తున్నాం అలాగే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు మా పార్టీ తరపున నిర్వహిస్తామని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యం లేనందున పరీక్షల కోసం ప్రైవేటు వారి దగ్గరికి రోగులు వెళ్తున్నారని వేలాది రూపాయలు చెల్లించలేక పోవుచున్నారని వెంటనే అన్ని రకాల పరీక్షలు ఆసుపత్రిలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వస్తుపుల అభిలాష్, సిపిఐ భువనగిరి మండల పట్టణ కార్యదర్శులు మరిపెల్లి రాములు, పుట్ట రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మ య్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, కౌన్సిల్ సభ్యులు బద్దం వెంకటరెడ్డి, కోట శంకర్, నాగపురి యాదగిరి, ముదుగుల ఉప్పలయ్య, వడి శ్రీను, గుండెబోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ సిబ్బంది అప్రమత్తం



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అన్నివేళలా పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సూచించారు. ఆదివారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులను పరిశీలించడం తో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా పటిష్టనిగాతో ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర, భువనగిరి ఏసీపీ రాహుల్ రెడ్డి, రూరల్ సీఐ చంద్రబాబు, రూరల్ ఎస్‌హెచ్ఓ సంతోష్ కుమార్‌లు ఉన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి : ఎంఎల్ఎ

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడులను ఉపాధ్యాయులు బలోపేతం చేయటానికి కృషి చేయాలని కోరారు. టిపిటిఎఫ్ సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షులు రాపర్తి రామనర్సయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బిక్షం మాట్లాడుతూ బాధ్యతలకు నిలబడుతూ ఉపాధ్యాయ సమస్యలు, హక్కుల సాధన కోసం పోరాడుతూ సంఘం ముందుంటుందని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పిఆర్‌సి అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 317 జీవో సమస్యలను పరిష్కరించాలని, విద్యారంగా అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ సంఘం జిల్లా నాయకులు హనుమంతరావు, కైలాసం వెంకటేశ్వర్లు, బడుగుల సైదులు, కొల్లు శ్రీనివాసరావు, మల్లెబోయిన సత్యనారాయణ, జిఆర్‌కె మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## చండూరులో సిపిఐకి పూర్వ వైభవం తేవాలి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలంలో గతంలో మాదిరిగా సిపిఐ కి పూర్వ వైభవం తీసుకురావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చండూరు మండలంలోని ప్రతి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 వసంతాల సందర్భంగా నల్లగొండలో జరిగన బహిరంగ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు బరిగెల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , తిప్పర్తి రాములు , కర్నాటి వెంకటేశం , దోటి వెంకన్న, బండమీది వెంకటేశం , సిహెచ్ ఊషయ్య, జెల్ల శ్రీను, గంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నియోకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి 118 మందికి సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్యానికి గురైన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సిఎంఆర్ చెక్కులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సవరాల సత్యనారాయణ, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



**ప్రజాపక్షం/కోదాడ:** నేడు జరుగుతున్నపోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని రేస్ ఐఐటి మెడికల్ అకాడమి చైర్మన్ బాణాల వసంత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు లు అన్నారు. ఆదివారం కోదాడ నియోజకవర్గ స్థాయిలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రశ్నపత్రాన్ని విడుదల చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈనెల 8న ఈ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమనబోయిన నరేష్, చందు కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, సిరికొండ శ్రీనివాస్, మహేష్, రమేష్, మధు, జ్యోతి, శైలజ, షఫియా, పుష్పాలత, శ్రావాణి పాల్గొన్నారు.

## ప్రజల వారధి 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజా సమస్యల వెలికితీస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కరించుటకు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే .శ్రీనివాస్ అన్నారు. ప్రజాపక్షం పత్రిక 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు చిలి వేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ కలకొండ సంజీవ తదితరులు పాల్గొన్నారు. బీజాపూర్ జిల్లాలో జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కలకొండ సంజీవ అన్నారు.



## ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న 'ప్రజాపక్షం' : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రజాపక్షం దినపత్రిక ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. రూరల్ క్యాంప్ కార్యాలయంలో ప్రజాపక్షం ప్రతినిధి కర్క రమేష్ ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సర 2025 క్యాలండర్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్తపత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా అంటూ ప్రజాసమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతాయన్నారు. జర్నలిస్టులతోనే మారుమూల ప్రాంతాలలో ఉన్న సమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికి వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపక్షం దినపత్రిక ప్రజలకు పనికొచ్చే వార్తలు కథనాలు రాస్తూ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. ఇలాంటి పత్రికలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసి ప్రజలను చైతన్యపరుస్తాయన్నారు. ప్రజలకు ఉపయోగపడే మరెన్నో వార్తలు, కథనాలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడీ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుల ఉమ్మాజీ నరేష్, ఆదే ప్రవీన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ, ప్రజాపక్షం అర్బన్ రిపోర్టర్ ఉమారావు, తాళ్ల శ్రీధర్, అహ్మద్, కిషోర్‌గౌడ్, సందీప్ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధి 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రశాంత్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేట లోని మంజీరా గార్డెన్ లో ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ను వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిస్వార్థంగా ప్రతి అక్షరం ప్రజల కొరకు అని నినాదంతో ప్రజల అవసరాలను గుర్తించి మంచి కథనాలను అందిస్తున్న పత్రిక ప్రజాపక్షమని వారు కొనియాడారు. 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించడం శుభసూచికమన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి నిట్టూరి నితలాక్షప్ప, పాపన్నపేట మాజీ ఎంపిటీసీ ఆకుల శ్రీనివాస్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్యతాండ రాజు, బాచారం గణేష్ ముదిరాజ్, చోటు, టీయూడబ్ల్యూజే మాజీ జిల్లా కార్యదర్శి శివచరణ్ సింగ్, టియుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడతుంది...



**ప్రజాపక్షం/జన్నారం:** ప్రజాపక్షం తెలుగు దినపత్రిక 2025 నూతన క్యాలెండర్‌ను ఇంధన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రజాపక్షం' తెలుగు దినపత్రిక గ్రామాల్లో, పట్టణాల్లో గల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజల పక్షాన నిలవడం చాలా సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా ఉపయోగకరమైన వార్తలను, వార్త కథనాలను అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్‌తో పాటు ఫారెస్ట్ సిబ్బంది, శంకర్, యశోద భాస్కర్ పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' ప్రజల వద్దకే సమాచారం



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల కేంద్రంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వ్యవహరించి సమస్యలను గుర్తించి ప్రజల వద్దకు సమాచారం తెలుపుతుందని అన్నారు. ఎప్పటికీ ప్రజల సమస్యలను ప్రజల మధ్య వారధిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ దుబాసి సంజీవ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐదవ రోజుకు చేరిన హమాలీ కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద హమాలీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా హమాలీ కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేష్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## సివిల్‌సప్లయి సమ్మెకు సంఘీభావం తెలిపిన డీలర్లు

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాం హమాలీలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నటువంటి సమ్మెకు లోకేశ్వరం మండల డీలర్లు సమ్మెకు సంఘీభావం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమములో మండలధ్యక్షుడు సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగన్ నాయకులు షేర్ ఖాన్ పాల్గొన్నారు.

## రెండు రోజులు సిసిఐ పత్తి కొనుగోలు నిలిపివేత

**ప్రజాపక్షం/ జైనూర్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ లో రెండు రోజులు సిసిఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జైనూర్ వ్యవసాయ మార్కెట్ శాఖ కార్యదర్శి ఇర్ఫాన్ అహేమద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులలో పత్తి నిల్వలు అధికం కావడంతో సోమ, మంగళవారం పత్తి కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, పత్తి కొనుగోలు పునః ప్రారంభ తేదీని తిరిగి తెలియజేస్తామని పేర్కొన్నారు.

# మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి





**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బిసి, ఎస్‌సి, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు, మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ అన్నారు. ప్రతి మహిళకు స్ఫూర్తినిచ్చిన కనిపించే దేవత సావిత్రిబాయి పూలే అని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం బిసి ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మహిళ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పురస్కారాలు బీసీటీయు జిల్లా అధ్యక్షులు వినోద్, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 126 మంది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిసి, ఎస్‌సి, ఎస్టీ, మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నగర మేయర్ దండు నీతూకిరణ్, డీఈఓ అశోక్, బీసీటీయు రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర బిసి, ఎస్‌సి, ఎస్టీ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ బీసీ కులగణన చేసి పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, గత ప్రభుత్వంలో బిసిలకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. సిఎం బిసిల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని సావిత్రిబాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించటం జరిగిందన్నారు. బిసి గురుకులాల్లో డైట్ ఛార్జీలు 40శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఉపాధ్యాయ సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. బిసి కులాల్లో పుట్టినందుకు మనం గర్వపడాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం సేవలందించిన కనిపించే దేవత సావిత్రిబాయి పూలే అని, మహిళలకు చదువు లేదని గుర్తింపి ఆనాడు సావిత్రిబాయి పూలేకు ఒళ్లో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. భర్త నుంచి విద్య నేర్చుకుని ఈనాడు ప్రతి మహిళ చదువుకునేలా స్ఫూర్తి నింపిన సేవమూర్తి సావిత్రిబాయి పూలే అని గుర్తు చేశారు. గతంలో 80శాతం బాలుర, 20 శాతం బాలికలు మాత్రమే చదువుకునే వారని, ప్రస్తుతం ఏ విద్యలో అయిన 60, శాతం బాలికలు 40 శాతం బాలుర ఉంటున్నారని, ఇలా మహిళలు ఈ రోజు చదువుకుని అన్ని రంగాలోల రాణిస్తున్నారంటే అది మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే అన్నారు. అవార్డులు తీసుకున్న ప్రతి మహిళ సావిత్రిబాయి అడుగుజాడల్లో నడుస్తూ మహిళ విద్య కోసం అహర్నిషలు కృషి చేయాలన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారం అందుకోవడం అభినందనీయమన్నారు. సావిత్రిబాయి పూలే పేరును స్మరించుకుంటున్నామంటే వారు చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, రత్నాకర్, నరేష్, రవీందర్, రవికుమార్, ఆంజనేయులు, మోహన్, రామకృష్ణ, రత్నాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐదు రోజులకు స్వర్ణ సివిల్ సప్లయి హమాలీల సమ్మె..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఎఐటియుసి అనుబంధం సివిల్ సప్లై హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుచున్న సమ్మె ఐదవ రోజుకు చేరింది.ఈ సందర్భంగా సమ్మెను సందర్శించిన, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ వారికి మద్దత్తు తెలిపారు. పెంచిన హమాలీ రేట్ల ల జి ఓ ను వెంటనే విడుదల చాయాలని డిమాండ్ చేసారు. జిఓ సాధనకు సోమవారం రాష్ట్ర వ్యాపితంగా కలెక్టరేట్ లో వినతి పత్రం ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, హమాలీలు, విజయవంతం చేయాలనీ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్. రాథోడ్ పుండాలిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సాయన్న, రాథోడ్ రమేష్, బాబులల్ కార్మికులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కుటుంబం జైలుకు వెళ్లే సమయం ఆసన్నం

దేశంలోనే జాబ్ క్యాలండర్ విడుదల చేసిన రాష్ట్రం తెలంగాణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లే సమయం ఆసన్నమైందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలించి ఏనాడు బీసీలపై పట్టించుకోలేదని, లిక్కర్ రాణి బీసీలపై మాట్లాడటం హాస్యస్పదమన్నారు. 2018 లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ క్యాబినెట్ లేకుండా ప్రభుత్వాన్ని నడిపారన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఎమ్మెల్యేలను ఎలా కొనాలని, ప్రభుత్వాన్ని ఎలా పడగొట్టాలని కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని అవి కలలుగానే మిగిలిపోతాయన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వటానికి సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కుల గణన పూర్తి చేశామని గుర్తు చేశారు. దేశంలోని అత్యధిక వరి ధాన్యం కోటి మెట్రిక్ టన్నులు పండించిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించిందన్నారు. ఈనెల 26న పంట పండించే రైతులందరికి రైతుభరోసా ఇవ్వనున్నామన్నారు. వ్యవసాయం చేయని గుట్టలు, లేఅవుట్ ప్లాట్లకు, కమర్షియల్ భూములకు, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు భరోసా ఇవ్వమని చెప్పారు. గత ప్రభుత్వం 21 వేల కోట్ల వ్యవసాయతర భూములకు రైతుబంధు ఇచ్చారని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టరన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు కష్టపడుతున్న మంత్రి రేవంత్ రెడ్డి అని, సబ్బండవర్గాల అభివృద్ధి కోసం పని చేస్తున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, నరేష్, నర్సయ్య, భోజన్న, ప్రవీన్, నీరడి లక్ష్మ ణ్, లింగం, మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన నిర్మల్ ఉత్సవాలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్మల్ ఉత్సవాల వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం వేడుకలు నేటి నుంచి 7వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పరిశీలించారు. పాఠశాలల విద్యార్థులు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, మహిళా స్వయం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలోని వస్తువులను పరిశీలించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లా చరిత్రను, సంస్కృతిక వారసత్వాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిర్మల్ మహోత్సవాల కార్యక్రమానికి జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/దండేపల్లి:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం గూడెం సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం నుండి సాగునీటిని విడుదల చేశారు. ముందుగా తానిమడుగు వద్ద 30 వ డిస్టిబ్యూటరి వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి పారుదల ఎస్ఈలు విష్ణు, రవీందర్, ఇఇ నారాయణ, డిఇ దశరథం, ఎఇ జాకిర్, రాజీవ్‌గాంధీ, సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపిపి గడ్డం శ్రీనివాస్, ఎంపిడిఓ జాగర్లమూడి ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీ ప్రారంభించాలంటే చెరకు సాగుకు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/బోధన్:** నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించాలంటే రైతులు చెరకు సాగుకు సిద్ధం కావాలని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ నియోజకవర్గంలోని సాలూరా మండలంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాలంపాడ్ గ్రామంలో రూ.45లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సంఘ భవన నిర్మాణాని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను దృష్టిలో పెట్టుకొని తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు కో ఆపరేటీవ్ బ్యాంకులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను దృష్టిలో పెట్టుకొని నిజాం చక్కర కర్మాగారంపై ఉన్న బకాయిలు 190 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అంతకు ముందు సాలూర మండల కేంద్రంలో రూ. 15లక్షలతో నిర్మించిన గోదాముల ప్రారంభోత్సవం, రూ. 13,50,000 లతో సంఘ కార్యాలయం గదుల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా బోధన్, సాలూరా మండలంలో ఇసుక అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇసుక విక్రయదారులకు హెచ్చరించారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇసుక ధరను నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ అధ్యక్షులు తారాచంద్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ ఏఎంసీ చైర్ పర్సన్ అంకు సంధ్య దాము, గంగారెడ్డి, శరత్, డీసీఓ శ్రీనివాస్, బ్రహ్మారెడ్డి, జనార్ధన్, సీఈఓ లు బస్వంత్ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సదర్మాట్ కెనాల్ చివరి ఆయకట్టు వరకూ నీటిని అందిస్తాం..

యాసంగి పంట సాగుకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్:** సదర్మాట్ ఆయకట్ట కెనాల్ పొలాలకు యాసంగి పంట కోసం నీటిని విడుదల చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.ఆదివారం సదర్మాట్ కెనాల్ కి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ యాసంగి పంట కోసం కెనాల్ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని,ఈ నీటి కోసం చాలా మంది ఈ సారి నీరు ఇస్తారో ఇవ్వరు అని అనుమానం వ్యక్తం చేశారని,అలాంటి అపోహలకు తావు లేకుండా నీటిని విడుదల చేశామని అన్నారు.ఈ కెనాల్ ద్వారా 13000 ఎకరాలకు నీరు అందుతుందని ఈ నీటిని వార బంది ప్రకారం ఏప్రిల్ వరకు నీటిని అందిస్తున్నామని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. రైతులందరూ నీరు వస్తుందని కదా అని ఏకకాలంలో నీటిని మళ్ళించి వృధా చేయకుండా జాగ్రత్త వాడుకోవాలని. చివరి ఆయకట్ట వరకు ఉన్న రైతులకు నీరు అందే విధంగా చూడాలని లేదంటే నీరు వృధాగా పోతుందాన్నారు. ఖానాపూర్ ఆయకట్ట రైతుల చిరకాల కొరిక అయినటువంటి బ్యారేజ్ నుండి నీటిని నేరుగా కెనాల్ కె వచ్చే విధంగా చేయాలన్న ప్రతిపాదన నా దృష్టిలో ఉందని దానిని కచ్చితంగా నెరవేరుస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం,నీటిపారుదల డిఈఈ నవీన్, ఏఈఈ నితిన్, పట్టణ అధ్యక్షుడు రమేష్, లక్ష్మీ పతి, ఆమంద శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేశ్వర్, మజీద్, రాజేందర్, ఖానాపూర్ మండల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి

ఎంఎల్ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం/మంచిర్యాల:** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ముఖ్యమని మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎ నివాసంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియుటిఎస్) 2025 డైరీ, క్యాలెండర్ ను ఎంఎల్ఎ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తుందని, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు, జిల్లా మాజీ అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సత్తయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పద్మ, మహాలక్ష్మి , మన్మోహన్, ఫైనాన్స్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుమన్, మంచిర్యాల మండల కార్యదర్శి శోభ, చెన్నూర్ మండల కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఉత్సవాలలో కానరాని చరిత్ర..సంప్రదాయం..!

బట్టల దుకాణాలు..టాటూ షాపులు..
నిర్మల్ హోటళ్లు చరిత్రకు ప్రతిబింబాలా..?
వెయ్యి ఊడలమర్రి..సర్వపిండి ఎక్కడ..?







**ప్రజాపక్షం/ప్రతినిధి:** నిర్మల్ జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా నిర్మల్ ఉత్సవాల పేరిట నిర్మల్ చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి తెలియపరిచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో నిర్మల్ చరిత్ర ఆనవాళ్లు ఎక్కడ కనిపించలేదని అక్కడికి వచ్చిన పలువురు విమర్శిస్తున్నారు.నిర్మల్ చరిత్రను ప్రపంచానికి తెలియజేసేందుకు నిర్మల్ ఉత్సవాలను ప్రచారం చేసినప్పటికీ, వ్యాపార సముదాయాల ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసినట్టు పలువురు విమర్శించారు. నిర్మల్ చరిత్రను చెరుపుతూ మహారాష్ట్ర, ఇతర జిల్లాలకు సంబంధించిన వ్యాపారాలను తీసుకు వచ్చి స్టాల్ లను ఏర్పాటుచేసి మన నిర్మల్ చరిత్రను దగ్ధం చేసే ప్రయత్నాలు జరగాయని వాపోతున్నారు. నిర్మల్ జిల్లా చరిత్ర అంటే దేశంలో ఓ గుర్తింపు ఉంది. ఆ చరిత్ర నిమ్మనాయుల గుట్టలు, వెయ్యి, ఊడల మర్రి, బాసర పుణ్యక్షేత్రం, నిర్మల్ కొయ్య బొమ్మలు, ఆదివాసీ తెగల చరిత్రలు ఎన్నో ఎన్నెన్నో ఉన్నప్పటికీ వాటిలో ఒక దాన్ని మినహాయించి మిగతా వాటిని ఎక్కడా కూడా ఏర్పాటు చేయకుండా బట్టల షాపులు, బజాజ్ ఎలక్ట్రికల్ షాపులు, మహారాష్ట్రకు సంబంధించిన ఆటలు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని మన నిర్మల్ సంస్కృతికి సాంప్రదాయాలకు వ్యతిరేకంగానే నిర్వహిస్తున్నారని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిస్తున్నారు. బలవంతంగా వ్యాపారస్తులపై ఒత్తిడి చేసి స్టాళ్లను ఏర్పాటు చేశారని ఆరోపణలు కూడా లేకపోలేదు. నిర్మల్ పట్టణం చుట్టూ చరిత్రకు ఆనవాళ్లు ఎన్నో ఉన్న వాటిని తుంగలో తొక్కారని నిర్మల్ చరిత్ర ప్రేమికులు ఆశ్చర్యానికి గురయ్యారు. నిర్మల్ జిల్లా తెలంగాణలో ఓ అంతర్భాగం. అలాంటి నిర్మల్ జిల్లాకు ఓ ప్రత్యేకమైన సంస్కృతి సాంప్రదాయం ఉంది. నాటి నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన వెయ్యి మందిని మర్రి చెట్టుకు ఉరి తీసిన ఆనవాళ్లు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. అలాంటి వాటిని విస్మరించారు. ఇక మహారాష్ట్ర నుండి ఇక్కడికి వచ్చిన తిండి పదార్థం జొన్న రొట్టె పిట్ల నిర్మల్ కు చెందిన సర్వపిండి, మక్క గుడాలు, తాటికల్లు ఇవి ఎక్కడ కనిపించలేదు.

**నిమ్మలను తాకట్టు పెట్టిన నిమ్మ నాయుడు చరిత్ర..**

క్రీస్తు శకం 1600 నుండి 1650 వరకు పులిమడుగు ఖిల్లాదర్ నిమ్మ నాయుడుని రావలసిన కప్పం కోసం అప్పటి సందర్ ఒత్తిడి చేయగా తన వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో నిమ్మ నాయుడు వాంకిడి కుంటి వెంకట్రాయుడి వద్దకు పోయి 30వేల రూపాయలు అప్పు తీసుకుని తన కిలాను తాకట్టు పెట్టిన సందర్భం,400 సంవత్సరాలకు పూర్వం ఇక్కడ కోటలు, బురుజులు, రాజభవనాలతో కళకళలాడుతూ ఉండేది. అలాంటివి ఎక్కడ ఏర్పాటు చేయకపోవడం కాస్త విస్మయానికి గురిచేసింది. నేటి తరానికి ప్రత్యక్షంగా వాటిని చూసే అవకాశం ఎలాగూ లేదు.ఈ నిర్మల్ ఉత్సవాలలో అయిన వాటిని పెట్టించి యువతకు వాటి చరిత్రను చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇంతటి చరిత్ర కలిగిన నిర్మల్ జిల్లాను వక్రీకరిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నిర్మల్ ఉత్సవాల పట్ల పలువురు మేధావులు, విద్యావేత్తలు విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం స్పందించి రేపు, ఎల్లుండి నిర్వహించే ఉత్సవాలలో నిర్మల్ చరిత్ర సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

## క్రీడ



# టీమిండియా నెక్స్ట్ సిరీస్

## ఎప్పుడు? ఎక్కడంటే..?

ఆస్ట్రేలియా పర్యటనను టీమిండియా ఘోర పరాజయంతో ముగించింది. ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 31తో చేజార్చుకుంది. 10 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆసీస్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సిరీస్ విజయంతో పాటు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. దాంతో టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ముగియడంతో టీమిండియా తదుపరి సిరీస్‌లు ఏంటా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. టీమిండియా తమ తదుపరి సిరీస్‌లను సొంత గడ్డపై ఆడనుంది. కీలక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ జట్టు ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం భారత పర్యటనకు రానుంది. అయితే ఈ సిరీస్‌ల ప్రారంభానికి ఇంకా 17 రోజుల సమయం ఉంది.

**ఐదు టీ20ల సిరీస్..**

ముందుగా ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 22 నుంచి ప్రారంభం కానుంది. భారత్ వర్సెస్ ఇంగ్లండ మధ్య తొలి టీ20 కోల్‌కతా వేదికగా జనవరి 22 నుంచి ప్రారంభం కానుంది. రెండో టీ20 చెన్నై వేదికగా జనవరి 25, మూడో టీ20 రాజ్‌కోట్ వేదికగా జనవరి 28న, నాలుగో టీ20 పుణే వేదికగా జనవరి 31న, ఐదో టీ20 ఫిబ్రవరి 2న ముంబై వేదికగా జరగనుంది. టీ20 మ్యాచ్‌లన్నీ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్నాయి.
టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జస్‌ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్‌తో సిరీస్‌లకు దూరంగా ఉండనున్నాడు. సూర్యకుమార్ యాదవ్ టీమిండియా టీ20 సారథిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్‌లతో కూడిన జట్టు ఈ సిరీస్ ఆడనుంది. టీ20 సిరీస్‌లో కుర్రాళ్లకు అవకాశం కల్పించే ఛాన్స్ ఉంది.

**మహమ్మద్ షమీ 'రీఎంట్రీ'!**

ఫిబ్రవరి 6నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 6న నాగ్‌పూర్ వేదికగా తొలి వన్డే, ఫిబ్రవరి 9న కటక్ వేదికగా రెండో వన్డే, ఫిబ్రవరి 12న అహ్మదాబాద్ వేదికగా మూడో వన్డే జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ వన్డే సిరీస్‌ను టీమిండియా వామప్‌గా వాడుకోనుంది. ఈ సిరీస్‌లోని ప్రదర్శన ఆధారంగా ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ఎంపిక చేయనుంది. వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఈ సిరీస్ బరిలో దిగనున్నారు. వన్డే మ్యాచ్‌లు మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కానున్నాయి.



## బుమ్రాతో గొడవలో కొన్‌స్టాస్‌దే తప్పు: గంభీర్


జస్‌ప్రీత్ బుమ్రాతో గొడవ పడిన విషయంలో ఆస్ట్రేలియా యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్‌దే తప్పని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఉస్మాన్ ఖవాజా, జస్‌ప్రీత్ బుమ్రా మాట్లాడుకుంటున్నప్పుడు మధ్యలో కొన్‌స్టాస్ జోక్యం చేసుకోవడం సరికాదని గంభీర్ అభిప్రాయపడ్డాడు. ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా జరిగిన తొలి టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బుమ్రాతో కొన్‌స్టాస్ గొడవపడ్డాడు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్‌ను బుమ్రాకొన్‌స్టాస్ గొడవపై ప్రశ్నించగా.. తనదైన శైలిలో బదులిచ్చాడు. 'కఠినమైన ఆటలో సున్నితంగా ఉండలేరు. అలాగని ఎవరూ బెదిరింపులకు దిగరు. బుమ్రాతో గొడవ విషయంలో కొన్‌స్టాస్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. అతనికి అక్కడ మాట్లాడే హక్కే లేదు. బుమ్రా, ఉస్మాన్ ఖవాజా సంభాషించుకుంటున్నప్పుడు మధ్యలో అతని వెళ్లాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ కోసం స్ట్రైకింగ్‌లో ఉన్న ఆటగాడు, అంపైర్, బౌలర్ మాత్రమే మాట్లాడుకొనే అంశం. అక్కడ కొన్‌స్టాస్ మాట్లాడాల్సిన అవసరం లేదు'అని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఓ హెడ్ కోచ్‌గా జట్టులోని ప్రతీ ఒక్కరిని సమానంగా చూసే బాధ్యత తనదని తెలిపాడు. 100 టెస్టలు ఆడిన ఆటగాడిని.. అరంగేట్ర ప్లేయర్‌ను ఒకేలా చూస్తానని స్పష్టం చేశాడు. 'జట్టులో అందర్నీ సమానంగా చూసే బాధ్యత నాది. కొందరికి ప్రాధాన్యం ఇచ్చి మరికొందరిని తక్కువ చేయడం నాకు ఇష్టం ఉండదు. జట్టులోని ప్రతీ ఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని నేను ఎప్పుడూ కోరుకుంటా. అందుబాటులో ఉన్నప్పుడు దేశవాళీ క్రికెట్ తప్పకుండా ఆడాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో నిబద్ధతతో ఆడాలనుకుంటే దేశవాళీ క్రికెట్‌ను మరిచిపోకూడదు.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

## చరిత్ర సృష్టించిన బుమ్రా..

### ఓడినా మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్!



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 31తో టీమిండియా కోల్పోయినా.. బుమ్రా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో 9 ఇన్నింగ్స్‌ల్లో 13.06 యావరేజ్‌తో 32 వికెట్లు పడగొట్టాడు. ఇందులో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత ఉండటం విశేషం. రెండు సార్లు 9 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియాతో అత్యధిక వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచిన బుమ్రా.. బిషన్ సింగ్ బేడీ(31 వికెట్లు) రికార్డ్‌ను అధిగమించాడు. ఐసీసీ టోర్నీల్లో మాత్ర మే ఓడిన జట్ల ఆటగాళ్లకు ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డ్స్ ఇస్తారు. ద్వైపాక్షి సిరీస్‌ల్లో గెలిచిన జట్టుకు చెందిన ఆటగాళ్లే ఈ అవార్డ్ అందజేస్తారు. కానీ ఈ సిరీస్‌లో బుమ్రా అత్యుత్తమ ప్రదర్శనకు ఫిదా అయిన నిర్వాహకులు అతనికి ప్లేయర్ ఆఫ్ ది అవార్డ్ అందజేశారు.




## గేమ్ ఛేంజర్.. 10కి సిద్ధం

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ అలాగే హీరోయిన్ అంజలి కూడా మరో హీరోయిన్‌గా మావెరిక్ శంకర్ మళ్ళీ తన కం బ్యాక్ కన్ఫర్మ్ అనే రేంజ్‌లో వినిపిస్తున్న చిత్రమే గేమ్ ఛేంజర్. ఎన్నో అంచనాలు నడుమ వస్తున్నా ఈ సినిమా గ్రాండ్ ప్రీ రిలీజ్ బ్రహ్మాండంగా నిన్ననే అయ్యింది. ఇక నెక్స్ట్ రిలీజ్ కోసమే సిద్ధంగా ఉండగా ఇపుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్ లేటెస్ట్‌గా సెన్సార్ ని పూర్తి చేసేసుకుంది. కొన్ని రోజులు కితమే సెన్సార్ సర్టిఫికెట్ వచ్చింది. ఇక లేటెస్ట్‌గా మేకర్స్ కూడా సినిమా సెన్సార్ పూర్తయ్యినట్టుగా ఓ పోస్టర్‌తో అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమాకి సెన్సార్ యూనిట్ వారు యూ/ఏ సర్టిఫికెట్‌ని అందించారు. సో ఫైనల్‌గా ఈ జనవరి 10కి థియేటర్స్‌లో బ్లాస్ట్ చేసేందుకు గేమ్ ఛేంజర్ సిద్ధం అయ్యిపోయింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా దిల్ రాజు నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

## రీల్





## 'ఎన్టీఆర్' సినిమా కోసం హీరోయిన్ 'ఫిక్స్'

సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే, పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంచ్ చేశారు. ఈ మూవీ టైటిల్ 'డ్రాగన్' అని ప్రచారంలో ఉంది. ఐతే, ఈ సినిమాలో హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్‌ను ఫిక్స్ చేసినట్లు ఆ మధ్య బాగా వార్తలు వచ్చాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. నిజంగానే రుక్మిణీ వసంత్‌ను ఈ సినిమాలో హీరోయిన్‌గా తీసుకున్నారని.. ఆమె ఇప్పటికే ఈ సినిమా కోసం తన లుక్ పై కసరత్తులు చేస్తోందని తెలుస్తోంది. ఇక విదేశాల్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పూర్తి చేసుకొని హైదరాబాద్ చేరుకున్న ఎన్టీఆర్ ఈ మూవీ కోసం నెలాఖరున కర్ణాటక వెళ్తారని తెలుస్తోంది. మొత్తానికి భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్' సినిమా గురించి నిత్యం ఏదొక రూమర్ వినిపిస్తూనే ఉంది.

## సాయిపల్లవి శివతాండవానికి నెటిజన్లు ఫిదా



అక్కినేని నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమాకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఐతే, 'తండేల్' చిత్రం నుంచి విడుదలైన 'శివ శక్తి' పాటలో సాయిపల్లవి డాన్స్‌పై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పూనకం వచ్చినట్లుగా ఆమె శివ తాండవం చేశారని, నాగ చైతన్య కూడా ఎప్పుడూ లేనంత ఎనర్జిటిక్‌గా స్టెప్పులు వేశారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా ఈ 'శివ శక్తి' పాట రూపంలో సాయిపల్లవి కెరీర్‌లో మరో స్పెషల్ సాంగ్ వచ్చి చేరింది. కాగా శ్రీకాకుళంలో శ్రీముఖలింగం అని ఓ పురాతన శివాలయం ఉంది. ఈ ఆలయంలో మహా శివరాత్రిని అపారమైన భక్తితో ఎంతో వైభవంతో గొప్ప పండుగగా నిర్వహిస్తారు. కాగా, ఈ ఆలయం ప్రేరణతో ఈ సినిమా కోసం ఈ శివరాత్రి పాటను ప్లాన్ చేసింది తండేల్ టీమ్. ఈ తండేల్ చిత్రం పాన్ ఇండియా సినిమాగా.. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానుంది.

## సంక్రాంతికి ప్రేమలో పడతారా? – నిత్యామీనన్

కథల ఎంపికలో ప్రత్యేకతను చూపించే కథానాయిక నిత్యామేనన్.. తమిళ కథానాయకుడు జయం రవితో కలిసి 'కాదలిక్క నేరమిల్లై' అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమకథా చిత్రాన్ని కిరుతిగ ఉదయనిధి తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లకు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న థియేటర్లలోకి రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్ర బృందం. ''ఎంత వద్దనుకుంటే.. అంతగా ప్రేమలో పడతారు. మరి మీరు కూడా ఈ సంక్రాంతికి ప్రేమలో పడతారా? అయితే సిద్ధంగా ఉండండి'' అని వ్యాఖ్యల్ని జోడించింది. రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు, లాల్, వినయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిత్య జాబితాలో 'ఇడ్లీ కడై', 'డియర్ ఎక్స్‌సెస్' సినిమాలున్నాయి.






# అన్నింటా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

బికెఎంయు జాతీయ ప్రధాన కార్యదర్శి బోరియా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇటి. నరసింహా, ఎం.బాలనరసింహ్మా, ఎఐడిఆర్‌ఎం జాతీయ నేతలు సుబ్బారావు, విర్యా పాండ్యన్ మనూజ్, శివకుమార్, రవీంద్ర చారి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొన్నారు. బహిరంగసభను ఉద్దేశించి రాజా ప్రసంగిస్తూ కులం అనేది భారతదేశానికే పెద్ద సవాల్ అని, అలాంటి కుల వ్యవస్థను రూపుమాపేందు కు మార్గం చూపుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా చట్టసభల సాక్షిగా అవమానించడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించిందన్నారు. రాజ్యాంగపరమైన పదవుల్లో ఉండి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన అమిత్ షా తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, లేకపోతే ప్రధాన మంత్రి మోదీ అమిత్ షాను భర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తూ ఇప్పటికే అనేక ఉద్యమాలను చేపట్టాయని రాజా తెలిపారు. సిపిఐ ఆవిర్భావం నాటి నుంచే దేశంలో పాతుకుపోయిన కుల వ్యవస్థ, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిందని, అంతకు ముందు మహాత్మా జ్యోతిబా పూలే, ఆ తర్వాత నారాయణగురు, పెరియార్ రామస్వామి పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమాలను నడిపారని రాజా చెప్పారు. ''దళితులు, ఆదివాసీల ఆర్థిక అభ్యున్నతికి దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికల ద్వారా నిధులు కేటాంచారు. అందుకు అనుగుణంగా ఆ తర్వాత ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి గత ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి దాని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసి ఈ సబ్ ప్లాన్‌లను నిర్వీర్యం చేయడమే కాకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ భజనపరులుగా మారారు'' రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రూపొందించిన రాజ్యాంగం స్థా నంలో మనువాదాన్ని అమలు చేసేందుకు కుట్ర లు పన్నిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఇస్ బార్ 400 పార్' అంటూ గత ఎన్నికల్లో ప్రచారం ని ర్వహించాయని, వీటిని ఈ దేశ ప్రజలు తిప్పికొట్టారని రాజా పేర్కొన్నారు. బాలనరసింహ్మా మాట్లాడుతూ భారత రాజ్యాంగం రచించిన నాటికి ఈ దేశంలో ప్రైవేట్ రం గంలేదని, 1990లో ఆర్థిక సంస్కరణల వల్ల నే డు పూర్తిగా ప్రైవేట్‌పరం అవుతున్న నేపథ్యంలో ఈ రంగంలో సైతం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలన్నారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలను ఈ పాలకులు ఒక్కొకటిగా అమ్మేస్తున్న ఈ తరుణంలో నిత్యం రిజర్వేషన్ల శాతం తగ్గిపోతోందని, దాని నుంచి దళితుల దృష్టిని మళ్లించేందుకు పాలకులు కులాల మధ్య చిచ్చులు పెడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో మాల మాదిగలు రిజర్వేషన్ల వర్గీకరణకు కోసం పరస్పరం పోట్లాడుకోకుండా ముందు ఉన్న రిజర్వేషన్ల కాపాడుకునేందుకు ఉద్యమించాలని సూచించారు. అంతకు ముందు సభకు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్‌కుమార్ స్వాగతం పలుకగా, ప్రజానాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

## జాతీయ రాజకీయాల్లో సన్నగిల్లిన

# తెలుగువారి పాత్ర

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. నోవాటెల్ హోటల్లో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య 12 వ మహాసభ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 'తెలుగు దనం తెలుగు ధనం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం దివంగత ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రపంచ తెలంగాణ సమాఖ్య ప్రారంభమైందన్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. దేశంలోనే హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని అన్నారు. దేశ రాజకీయాల్లో ఎంతోమంది తెలుగు వారు క్రియాశీలకంగా వ్యవహరించారు. వారిలో నీలం సంజీవరెడ్డి, పి.వి నరసింహారావు, నందమూరి తారక రామారావు, కాకా, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు లాంటి వారు ఆనాడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర వహించారు. కానీ ప్రస్తుతం దేశ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర సన్నగిల్లింది. చట్ట సభల్లో వారు మాట్లాడే దాని గురించి ఎదురు చూసే పరిస్థితి ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయం, సినీ, వాణిజ్య రంగాల్లో రాణించినా మన భాషను మరిచిపోవద్దని తెలిపారు. అన్ని రంగాల్లో రాణించేందుకు పరభాషా జ్ఞానం సంపాదించాలి, కానీ మాట్లాడేటప్పుడు మాత్రం తెలుగును ఉపయోగించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. గతంలో ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మలయాళం మాట్లాడేవారు ఉండేవారు. కానీ ఇప్పుడు నువ్వు మాట్లాడే వారు కనిపించడం గర్వంగా ఉందని చెప్పారు. తెలుగు భాషను గౌరవిస్తూ ఈ మధ్య కాలంలో మా ప్రభుత్వ జీవోలను తెలుగులో ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. నేను విదేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లిన సందర్భంలో ఎంతోమంది తెలుగువారు నన్ను కలిశారు. వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగువారు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, తెలంగాణ అభివృద్ధికి సహకరించలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రైజింగ్ నినాదంతో 2050 అభివృద్ధి ప్రణాళికలతో మేం ముందుకు వెళుతున్నాం. ప్రపంచంలో అత్యున్నత నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన పునరుద్ఘట్టించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడేలా పెదగాలని, అందుకు కలిసి ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోని గొప్ప నగరాలతో పోటీ పడింది. అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని, ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి పద్ధతిలో పర్మిషన్లు వెంటనే ఇవ్వడానికి సం సిద్ధంగా ఉన్నట్లు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి, ప్రపంచ తెలుగు ఫడరేషన్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కూలిన హెలికాప్టర్

(మొదటి పేజీ తరువాయి)

కాగా, ఆ తరువాత తిరిగి కోస్ట్‌గార్డ్ విమాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటలకు ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కూలిపోయినట్లు పోర్‌బందర్ ఎస్‌పి భగీరథ్‌సిన్హా జడేజా తెలిపారు. హెలికాప్టర్ రన్‌వే సమీపంలో కూలిపోగా, వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయన్నారు. కొద్దిసేపటి తరువాత అగ్నిమాపక శకటాల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, హెలికాప్టర్ శిథిలాల నుంచి ముగ్గురు సిబ్బందిని వెలికి తీసి ఆసుపత్రికి తరలించామన్నారు. అప్పటికే ఇద్దరు మృతి చెందగా, ఆ తరువాత మరొకరు ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధితులను ఇంకా గుర్తించలేదని పోలీసులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 2వ తేదీన కూడా ఐసిజికి చెందిన ఎఎల్‌హెచ్ ఎంకె–3 హెలికాప్టర్ అరేబియన్ సముద్రంలో కూప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది మరణించారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఎఎల్‌హెచ్ హెలికాప్టర్లలో కీలకమైన రక్షణ చర్యలకు హిందూస్థాన్ ఏరోనాటికల్ సంస్థ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గతేడాది కూడా ఈ శ్రేణి హెలికాప్టర్లు ప్రమాదాలకు గురయ్యాయి. వీటిల్లో డిజైన్ సమస్యలు ఉండటంతో చాలా చోట్ల వీటిని వాడటంలేదు. మార్చి 8న మన నౌకాదళానికి చెందిన ఎఎల్‌హెచ్ ధ్రువ్ ముంబయి తీరంలో ప్రమాదానికి గురైంది. అందులోని ముగ్గురు సిబ్బందిని నేవీ పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ సాయంతో రక్షించారు. ఈ ఘటన తర్వాత వీటి వినియోగాన్ని త్రివిధ దళాల్లో నిలిపివేశారు. కొన్నాళ్లకు సైన్యం వీటి సేవలను పునరుద్ధరించగా.. ఆ తర్వాత కొన్నాళ్లకే మరో హెలికాప్టర్ కూలిపోవడం గమనార్హం. నాడు సాంకేతిక లోపం తలెత్తడంతో జమ్ముకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లా అటవీ ప్రాంతంలో అత్యవసరంగా దించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ చాపర్ కుప్పకూలింది.

# దేశప్రజలు విచ్ఛిన్నం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ ఏంతో పోరాటం చేసిందన్నారు. దేశం కోసం వేలాది మంది బలిదానం చేశారన్నారు. సిపిఐ 99 ఏండ్లుగా ఏన్నో ఆటుపోట్లను ఎదుర్కొందన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ న్యాయం కోసం బాధితుల పక్షాన సిపిఐ పోరాటం చేస్తుందని చాడ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ వ్యక్తులకు రెడ్‌కార్పెట్ వేస్తూ ప్రజలు, కార్మికుల హక్కులను హరించే విధంగా మోదీ సర్కార్ పాలన కొనసాగిస్తుందన్నారు. మోదీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమైందని ఆరోపించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేదన్నారు. సంస్థానాల విలీనం, దున్నేవాడికి భూమి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటం చేసిందన్నారు. కేంద్రంలో బిజెపి సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కార్పొరేట్ శక్తుల కొమ్ము కాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దోపిడీపై కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొండలకు, గుట్టలకు పట్టాలు ఇచ్చిన ఘనత కెసిఆర్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల, సిద్దిపేట. మేడ్చల్. రంగారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్ తదితర నగరాల్లో బిఆర్‌ఎస్ సర్కార్ హయాంలో బిఆర్‌ఎస్ నేతలు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారన్నారు. సిరిసిల్లా జిల్లాలోనే 7వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిందని ఆరోపించారు. ఆభూములకు బిఆర్‌ఎస్ నేతలు రైతుబంధు సైతం తీసుకున్నారన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ధరణి పేదల పాలిట శాపంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రముఖ్యమంత్రి రైతుభరోసాలో ఎకరాకు 12 వేలు ఆర్థిక సాయం ఇవ్వటాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాని రైతును డిక్లరేషన్ ఇవ్వాలని నిర్ణయించటం సబబు కాదన్నారు. రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయవద్దన్నారు. రాష్ట్రంలో సర్వేనెంబర్ల ఆధారంగా భూ సర్వే చేపట్టి పల్లెపల్లెకు రెవెన్యూశాఖను విస్తరింపచేయాలన్నారు. మల్లన్నసాగర్, గండిపల్లి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలన్నారు. భూ నిర్వాసితులందరి సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు సిఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చిన సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేసి భూదోపిడీకి పాల్పడ్డారని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆరోపించారు. జీఓ 59 అడ్డుపెట్టుకొని సర్కార్ భూములను కాజేశారని ఆరోపించారు. సర్వే నెంబర్ 1340లో 2700లకు గజాలు బిఆర్‌ఎస్ నేతలు క్రమబద్ధీకరించుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ భూములు బిఆర్‌ఎస్ నేతలు ఆక్రమించారన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పేదలకు పంచే విధంగా కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములను అందించే విధంగా సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేతలు గడిపే మల్లేశం, అందే అశోక్, శంకర్, కిష్టపురం లక్ష్మణ్, బన్సిలాల్, వనేష్, జెర్రిపోతుల జనార్దన్, సంగెం మధు,ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com